వాసులు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

23-10-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 261 పేజీలు: 10+4 వెల: 6.50



దిగివచ్చిన పసిడి వెండి కూడా అదే దారి 2

సెర్బియా పార్లమెంటుపై ఉగ్రదాడి 5


# భారీ వర్షాలు!

## పలుజిల్లాలకు ఎల్లో అలర్ట్

### అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారే అవకాశం

### నవంబరు రెండో వారం నుంచి చలి తీవ్రత



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు22:** అగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఇవాళ తీవ్ర అల్పపీడనంగా బలపడినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అల్పపీడన ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారి ధర్మరాజు వెల్లడించారు. ఈ నెల 24, 25 తేదీల్లో దక్షిణ తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఆయన తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు పడుతున్నాయని వాతావరణశాఖ వెల్లడించింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కేంద్రీకృతమై ఉందని తెలిపింది. రాగల 12 గంటల్లో ఇది మరింత బలపడి వాయిగుండంగా మారే అవకాశం ఉందని వెల్లడించింది. దీని ప్రభావం దక్షిణ తెలంగాణ జిల్లాల్లోని నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్, నారాయణపేట్ జిల్లాలపై ఉంటుందని వివరించింది. బుధవారం దక్షిణ తెలంగాణ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసినప్పటికీ గురువారం, శుక్రవారం ఉమ్మడి మహబూబ్‌నగర్, వికారాబాద్, సంగారెడ్డి ప్రాంతాల్లో భారీ వర్ష సూచన ఉండే అవకాశం ఉందని ఐఎండీ అధికారి ధర్మరాజు తెలిపారు. 24, 25 తేదీల్లో భారీ వర్షాలు కురిసే నేపథ్యంలో పలు జిల్లాలకు యెల్లో అలర్ట్ జారీ చేశామని అన్నారు. నైరుతి రుతుపవనాలు విం మణ సమయంలో ఈశాన్యగాలుల రాష్ట్రంలో ప్రవేశిస్తుంటాయని తెలిపారు.

>>2

స్వామియే శరణం



ఇరుముడిని శిరసుపై ఉంచుకొని బుధవారం శబరిమలలో అయ్యప్పస్వామి దర్శనానికి వచ్చిన రాష్ట్రపతి ముర్ము –2లో

# రెండేళ్లలో నయా ఉస్మానియా



## ఆసుపత్రి నిర్మాణం త్వరగా సాగడానికి సమన్వయ కమిటీ

## వచ్చే వందేళ్ల అవసరాలకు తగినట్లుగా సౌకర్యాలు

## పనుల తీరుపై క్షేత్ర స్థాయి తనిఖీ

## ఇతర ఆసుపత్రుల నిర్మాణాల పర్యవేక్షణకు అధికారుల నియామకం: సమీక్షలో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు22:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం రెండేళ్లలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణంపై తన నివాసంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. నూతన ఆసుపత్రి అవసరాలకు తగినట్లు అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవాలని, ఇందుకు సంబంధించి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. అధునాతన పరికరాల ఏర్పాటుకు తగినట్లు గదులు, ల్యాబ్‌లు, ఇతరనిర్మాణలు ఉండాలని ఇంజినీరింగ్ అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఆసుపత్రి నిర్మాణ పనులతో పాటు స్థానికులకు ఇబ్బంది లేకుండా చుట్టూ రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. ఆసుపత్రి నిర్మాణ పనుల వేగవంతానికి వైద్యారోగ్య శాఖ, పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ కమిటీ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రతి పది రోజులకోకసారి సమావేశమై ఏవైనా సమస్యలుంటే పరిష్కరించుకుంటూ పనులు వేగంగా జరిగేలా చూడాలని సీఎం ఆదేశించారు. ఉస్మానియా నూతనఆసుపత్రి నిర్మాణంపూర్తయ్యాక అక్కడి బందోబస్తు.. ట్రాఫిక్ విధుల నిర్వహణకు సంబంధించి ముందుస్తుగానే

>>2

# పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ రేపటి నుంచి



## స్పీకర్ ప్రసాద్ కుమార్, ఛైర్మన్ సుఖేందర్‌రెడ్డి నేడు లాటిన్ అమెరికా నుంచి రాక

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు22:** తెలంగాణ ప్రస్తుత రాజకీయాల్లో కీలక అంశంగా మారిన ఫిరాయింపుల వ్యవహారం తుది దశకు చేరుతోంది. పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హతపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ 24వ తేదీ నుంచి చివరి దశ విచారణలు చేయబోతున్నారు. ఈమేరకు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే విచారణల సమయంలో అసెంబ్లీ పరిసరాల్లో ఆంక్షలు అమలు చేస్తున్నారు. ఇప్పటికే నలుగురు ఎమ్మెల్యేల క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తయిన నేపథ్యంలో, మిగిలిన కేసులు ఈ వారంలో ముగియనున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారంటూ ఫిరాయింపు ఆరోపణలు మొదలయ్యాయి. ఈ విషయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్, చింతా ప్రభాకర్, పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులు స్పీకర్‌కు పిటిషన్లు దాఖలు చేశారు. ఈనేపథ్యంలో సెప్టెంబర్ 29,2025 నుంచి విచారణలు ప్రారంభమై, అక్టోబర్ 4 వరకు మొదటి దశ పూర్తయింది. ఇప్పటికే రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి వంటి నలుగురు ఎమ్మెల్యేల క్రాస్‌ఎగ్జామినేషన్ ముగిసింది. ఈ ఎమ్మెల్యేలు తమ తరపు న్యాయవాదులతో సహా స్పీకర్ ముందు హాజరై, తాము బీఆర్ఎస్‌లోనే ఉన్నామని, ఫిరాయింపు జరగలేదని తమ వాదనలు వినిపించారు. అయితే, పిటిషనర్లైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాటికి సంబంధించిన ఆధారాలు, అఫిడవిట్లు, వీడియోలు సమర్పించారు. ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న మొత్తం 10 మంది ఎమ్మెల్యేల్లో ఇప్పటి వరకు నలుగురు ఎమ్మెల్యేలకు సంబంధించి ఇరుపక్షాల వాదనలు పూర్తయ్యాయి. ఇంకా మిగిలిన ఆరుగురిలో నలుగురు ఎమ్మెల్యేలు అఫిడవిట్లు ఇచ్చారు. కడియం శ్రీహరి, దానం

>>2

# నేడు మంత్రివర్గ సమావేశం

## 'స్థానిక' ఎన్నికలపై అడుగులు!

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి. హైదరాబాద్, అక్టోబరు22:** గురువారం నాడు తెలంగాణ కేబినెట్ సమావేశం కానుంది. మధ్యాహ్నాం 3 గంటలకు సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ భేటీ అవ్వనుంది. ఈ సమావేశంలో బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపై కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకోనుంది. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు, సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వం న్యాయ నిపుణుల కమిటీ వేసింది. న్యాయ నిపుణుల రిపోర్ట్ ప్రభుత్వానికి చేరింది. కేబినెట్ ఈ నివేదికపై చర్చించి బీసీ రిజర్వేషన్లపై

>>2



ఆస్ట్రేలియా పర్యటనలో అక్కడి అధికారులతో మంత్రి శ్రీధర్‌బాబు

# రాష్ట్రంలో అంతర్జాతీయ ఎడ్యుకేషన్ సిటీ

## విదేశీ వర్సిటీల కోసం ప్లగ్ అండ్ ప్లే క్యాంపస్

## ఆస్ట్రేలియా విద్యాసంస్థ వివిటి ఆసక్తి

## లైఫ్‌సైన్స్ రంగంలో కొత్త ఆవిష్కరణలు

## రాష్ట్ర ఐటి మంత్రి శ్రీధర్ బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు22:** తెలంగాణలో ప్లగ్ అండ్ ప్లే విధానంలో ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ సిటీని ఏర్పాటు చేసేందుకు ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ విద్యా సంస్థ విక్టోరియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) ఆసక్తి చూపిస్తోంది. ఈ మేరకు ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మెల్ బోర్న్ లో బుధవారం వీఐటీ బోర్డు సభ్యుడు, మాజీ పార్లమెంటేరియన్, ప్రస్తుత ఆస్ట్రేలియా ప్రధాని సన్నిహితుడు అలన్ గ్రిఫిన్ ప్రత్యేకంగా కలిశారు. అంతర్జాతీయవిద్యా, నైపుణ్యకేంద్రంగా తెలంగాణను

>>2

# కెసిఆర్‌తో కెటిఆర్, హరీష్ కీలక భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, అక్టోబరు 22:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో పార్టీ నేతలతో భేటీఅయ్యారు. బుధవారం



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో సమావేశం అయ్యారు. ఉపఎన్నిక ప్రచార వ్యూహాలు, రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు సమాచారం. జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఇన్‌చార్జిలతో గురువారం కేటీఆర్ సమావేశం కాబోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రచార వ్యూహాలపై ఇంచార్జీలకు చేయాల్సిన దిశానిర్దేశంపై కేటీఆర్ కు అధినేత కీలక సూచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశం కూడా ఈ భేటీలో చర్చకు రాబోతున్నట్లు సమాచారం. కాగా, జూబ్లీహిల్స్ బై పోల్ బీఆర్ఎస్ స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో కేసీఆర్ పేరు కూడా ఉంది. దీంతో ఆయన ప్రచారానికి వస్తారని గులాబీ శ్రేణులు పేర్కొంటున్నాయి.

# అణు విద్యుత్‌లోకి విదేశీ ఎంట్రీ

## 49 శాతం ప్రత్యక్ష పెట్టుబడులు

## కీలక సిఫార్సులు చేసిన కేంద్ర కమిటీ

## రాష్ట్రంలో 4 వేల మెగావాట్ల అణు విద్యుత్



**హైదరాబాద్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** దేశంలో అణువిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటులో విదేశీ సంస్థలు ఎంట్రీ ఇవ్వనున్నాయి. అణు విద్యుత్ రంగానికి సంబంధించి 49 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు (ఎఫ్‌డిఐ) తలుపులు బార్లా తెరవనున్నాయి. ప్రస్తుతం భారతదేశం ఈ రంగంలో విదేశీ పెట్టుబడులను అనుమతించడం లేదు. అయితే 2047 నాటికి 100 మెగావాట్ల అణు విద్యుత్ సామర్థ్యాన్ని కలిగి ఉండాలనే దేశ లక్ష్యాన్ని చేరుకోవడానికి రోడ్‌మ్యాప్‌ను రూపొందించడానికి ఆదేశించబడిన అంతర్ మంత్రిత్వ కమిటీ చేసిన ప్రతిపాదనలలో ఇవి ఉన్నాయి. ప్రభుత్వం ఈ రంగంలో విదేశీ సంస్థలను అనుమతించేందుకు అనేక మార్పులను చేపట్టాలని కేంద్రం నియమించిన ప్రభుత్వ కమిటీ సిఫారసు చేసింది. ఈ కమిటీ తన నివేదికను కేంద్రానికి తాజాగా సమర్పించినట్లు ఇంధన మంత్రిత్వ శాఖ సీనియర్ కార్యదర్శి ఒకరు తెలిపారు. ఈ

>>2



బుధవారం ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రాచకొండ సిపి సుధీర్‌బాబు

# కాల్పుల కలకలం

## మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో గోరక్షక్ సమితి కార్యకర్తకు కాల్పుల్లో తీవ్ర గాయాలు

**ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 22, ప్రభాత వార్త:** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గోరక్షక్ సమితి కార్యకర్త అయిన సోనుసింగ్ అలియాస్ ప్రశాంత్ సింగ్‌పై బుధవారం సాయంత్రం కాల్పులు జరిగాయి. సంఘటన వివరాలు స్థానిక పోలీసుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. కీసర మండలం నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లికి చెందిన సోనుసింగ్ గోవుల తరలింపు విషయంలో అడ్డుపడుతున్నాడని నగరంలోని బహదూర్ పురాకు చెందిన ఇబ్రహీం అనే వ్యక్తి మాట్లాడుదామని పోచారం

>>2

# చెక్‌పోస్టులు ఎత్తివేత

## అన్ని రహదారులపై వెంటనే తొలగించాలని సిఎం రేవంత్ ఆదేశం

## చెక్‌పోస్టుల మాటున గత పదేళ్లలో పాపాల పుట్టలా అవినీతి

## అక్రమ రవాణా నిరోధానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ పెంచుతాం: మంత్రి పొన్నం



హైదరాబాద్‌లో బుధవారం మీడియాతో మంత్రి పొన్నం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు22:** రాష్ట్రంలోని అన్ని రహదారులపై రవాణా చెక్ పోస్టులను వెంటనే ఎత్తివేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని అమలు చేస్తున్నట్లు రవాణా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం సాయంత్రం 5గంటలలోగా మూసివేతపై పూర్తి నివేదికను ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సీఎం ఆదేశాలతో తక్షణమే చెక్‌పోస్టుల కార్యకలాపాలు నిలిపివేయాలని ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆకస్మిక ఆదేశాలు జారీ చేశారు. చెక్ పోస్టుల వద్ద ఉన్న సిబ్బందిని వెంటనే వేరే బాధ్యతల్లో వినియోగించుకోవాలని ఉత్తర్వులు ఇచ్చారు. రహదారులపై వాహనాల రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని, చెక్ పోస్టుల వద్ద బోర్డులు, బ్యారికేడ్లు, తొలగించాలని డీటీవోలకు సూచించారు. చెక్ పోస్టుల వద్ద ఉన్న రికార్డులు, పరికరాలు, ఫర్నిచర్‌ను డీటీవో కార్యాలయాలకు తరలించాలని ఆదేశించారు. అన్ని ఆర్థిక, పరిపాలనా రికార్డులను సరిచూసి భద్రపరచాలని ఆదేశించారు. చెక్ పోస్టల మాటున గత పదేళ్లలో పాపాల పుట్టలా అవినీతి జరిగిందని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ఇప్పటికే వాహన్, సారథిలో 28 రాష్ట్రాలు ఉన్నాయి. గత 10 సంవత్సరాలుగా తెలంగాణ ఎందుకు చేరలేదు? అని పొన్నంప్రశ్నించారు. ఇప్పుడు మేము వాహన్, సారథిలో చేరాం. డేటా ట్రాన్స్‌ఫార్మింగ్ జరుగుతోంది. వాహన్ అమలు చేస్తున్నాం.. సారథి అమలు చేస్తాం, చెక్ పోస్టులు రద్దు చేసినా వాహనాల్లో అక్రమ రవాణా జరగకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్కువగా చేస్తాం అని పొన్నం చెప్పారు. వాహన్ ఇంకా సారథి అనేవి భారత ప్రభుత్వ రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ రూపొందించిన డిజిటల్ ట్రాన్స్‌పోర్ట్ ప్లాట్‌ఫార్మ్‌లు. ఇవి దేశవ్యాప్తంగా వాహన రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్‌లకు సంబంధించిన వ్యవస్థలను పూర్తిగా ఆన్‌లైన్‌లోకి తీసుకురావడానికి రూపొందించారు. 1. వాహన్ ముఖ్య ఉద్దేశ్యం.. దేశవ్యాప్తంగా వాహన రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఒకే డిజిటల్ ప్లాట్‌ఫార్మ్ లోకి తీసుకురావడం. 2. సారథి స్కీమ్.. డ్రైవింగ్ లైసెన్స్ కోసం ప్రవేశపెట్టారు. బుధవారం ఖైరతాబాద్ రవాణాశాఖ కార్యాలయంలో మీడియా సమావేశంలో మంత్రి పొన్నం అనేక అంశాలపై మాట్లాడారు. తెలంగాణలో చెక్ పోస్టులు రద్దు బుధవారం నుంచి అమలు చేస్తూ జీవో జారీ చేశాం. చెక్

>>2

# వాయు కాలుష్యంతో సూర్యుడు మసక!



## భారత్‌లో సౌరశక్తి లక్ష్యాలకు భారీ దెబ్బ

**హైదరాబాద్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** సౌర శక్తి రంగంలో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలవాలని లక్ష్యాలను నిర్ణయించుకుని సరికొత్త ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్న భారత్‌కు వాతావరణ కాలుష్యం రూపంలో సరికొత్త సవాల్ ఎదురవుతోంది. గడచిన మూడు దశాబ్దాలుగా దేశ వ్యాప్తంగా సూ ర్యరశ్మి భూమిని తాకే సమయం (ఎండ గంటలు) క్రమంగా తగ్గుతున్నట్లు శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడయ్యింది. వాము కాలుష్యానికి తోడు, వీటి వల్ల ఏర్పడుతున్న ధూళి, దీని కారణంగా భూమిపై సరిగ్గా వర్షించలేక ఆగిపోతున్న దట్టమైన మేఘాలు, దీనికి తోడుగా ఆయా ప్రాంతాలలోని వా తావరణ పరిస్థితులు వీటన్నింటికి కారణమని శాస్త్రవేత్తలు తేల్చారు. భారత్‌లోని ప్రముఖ విశ్వవిద్యాలయాలతో పాటు వాతావరణ శాఖకు చెం దిన ఆరుగురు శాస్త్రవేత్తల బృందం నిర్వహించిన ఈ అధ్యయన వివరాలను ప్రఖ్యాత సైంటిఫిక్ రిపోర్ట్స్ జర్నల్‌లో ఇటీవల ప్రచురితమయ్యింది. బ నారస్ హిందూ యూనివర్శిటీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియోరాలజి, భారత వాతావరణ శాఖకు చెందిన సైంటిస్టులు 1998 ను ంచి 2018 వరకు 20 ఏళ్ల కాలంలో దేశంలోని 20 వాతావరణ కేంద్రాల నుంచి సేకరించిన డేటాను విశ్లేషించారు. ఈ విశ్లేషణలో సంచలన విషయాలను వారు వెలుగులోకి తెచ్చారు. ఈశాన్య రాష్ట్రాల్లో స్వల్ప మినహాయింపులు వున్నప్పటికీ దేశంలోని దాదాపు అన్ని ప్రాంతాలలో ఏటా సూర్య రశ్మి గంటలు తగ్గుతున్నట్లు వారి పరిశోధనలో తేలింది. ముఖ్యంగా ఉత్తర భారతంలోని అమృత్‌సర్, ఢిల్లీ, హిమాయల పర్వతాలు, తూర్పు న వు న్న కోల్‌కతా, పశ్చిమాన వున్న ముంబాయి, గుజరాత్ సహా ఇతర ప్రాంతాలలో ఈ తగ్గుదల అత్యధికంగా వుందని సైంటిస్టుల పరిశోధనలో తేలింది.



ఉత్తరాఖండ్ ఉత్తరకాశి జిల్లాలో శీతాకాలం గంగోత్రి ధామ్ తలుపులు మూసివేసే సమయంలో బుధవారం భారీగా భక్తజనసందోహం

## అయ్యప్పను దర్శించిన రాష్ట్రపతి ముర్ము

**తిరువనంతపురం, అక్టోబరు 22:** కేరళలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమల అయ్యప్ప స్వామి వారిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దర్శించుకున్నారు. ఇవాళ ఉదయం పంబ నుంచి ఇరుముడితో ఆలయానికి చేరుకున్న రాష్ట్రపతికి.. అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాల ధరించి ఇరుముడితో 18 మెట్లు ఎక్కి అయ్యప్పను దర్శించుకున్నారు. అక్కడ ఇరుముడి సమర్పించి.. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ముర్ము ఓ రికార్డు నెలకొల్పారు. శబరిమల ఆలయాన్ని సందర్శించిన తొలి ప్రెసిడెంట్‌గా నిలిచారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక గదిలో రెండు గంటల పాటూ బస చేయనున్నారు. అక్కడే రాష్ట్రపతికి ప్రత్యేకంగా ఆహారం వండి వడ్డించనున్నారు. మధ్యాహ్నం 3:10 గంటలకు ముర్ము శబరిమల నుంచి బయల్దేరి వెళ్తారు. రాష్ట్రపతి పర్యటన నిమిత్తం ఆలయం వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.

## రాష్ట్రపతికి తృటిలో తప్పిన ప్రమాదం!

**తిరువనంతపురం, అక్టోబరు 22:** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కేరళ పర్యటనలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఆమె ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ల్యాండింగ్ సమయంలో బురదలో కూరుకుపోవడంతో కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. అయితే, భద్రతా సిబ్బంది వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తేవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నాలుగు రోజుల పర్యటన నిమిత్తం కేరళలో ఉన్నారు. ఈ పర్యటనలో భాగంగా బుధవారం ఆమె శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకోవాల్సి ఉంది. ఇందుకోసం కొచ్చిలోని ప్రమదం స్టేడియానికి హెలికాప్టర్‌లో చేరుకున్నారు. అయితే, హెలికాప్టర్ ల్యాండ్ అయిన సమయంలో దాని టైర్లు ఒకవైపు బురదలో పూర్తిగా దిగబడిపోయాయి. దీంతో అక్కడ ఉన్న భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయంతో హెలికాప్టర్‌ను అతి కష్టం మీద బురద నుంచి బయటకు నెట్టి సురక్షిత ప్రదేశానికి చేర్చారు. ఈ అనూహ్య ఘటనతో షెడ్యూల్ కొద్దిసేపు నిలిచిపోయింది. అనంతరం, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అక్కడి నుంచి శబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి బయలుదేరి వెళ్లారు. ఈ ఘటనతో అధికారులు భద్రతా ఏర్పాట్లపై సమీక్ష చేపట్టారు.

## ఎమ్మెల్యేల విచారణ రేపటి నుంచి

>> నాగేందర్ ఇంకా అఫిడవిట్లు సమర్పించలేదు. ఇక, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈనెల 24వ తేదీ నుంచి మిగిలిన నాలుగు కేసులపై మౌఖిక వాదనలు వినాలని నిర్ణయించారు. ప్రతి కేసులో ఇరు వర్గాలు (పిటిషనర్లు, ప్రతివాదులు) తమ వాదనలు వినిపిస్తారు. ఎమ్మెల్యేల విచారణ నేపథ్యంలో ఈనెల 24 నుంచి 31 వరకు అసెంబ్లీ పరిసరాల్లో ఆంక్షలు కొనసాగనున్నాయి. కాగా, లాటిన్ అమెరికాలోని బార్బడోస్ దేశంలో జరిగిన కామన్‌వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ కాన్ఫరెన్స్ పాల్గొనేందుకు వెళ్లిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ ఛైర్మన్ బండప్రకాశ్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు గురువారం ఉదయం హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. తెలంగాణ శాసనసభా బృందం ఈనెల 6వ తేదీన హైదరాబాద్ నుంచి బార్బడోస్‌కు బయలుదేరింది. అక్కడ నాలుగు రోజుల పాటుయ కాన్ఫరెన్స్ సదస్సులో పాల్గొన్న అనంతరం స్టడీ టూర్‌లో భాగంగా ఫ్రాన్స్,ఇటలీ దేశాలను పర్యటించారు.

## అణు విద్యుత్‌లోకి విదేశీ ఎంట్రీ

>> కమిటీలో అణుశక్తి శాఖ సంయుక్త కార్యదర్శి పిఎస్ కార్తిగేయన్, కేంద్ర విద్యుత్ అథారిటీ సభ్యుడు అజయ్ తలేగావ్కర్ సహా అధ్యక్షునిగా ఉన్న ఈ కమిటీలో అణుశక్తి శాఖ, భారత అణుశక్తి సంస్థ, విద్యుత్ మంత్రిత్వ శాఖ, ఎన్టీపీసీ, భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్ అధికారులు ఉన్నారు. కమిటీ సిఫార్సుల ప్రకారం 100 గిగావాట్ల అణుశక్తి లక్ష్యంలో స్వదేశీ ప్రెజరైజ్డ్ హెవీ వాటర్ రియాక్టర్ల నుండి 46.5 గిగావాట్లు, ప్రెజరైజ్డ్ వాటర్ రియాక్టర్ల నుండి 38.8 గిగావాట్లు, భారత్ స్మాల్ మాడ్యులర్ రియార్టర్లు, భారత్ స్మాల్ రియాక్టర్లు, ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ల నుండి ఒక్కొక్కటి 5 గిగావాట్లు ఉన్నాయి. లైసెన్సింగ్ ద్వారా ప్రభుత్వం నియంత్రించే అణు ఇంధన నిర్వహణకు సంబంధించిన కార్యకలాపాలను అనుమతించడం కూడా మరిన్ని సిఫార్సుల్లో ఉన్నాయి. ఇక అణు విద్యుత్ ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ లేదా విద్యుత్ వ్యాపారంలో పెట్టుబడి పెట్టడానికి వివిధ దేశాలకు చెందిన సంస్థలకు అవకాశం కలుగుతుంది. ఈ పెట్టుబడి ఆటోమేటిక్ మార్గంలో 100 వరకు ఉంటుంది, దీనికి ముందస్తు ప్రభుత్వ అనుమతి అవసరం లేదు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి దేశ అణు విద్యుత్ రంగంలో దీర్ఘకాలిక పెట్టుబడితో పాటు, దేశంలోని అణు విద్యుత్ కేంద్రాలపై గణనీయమైన నియంత్రణ లేదా ప్రభావాన్ని పొందనున్నాయి. ఇందుకు గాను ప్రస్తుతం ఉన్న చట్టానికి సవరణలు చేయాలని, ప్లాంట్ ఆపరేటర్లతో వారి ఒప్పందాలలో పరికరాల సరఫరాదారుల బాధ్యత పరిమితిని సైతం చేర్చాలని కమిటీ సూచించింది. అణు నష్టానికి సంబంధించిన నిబంధనలను పునరుద్ధరించాలని ఇది స్పష్టం చేసింది. అలాగే ప్రస్తుత ఫ్లోటర్ పాలసీకి బదులుగా, ప్రతి సంఘటనకు ఆపరేటర్లు రూ.1,500 కోట్లకు బీమా పొందగలిగేలా, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించే ఇండియన్ న్యూక్లియర్ ఇన్సూరెన్స్ పూల్ (ఐఎన్ఐపి) అందించే బీమా పాలసీని తిరిగి రూపొందించాల్సిన అవసరాన్ని ఇది నొక్కి చెప్పింది. ఇందుకు ఐఎన్ఐపి సామర్థ్యాన్ని పెంచడం అవసరమని పేర్కొంది. కాగా రాష్ట్రంలో అణు విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులపై సర్కార్ దృష్టిసారించింది. రాష్ట్రంలో 4 వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన అణు విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతోంది. అందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలియవచ్చింది. తదుపరి వచ్చిన ఫీడ్ బ్యాక్‌పై నిపుణుల కమిటీని కూడా ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో ప్రధానంగా అణు ఇంధన ఉత్పత్తికి కావాల్సిన వనరులు వివిధ ప్రాంతాల్లో ఉన్నట్లు ఇప్పటికే అధికారులు ఒక అంచనాకు వచ్చారు. కాగా రాష్ట్రంలో ప్రస్తుతం 14 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉండగా, అందుకు అనుగుణంగా ఉత్పత్తి చేయడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో పాటు థర్మల్ విద్యుత్ యూనిట్ సగటున 4 రూపాయలు వరకూ ఉండగా, సోలార్ విద్యుత్ యూనిట్ 2.15 రూపాయలకు లభిస్తోంది. ఇక రాత్రి వేళలల్లో ఎక్స్ఛేంజలో విద్యుత్ సేకరిస్తే యూనిట్‌కు 9 రూపాయల వరకూ చెల్లించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అణు విద్యుత్ కేంద్రాలపై దృష్టిసారించినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.

## నేడు మంత్రివర్గ సమావేశం

>> ప్రభుత్వం తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై సమాలోచనలు జరపనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న ఇద్దరు పిల్లల నిబంధనను రద్దు చేసే ఆర్డినెన్స్‌కు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. ఎస్ఎల్‌బీసీ పునరుద్ధరణ, కాళేశ్వరం పునరుద్ధరణ, తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల నిర్మాణం సహా పలు నీటి పారుదల ప్రాజెక్టులపై కేబినెట్ చర్చించనుంది. అలాగే ఎస్ఆర్ఎస్పీ రెండో దశకు రామిరెడ్డి దామోదర్ రెడ్డి పేరుకు ఆమోదం తెలిపే అవకాశం ఉంది. వీటితోపాటు మరికొన్ని ప్రభుత్వ పాలసీ విధానాలపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది.

## కాల్పుల కలకలం

>> పోలీస్‌స్టేషన్ పరిధిలోని యంనంపేట్ గ్రామ శివారులోని నిర్మానుష ప్రాంతానికి పిలిచినట్లు తెలిసింది. సోనుసింగ్ ఎపి 09 సీఎల్ 2736 స్విఫ్ట్ కార్లో వెళ్లి కిట్టి స్టీల్ సమిపంలో రోడ్డు ప్రక్కన కారు ఆపి రోడ్డు ప్రక్కన నిర్మానుష ప్రాంతానికి వెళ్లాడు. ముందస్తు పథకం ప్రకారం ఇబ్రహీం సోనుసింగ్‌పై గన్‌తో పలు రౌండ్లు కాల్పులు జరిపి పరారైనట్లు తెలిసింది. చాతిలో బుల్లెట్ గాయాలతోనే రోడ్డుపై వరకు బాధితుడు సోనుసింగ్ నడిచివచ్చి రోడ్డుపై కూప్పకూలిపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు గోరక్షక్ సమితి కార్యకర్తలు చికిత్స నిమిత్తం ఉప్పల్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుండి నగరంలోని యశోద ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించినట్లు తెలిపారు. సోనుసింగ్ ఆరోగ్య పరిస్థితి కొంచెం మెరుగ్గా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు సంఘంటన స్థలానికి చేరుకుని సంఘటనపై ఆరా తీశారు. పరారీలో ఉన్న ఇబ్రహీం అనే వ్యక్తి కోరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కాల్పులు జరిగిన చోట పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి సంఘటనపైఆరాతీస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## వారం - వర్జ్యం

23-10-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
విదియ రా.10.47
విశాఖ తె.4.41
వర్జ్యం : ఉ.9.21-11.09
దు.ఉ.9.56-10.43, 2) మ.2.36-3.23
శుభసమయం: ఉ.8.00-8.45
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** వృత్తి, వ్యాపారాలలో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి.

**వృషభం:** అనుకోని అతిధుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**మిథునం:** నూతన పెట్టుబడులు కొద్దికాలం వాయిదా వేయడం మంచిది.

**కర్కాటకం :** ముఖ్యవ్యవహారాలలో ఆచితూచి నిర్ణయాలు తీసుకొంటారు.

**సింహం:** దూర ప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు.

**కన్య :** జీవిత భాగస్వామి నుండి ధనలాభం పొందుతారు. వాహన సౌఖ్యం.

**తుల :** దైవ సంబంధిత కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృశ్చికం:** చర్చలు, శుభకార్యాలలో ఎక్కువగా పాల్గొంటారు. సోదరుల కలయిక.

**ధనుస్సు:** సంతానం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. క్రయ విక్రయాలకు దూరంగా వుండండి.

**మకరం:** ఎల్లవేళలా సలహాలను తీసుకోనే వారి వద్ద కాకుండా మరొక నిపుణుని సలహాలు తీసుకొంటారు..

**కుంభం:** వివాదాలకు దూరంగా ఉండండి. సాంకేతిక విషయాలపై ఆసక్తి చూపుతారు.

**మీనం:** శుభకార్యాలలో పాల్గొంటారు. కుటుంబ బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రాష్ట్రంలో అంతర్జాతీయ ఎడ్యుకేషన్ సిటీ

>> తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున తీసుకుంటున్న చర్యలు, ఇక్కడి అనుకూలతలు, ప్రగతిశీల విధానాలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, తెలంగాణ యువత ప్రతిభ, సమర్థవంతమైన నాయకత్వం తదితర అంశాలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వారికి వివరించారు. అనంతరం ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ సిటీ ఏర్పాటు ప్రతిపాదనపై సుదీర్ఘంగా చర్చించారు. విదేశీ వర్సిటీలు, ఉన్నతస్థాయి పరిశోధన కేంద్రాలు, నైపుణ్యాభివృద్ధి సంస్థలకు గ్లోబల్ హబ్ గా ఈ క్యాంపస్ ను అభివృద్ధి చేస్తామని విఐటి ప్రతినిధులు మంత్రి శ్రీధర్ బాబుకు చెప్పారు. సదరు సంస్థలు తమ కార్యకలాపాలను నిర్వహించుకునేలా ప్లగ్ అండ్ ప్లే విధానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌలిక సదుపాయాలతో ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ఈ ప్రతిపాదనపై మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు. స్థల పరిశీలన, తదుపరి చర్చల కోసం తెలంగాణకు రావాలని ఆహ్వానించారు. సమావేశంలో వీఐటీ ప్రతినిధి అర్జున్ సూరపనేని, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

**ఆస్ట్రేలియా వర్సిటీ ఆర్ఎంఐటీతో రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఓఐ**

అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా బుధవారం మెల్‌బోర్న్‌లోని ప్రముఖ యూనివర్సిటీ ఆర్ఎంఐటీతో రాష్ట్ర ప్రభుత్వం లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్ఓఐ)ను కుదుర్చుకుందని చెప్పారు. లైఫ్ సైన్సెస్ రంగంలో ఇన్నోవేషన్, పరిశోధన, అభివృద్ధి, ఉన్నత విద్య, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రెడీ టూ వర్క్ ఫోర్స్ తయారీ తదితర అంశాల్లో ద్వైపాక్షిక సహకారానికి ఈ ఒప్పందం దోహదపడుతుందన్నారు. రేపటి జీనోమ్ వ్యాలీకి ఇది ఒక బ్లూ ప్రింట్‌గా మార్గ నిర్దేశం చేస్తుందన్నారు. ఆసియాలోనే అగ్రగామిగా ఎదిగిన తెలంగాణ "లైఫ్ సైన్సెస్" ఆర్థిక వ్యవస్థను 2030 నాటికి 250 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 80 బిలియన్ డాలర్ల విలువ చేసే 2వేలకు పైగా జాతీయ, అంతర్జాతీయ దిగ్గజ ఫార్మా, బయోటెక్ కంపెనీలు ఇక్కడ ప్రస్తుతం కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. దేశంలో ఉత్పత్తయ్యే ఔషధాల్లో మన వాటా 40 శాతంగా ఉందన్నారు. ప్రపంచానికి అవసరమైన వ్యాక్సిన్లలో మూడింట ఒక వంతును మనమే అందిస్తున్నామన్నారు. ఎలీ లిల్లీ లాంటి దిగ్గజ ఫార్మా సంస్థలు తెలంగాణ వైపు చూస్తున్నాయని, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా తెలంగాణ యువతను లైఫ్ సైన్సెస్ రంగానికి అవసరమైన అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులుగా తీర్చే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందన్నారు. త్వరలోనే ప్రత్యేకంగా తెలంగాణ లైఫ్ సైన్సెస్ స్కూల్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తాజా ఒప్పందంలో భాగంగా ఉమ్మడి పిహెచ్‌డీ, స్టూడెంట్, ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం అందుబాటులోకి వస్తుందన్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేలా ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టులను చేపడతామన్నారు. పరిశోధక విద్యార్థులు బిట్స్ హైదరాబాద్, ఆర్ఎంఐటీ యూనివర్సిటీలలో నిపుణుల మార్గ నిర్దేశంలో రీసెర్చ్ చేసే అవకాశం లభిస్తుందన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఉమ్మడి అకడమిక్ కరిక్యులంను రూపొందించి విద్యార్థులను రేపటి అవసరాలకు అనుగుణంగా స్కిల్డ్ వర్క్ ఫోర్స్‌గా తయారు చేస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ సిఈఓ శక్తి నాగప్పన్, ఆర్ఎంఐటీ యూనివర్సిటీ డిప్యూటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ కేథరీన్ ఇట్సియోపాలోస్ లెటర్ ఆఫ్ ఇంటెంట్‌పై సంతకాలు చేశారు. తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాలతో కలిసి పనిచేసే అవకాశం దక్కడం సంతోషంగా ఉందని ప్రొఫెసర్ కేథరీన్ ఇట్సియోపాలోస్ అన్నారు. ఈ ఒప్పంద ద్వారా లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా మారుతుందన్నారు.



బుధవారం హైదరాబాద్‌లో ఉస్మానియాపై అధికారులతో సమీక్ష చేస్తున్న సిఎం రేవంత్

## రెండేళ్లలో నయా ఉస్మానియా

>> తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోలీసు శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. ఆసుపత్రికి వివిధ రహదారులను అనుసంధానించే ప్రణాళికలు ఇప్పటి నుంచే రూపొందించాలని ఆర్ అండ్ బీ అధికారులకు సీఎం సూచించారు...హైదరాబాద్‌తో పాటు వివిధ జిల్లాల్లో నిర్మాణంలో ఉన్న ఆసుపత్రులు, మెడికల్ కళాశాలల నిర్మాణానికి సంబంధించి ప్రతి నిర్మాణానికి ఒక అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. నిర్మాణాలపై 24 గంటలపాటు ఆ అధికారి పర్యవేక్షించేలా పూర్తిస్థాయి బాధ్యతలను అప్పగించాలని సీఎం సూచించారు. వచ్చే జూన్ నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు వి.శేషాద్రి, శ్రీనివాసరాజు, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, డీజీపీ శివధర్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు వికాస్‌రాజ్(ఆర్ అండ్ బి స్పెషల్ సిఎస్), క్రిస్టియానా జోంగ్తూ(వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి, ఇలంబర్తి(ఎంఏయుడి సెక్రటరీ), ముషారప్ అలీ ఫరూఖీ, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన తదితరులు పాల్గొన్నారు.

**26.30 ఎకరాల్లో ఆసుపత్రి నిర్మాణం**

ఉస్మానియా జనరల్ ఆసుపత్రి నూతన భవనానికి జనవరి 31న సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. గోషామహల్ మైదానంలో ఉస్మానియా ఆసుపత్రి నూతన భవన నిర్మాణం చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఈ కొత్త ఆసుపత్రి భవనం 2 వేల పడకలతో 26.30 ఎకరాల్లో నిర్మిస్తున్నారు. రూ.2,400 కోట్లతో 14 అంతస్తుల్లో భవనాన్ని నిర్మిస్తున్నారు. అత్యాధునిక వైద్య సౌకర్యాలతో 30 విభాగాల్లో వైద్య సేవలు అందించనున్నారు. కొత్త ఆసుపత్రిలో రోబోటిక్ సర్జరీలు చేపట్టే విధంగా సౌకర్యాలు కల్పించనున్నారు. నూతన ఆసుపత్రి రావడంతో 20 శాతం వైద్యుల సంఖ్య పెరగనుంది. రోజూ దాదాపు 5 వేల మందికి ఓపీ సేవలందించేలా అభివృద్ధి చేయనున్నారు. స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ కేంద్రంగా ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవనం నిర్మాణం కానుంది.

## భారీ వర్షాలు!

>> ఇవి పూర్తిస్తాయిలో విస్తరిస్తున్నాయని అన్నారు. అక్టోబర్, నవంబర్, డిసెంబర్‌లో తుపానులు ఎక్కువగా ఏర్పడే అవకాశాలుంటాయని చెప్పారు. ప్రస్తుతం బంగాళాఖాతంలో అల్పపీడనంగా కొనసాగుతున్న ప్రాంతం గుర్తింపదగ్గ అల్పపీడనంగాను తరువాత రాగల 12 రోజుల్లో వాయుగుండంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయని అన్నారు. ప్రస్తుతం చలి తీవ్రత క్రమేపీ పెరుగుతోందని ఐఎండీ తెలిపింది. నవంబర్ రెండో వారం నుంచి చలి తీవ్రత గణనీయంగా పెరిగే అవకాశం ఉందని వెల్లడించింది. ప్రస్తుతం పొడిబారిన వాతావరణంతో పాటు ఎండతీవ్రత కూడా కొనసాగుతోందని చెప్పింది. స్థానికంగా ఏర్పడే క్యూములోనింబస్ మేఘం వల్ల మధ్యలో వర్షాలు కురుస్తున్నాయని వివరించింది. చలి తీవ్రత సాధారణంగా ఉత్తర తెలంగాణలో కనిపిస్తుందని ఐఎండీ అధికారి తెలిపారు. ఈ ఏడాది దక్షిణాది జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదవ్వడాన్ని పరిశీలించవచ్చని అన్నారు. చలి తీవ్రత కూడా ఉత్తర భాగంలోనే అధికంగా ఉంటుందని వివరించారు.



బుధవారం న్యూఢిల్లీలోని షాలిమార్ బాగ్ ప్రాంతంలోని ఛాత్‌పూజ వేడుకల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఢిల్లీ సిఎం రేఖాగుప్తా

## చెక్‌పోస్టులు ఎత్తివేత

>> పోస్టుల రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయంపై ప్రజల్లో అవగాహన కలిగించడానికి చర్యలు చేపడతాం. ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు సంబంధించిన అంశాలు పూర్తి పారదర్శకంగా ఉండేలా ఆన్ లైన్ లో జరగడానికి చర్యలు చేపట్టాం. చెక్ పోస్టులను రద్దు చేస్తూ రెండు నెలల క్రితం నిర్ణయం తీసుకొని.. ఈరోజు నుంచి అమలు చేస్తున్నాం. తెలంగాణలో ఈవీ పాలసీ తీసుకొచ్చిన తర్వాత రూ.577కోట్ల ట్యాక్స్ ప్రభుత్వం మినహాయించింది. ఈవీ వెహికిల్ అమ్మకాల షేర్ 0.03 నుంచి 1.13 శాతానికి పెరిగిందని పొన్నం తెలిపారు. ప్రజల్లో అవగాహన కలిగించడానికి,ట్రాన్స్పరెంట్‌గా ఆన్‌లైన్‌లో జరగడానికి చెక్కు పోస్టులను రద్దు చేశామని తెలిపారు. ఢిల్లీలో పొల్యూషన్‌లో ఉండే పరిస్థితి లేదని,ఇక్కడ అలాంటి పరిస్థితి లేకుండా ఉండడానికి ఇవి పాలసీ తీసుకొచ్చామన్నారు. నగరంలో 20 వేల ఎలక్ట్రిక్ ఆటోలకు అనుమతి ఇచ్చాం.. ఎల్‌పిజి,సిఎన్‌జి ఆటోలకు10వేలు చొప్పునఅనుమతి ఇచ్చామన్నారు. వాహనాలకు కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారంరేడియం స్టిక్కర్స్ అమలయ్యేలా తెచ్చామన్నారు.

**షోరూమ్‌లోనే వాహనాల రిజిస్ట్రేషన్!: మంత్రి పొన్నం**

షోరూమ్‌లోనే వాహనాల రిజిస్ట్రేషన్ చేసే అంశంపై ఆలోచన చేస్తున్నామని, ప్రజలు సహకరిస్తేనే ట్రాఫిక్ కష్టాలు, కాలుష్యం తగ్గుతుందన్నారు. రవాణా శాఖలో మధ్యవర్తులు లేకుండా చేస్తున్నామని, ఈ శాఖలో ఎఐ వినియోగాన్ని మరింత పెంచాలని నిర్ణయించామన్నారు. డ్రైవింగ్ మీద మంచి నైపుణ్యాలు పెంచడానికి అవగాహన కలిగించడానికి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రోడ్ సేఫ్టీ పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నామని, రోడ్ సేఫ్టీ చిల్డ్రన్ అవేర్నెస్ పార్క్ లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆటోమేటిక్ డ్రైవింగ్ లైసెన్స్ సిస్టమ్ తీసుకొస్తున్నాం, హై సెక్యూరిటీ ప్లేట్స్ తీసుకొస్తున్నామన్నారు. రోడ్ సేఫ్టీ క్లబ్స్ కాలేజీలలో అవగాహన కల్పించేలా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం క్యాష్ లెస్ ట్రీట్మెంట్ కార్యక్రమాన్ని తీసుకొచ్చింది, దాని అమలు పై మెడికల్, పోలీస్,నేషనల్ హైవేస్‌తో సమీక్షా సమావేశం నిర్వహించామన్నారు. రవాణా శాఖ రెవెన్యూ కలెక్షన్ చేసేందుకు 112 మంది ఎంఎంవిఐ లను నియమించి వారికి శిక్షణ ఇచ్చి తీసుకున్నామన్నారు. నలుగురు ఆర్టీవో లను గ్రూప్ 1 ద్వారా వచ్చారని పేర్కొన్నారు. తెలంగాణ పోలీస్ ,ఫారెస్ట్ మాదిరి రవాణా శాఖకు కూడా లోగో తీసుకున్నాం, ఇల్లీగల్, ఓవర్ లోడింగ్‌పై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు. రాష్ట్రంలో1.7కోట్లవాహనాలు ఉన్నాయని, రోడ్ ప్రమాదాలు తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.రవాణా శాఖ లోని 63 కేంద్రాల్లో కెమెరాల ద్వారా పర్యవేక్షణ జరుగుతుందని, బ్రోకర్ వ్యవస్థను అరికట్టడానికి కఠినచర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## రాజ్యాంగ సవరణ చేస్తే తొమ్మిదో షెడ్యూల్లో చేర్చక్కర్లేదు

### -బిసి రిజర్వేషన్లపై బివి రాఘవులు

**హైదరాబాద్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లుకు అసెంబ్లీలో మద్దతిచ్చి కేంద్రంలో బీజేపీ అడ్డుకుంటున్నదని సీపీఎం పొలిట్బ్యూరో సభ్యులు బివి రాఘవులు విమర్శించారు. బీసీల పట్ల మోసపూరితంగా నాటకం ఆడుతూ రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తున్నదని అన్నారు. సుప్రీంకోర్టు విధించిన 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేస్తే బీసీలకు స్థానిక సంస్థలతోపాటు అన్ని రకాలుగా 42 శాతం రిజర్వేషన్ అమలవుతుందన్నారు. బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తేసేందుకు రాజ్యాంగ సవరణకు సంబంధించిన బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. రెండురోజులపాటు= హైదరాబాద్లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్లో లో జరిగిన ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో బిల్లు ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి. పంపించారని గుర్తు చేశారు.

## దిగివచ్చిన పసిడి

### వెండి కూడా అదే దారి



**ముంబయి, అక్టోబరు 22:** బంగారం ధరలు భారీగా తగ్గుముఖం పడుతున్నాయి. కొద్ది రోజుల క్రితం తులం రూ. 1,30,000 దాటి రికార్డు స్థాయికి చేరిన బంగారం ధర ప్రస్తుతం తగ్గుతోంది.ఒక్కరోజులోనే తొమ్మిదివేల రూపాయలు తగ్గడం గమనార్హం. హైదరాబాద్ నగరంలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,25,250కి చేరుకుంది. 22 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ. 1,14,843గా నమోదైంది. నిన్నటితో పోలిస్తే బంగారం ధర దాదాపు రూ. 9 వేలు తగ్గింది. వెండి ధరలు కూడా గణనీయంగా తగ్గాయి. బుధవారం సాయంత్రానికి కిలో వెండి రూ. 7 వేలు తగ్గి, రూ. 1,58,000కి చేరింది. వారం రోజుల్లో వెండి ధర రూ. 28 వేలు తగ్గడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 4,022 డాలర్లకు పడిపోయింది. వెండి ధర 47.84 డాలర్లకు చేరింది. అమెరికాలో షట్ డౌన్, అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ఇటీవల బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. ధరలు నిత్యం సరికొత్త గరిష్ఠ స్థాయిలను తాకాయి. విలువైన లోహాలు రికార్డు స్థాయికి చేరుకోవడంతో పెట్టుబడిదారులు లాభాల స్వీకరణకు ఆసక్తి చూపారు. దీనికి తోడు డాలర్ బలోపేతం కావడం, అంతర్జాతీయ ఉద్రిక్తతలు తగ్గడం కూడా కారణమని బులియన్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. దీ పావళి పర్వదినం తర్వాత గోవర్ధన పూజ ముఖ్యమైనది. దేశంలోని చాలా ప్రాంతాల్లో 22వ తేదీన దీపావళి, గోవర్ధన పూజ, బలిపాడ్యమి, లక్ష్మీ పూజ నిర్వహిస్తారు. ఈరోజు సైతం బంగారం ఎక్కువగా కొనుగోలు చేస్తుంటారు. బంగారం ధరలు ఈ రోజు ఒక్కసారిగా పడిపోవడం కొనుగోలుదారులకు భారీ ఊరట కల్పించాయి. అయితే బంగారం ధరలు అన్ని ప్రాంతాల్లో ఒకే విధంగా ఉండవని చెప్పవచ్చు. స్థానిక పన్నులు, తయారీ ఖర్చులు, జీఎస్టీ వంటివి చాలా ప్రభావం చూపిస్తాయి. అమెరికా ఫెడ్‌రిజర్వు లోతైన రేటు కోతలు సూచించినా లేదా భౌగోళిక రాజకీయ పరిస్థితులు మళ్లీ తీవ్రస్థాయికి చేరితే బంగారం ధరలు మళ్లీపెరుగుతాయి. ఎందుకంటే ఇన్వెస్టర్లు తమ పొదుపు మొత్తం బంగారంపైకేమళ్లిస్తారు. అమెరికా డాలర్ పటిష్టం, దిగుబడులు పెరగడంతో ఐదు లేక పదిశాతం స్వల్పకాలికంగానే ఈ పతనం ఉంటుందని నిపుణులు అంచనావేస్తున్నారు.



శృంగేరి పీఠం ఉత్తరాధికారి శ్రీవిధుశేఖర భారతి స్వామిని ఆశీస్సులు తీసుకుంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

## విద్యాసంస్థలకు బకాయిలు చెల్లించాలి

### కేంద్రమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, అక్టోబరు 22 ప్రభాతవార్త:** ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిసరికాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. హైదరాబాద్ నల్లకుంటలోని శంకర మఠాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రెండురోజుల క్రితం నగరానికి వచ్చిన శృంగేరి పీఠం ఉత్తరాధికారి శ్రీవిధుశేఖర భారతి స్వామిని ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా శంకర మఠంలో కొలువుతీరిన శ్రీశారదాంబ అమ్మవారిని దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నల్లకుంట శృంగేరి మఠం ధర్మాధికారి సి.సత్యానారాయణ మూర్తి కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను శాలువతో సత్కరించారు. అనంతరం కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడారు. పెండింగ్ ఫీజులన్నీ చెల్లించేవరకు విద్యా సంస్థలకు అండగా ఉంటామన్నారు. ప్రభుత్వ ఒత్తిడికి విద్యాసంస్థల యాజమాన్యాలు లొంగవద్దని సూచించారు. వాయిదా పద్ధతుల్లో చెల్లింపులకు అంగీకరించవద్దన్నారు. ప్రభుత్వాన్ని బకాయిలు అడిగితే విజిలెన్స్ దాడులతో బ్లాక్‌మెయిల్ చేస్తారా అని ప్రశ్నించారు."బిహార్ ఎన్నికలకు డబ్బులు ఇక్కడి నుండే పంపుతున్నారు కదా, విద్యార్థుల భవిష్యత్తు కోసం బకాయిలు చెల్లించలేరా? తక్షణమే వాటిని చెల్లించాలని లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు తప్పవని, మంత్రులను రోడ్లపై తిరగనీయమన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలకు సంబంధించి భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ పార్టీలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. గత పదేళ్ల భారత రాష్ట్రసమితి పాలన, ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో ఈ నియోజకవర్గానికి ఒరిగిందేమీలేదని, జూబ్లీహిల్స్‌లో బిజెపి గెలవడం ఖాయమని బండి సంజయ్ తెలిపారు.

**అమిత్ షాకు బండి సంజయ్ శుభాకాంక్షలు:** కేంద్ర మంత్రి అమిత్ షాకు బండి సంజయ్ 'ఎక్స్' వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'నాకు రాజకీయ మార్గదర్శి, గురువు అమిత్ షా. దేశం ఫస్ట్ అనే ఆలోచనతో జీవించే, శ్వాసించే నేత ఆయన. రాజకీయాలను వ్యూహంతో, సేవతో చూడగల తత్వాన్ని అమిత్ షా నుంచే నేర్చుకుంటున్నా. ఎంతటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా అయోమయానికి గురికాకుండా ప్రశాంత మనసుతో ఆలోచించే నాయకుడు ఆయన. దీర్ఘాయుష్షు, ఆరోగ్యంతో నిండు నూరేళ్ల జీవించాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నా' అని బండి సంజయ్ తెలిపారు.



బుధవారం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

## వచ్చే నెల 8,9న పౌర హక్కుల సంఘం రాష్ట్ర 3వ మహాసభలు

**హైదరాబాద్,(సైఫాబాద్), అక్టోబరు 22ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర పౌర హక్కుల సంఘం రాష్ట్ర మూడవ మహాసభలు నవంబరు 8,9 తేదీలలో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతాయని సంఘం తెలిపింది. ఈ మేరకు బుధవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎన్.నారాయణరావు తదితరులు ఈ మహాసభలకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. 8వ తేదీ ఉదయం మొదటి సెక్షన్‌లో ప్రొఫెసర్ డి.నరసింహ్మారెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తారని, అలాగే పౌర హక్కుల సంఘం సీనియర్ నాయకుడు ప్రొఫెసర్ జి. హరగోపాల్, జస్టిస్ కోల్స్‌పాటిల్, భేలా బాటియా, కె.రవి, ప్రొఫెసర్ మనోరం జన్, ఎన్.నారాయణరావు, సోని సోరి, నర్ర పురుషోత్తం, ప్రొఫెసర్ సరోజ్‌గిరి, కె.శ్రీనివాస్, బి.రఘునాథ్, జె.లింగన్న తదితరులు ప్రసంగిస్తారని చెప్పారు. అనంతరం సౌహార్ధ ప్రతినిధుల సందేశాలు ఉంటాయని, ఆపరేషన్ కగార్‌పై నాటిక ప్రదర్శన, అనంతరం బహిరంగ సభ జరుగుతుందని, 9వతేదీన అంతర్గత సమావేశం కొనసాగుతుందని వారు తెలిపారు.




## హెచ్ఎంగా ఎస్జీటీ, వార్డెన్‌గా వాచ్‌మెన్

### సిర్పూర్ ఆశ్రమ పాఠశాలలో అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట

**సిర్పూర్(టీ),అక్టోబరు 22, ప్రభాతవార్త:** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ (టి) మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పీజీహెచ్ఎం మంజూరు ఉన్నచోట హైస్కూల్‌లో ఒక ఎస్జీటీకి ఇన్చార్జి హెడ్ మాస్టర్‌గా ఫుల్ అడిషనల్ చార్జ్‌గా బాధ్యతలను జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి బాధ్యతలు ఇచ్చారు. ఇదిలా ఉంటే వార్డెన్ మంజూరు ఉన్న పోస్టులో వాచ్ మెన్‌ను ఇన్చార్జి డిప్యూటీ వార్డెన్‌గా బాధ్యతలను అప్పజెప్పారు. గిరిజన విద్యార్థుల పట్ల, గిరిజన విద్యా పట్ల అధికారులకు ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుంది. నిబంధనలకు విరుద్ధంగా వీరిని నియమించడం ఎంతవరకు సమంజసమని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ పాఠశాలలో సుమారు 260 మంది గిరిజన విద్యార్థినులు ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్లుగా ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్ ఉండగా ఒక ఎస్జీటీకి హెచ్ఎంగా బాధ్యతలు అప్పజెప్పడం ఎంతవరకు సమంజమని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయంపై జిల్లా గిరిజన అధికారిని ప్రభాత వార్త వివరణ కోరగా ఇది మాకేం కొత్త కాదు, కొన్నిచోట్ల ఎస్జీటీని హైస్కూల్ హెడ్‌మాస్టర్‌గా నియమించిన దాఖలాలు ఉన్నాయన్నారు. స్కూల్ అసిస్టెంట్ ఎవరు ముందుకు రాకపోతే ఎస్జిటికీ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. త్వరలోనే హెడ్ మాస్టర్‌ను నియమిస్తామని చెప్పుకొచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన హెడ్‌మాస్టర్ డిప్యుటేషన్‌పై తిర్యానికి పంపించడం జరిగిందన్నారు. ఇకనైనా రెగ్యులర్ అర్హత కలిగిన హెడ్ మాస్టర్‌ను, వార్డెన్‌ను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## హైదరాబాద్‌లో మరో సైబర్ మోసం

### 70 యేళ్ల వృద్ధుడికి రూ.93 లక్షలు టోకరా

**హైదరాబాద్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** సైబర్ నేరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా వుండాలని పోలీసులు పదే పదే చెబుతున్నా నిత్యం ఈ తరహా మోసాలు జరుగుతూనే వున్నాయి. ట్రేడింగ్ పేరిట 70 ఏళ్ల వృద్ధుడికి సైబర్ నేరగాళ్లు ఏకంగా 70లక్షల రూపాయల టోకరా వేసిన ఘటన హైదరాబాద్‌లో వెలుగు చూసింది. గత జూలై నెల 17వ తేదీన జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం స్టాక్ మార్కెట్లో పెట్టుబడుల పేరుతో వాట్సాప్‌లో వచ్చిన సమాచారంతో మేడ్చల్‌కు చెందిన ఓ వృద్ధుడు స్పందించాడు. మొదట రాజ్‌కుమార్ పేరిట ఒక నేరగాడు ఆ తరువాత నిఖిత పేరిట ఇంకో నేరగత్తె తనతో మాట్లాడి పలుమార్లు 93 లక్షల ఏడువేల రూపాయలను కాజేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నెల 17వ తేదీన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టారు. ఈ కేసులో నగదు బదిలీపలు ఖాతాల నుంచి జరిగినట్లు పోలీసులు గుర్తించారు. అసలు నేరగాళ్లు విదేశాల్లో వుండి వుంటారని భావిస్తున్నారు.

సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై సిటీ పోలీసుల కొరడా..

# డ్రంకన్ డ్రైవ్ తరహాలో నిందితులను కోర్టులో హాజరు పరచాలని నిర్ణయం

**హైదరాబాద్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** జంట నగరాలలో ఇకముందు సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై కఠినంగా వ్యవహరించాలని పోలీసులు నిర్ణయించారు. ఇప్పటి వరకు జరిమానాలతో సరిపుచ్చుతుండగా ఇక ముందు ఈ తరహా నేరాలకు పాల్పడే వారిని మద్యం తాగి వాహనాలను నడిపే వారిని కోర్టులో హాజరు పరుస్తున్నట్లు జరిమానాలతో వదలకుండా నేరుగా కోర్టులో హాజరు పరచాలని ట్రాఫిక్ పోలీసు అధికారులు నిర్ణయించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల జరుగుతున్న ప్రమాదాల నివారణకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాఫిక్ పోలీసు అధికారులు చెబుతున్నారు. వారంరోజులుగా సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ చేబట్టిన ట్రాఫిక్ పోలీసులు ఇందులో భాగంగా నాలుగు వేల వరకు కేసులు నమోదు చేశారు. జంట నగరాలలో ఏటా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో సెల్‌ఫోన్ డ్రైవింగ్ కారణంగా ఘటనలు పదుల సంఖ్యలో వుండడం తెలిసిందే. దీనివల్ల అనేకసార్లు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడిపేవారు ప్రమాదాల్లో పడుతున్నారు. ఇందులో కొందరు మరణిస్తుండగా మరికొందరు తీవ్రంగా లేదా స్వల్పంగా గాయపడుతున్నారు. ఇంకొన్నిసార్లు వీరి కారణంగా ఇతరులు ప్రమాదాలలో పడి మరణించడం లేదా గాయపడడం జరుగుతోంది. రవాణాచట్టాల ప్రకారం సెల్‌ఫోన్ డ్రైవింగ్ తీవ్రమైన నేరం. సెల్‌ఫోన్ డ్రైవింగ్ మాత్రమే కాదు, సెల్‌ఫోన్‌లో సినిమాలు, లేదా వార్తలు చూస్తూ, చాటింగ్ చేస్తూ, పాటలు వింటూ వాహనాలు నడిపే వారి సంఖ్య కూడా ఇటీవల కాలంలో భాగా పెరిగింది. వీటివల్ల దేశ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నట్లు రవాణా శాఖ పేర్కొంది. ఈ విషయంలో కఠిన చట్టాలు వున్నా ఇంతకాలం పెద్దగా అమలుకు నోచుకోలేదు. అయితే ఈ చట్టాలను జంటనగరాలలో తొలిసారిగా కఠినంగా అమలు చేయనున్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసుల్లో పట్టుబడ్డ వారిని ఇక ముందు డ్రంకన్ డ్రైవింగ్ కేసుల తరహాలో కోర్టులో హాజరు పరచనున్నారు. డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో నిందితుల్లో కొందరికి జైలుశిక్ష పడుతున్నఉదంతాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దవుతున్న ఘటనలు అనేకం వుండడం తెలిసిందే. డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో అనేక మంది నిందితులకు నెలనుంచి మూడునెలల జైలు శిక్షపడిన ఉదంతాలున్నాయి. ఇలా జైలు శిక్షలకు గురైె జైలు జీవితం గడిపిన వారి డ్రైవింగ్ లైసెన్స్‌లను పదేళ్లనుంచిశాశ్వతంగా రద్దు చేయబడ్డాయి. మూడు అంతకు ఎక్కువగా డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారికి జైలు శిక్షతో పాటు భారీ జరిమానాలుకూడా కోర్టులు విధించడం గమనార్హం. ఇప్పుడు సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసుల్లో నిందితులకు ఈ తరహాశిక్షలు అమలు చేయాలని పోలీసు అధికారులు నిర్ణయించారు. మొదట హైదరాబాద్‌లో అమలుచేశాక సైబరాబాద్, రాచకొండలో అమలు చేయాలని భావిస్తున్నారు.

# పండుగులకు 12వేల ప్రత్యేక రైళ్లు

### జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ



**హైదరాబాద్ (తార్నాక), అక్టోబరు 22 ప్రభాతవార్త :** పండుగల వేళ స్పెషల్ ట్రైన్స్ దసరా, దీపావళి, ఛట్ పూజ పండగల సందర్భంగా రైల్వేల్లో రద్దీ సహజంగానే పెరుగుతోందని ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని రైలు ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా భారతీయ రైల్వే దేశవ్యాప్తంగా 12,011 ప్రత్యేక రైళ్లను నడిపిస్తోందని దక్షిణ మధ్య రైల్వే సంజయ్ కుమార్ శ్రీవాస్తవ వెల్లడించారు. ఈ మేరకు ఆయన సికింద్రాబాద్ రైల్ నిలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. రద్దీని తట్టుకునేందుకు ప్రత్యేక రైళ్లన్నీ 21 సెప్టెంబర్, 2025 నుంచి 30 నవంబర్, 2025 వరకూ నడుస్తాయన్నారు. ఇందులో దక్షిణ మధ్య రైల్వే 973 ప్రత్యేక రైళ్లను నడిపిస్తోందన్నారు. 21 సెప్టెంబర్ నుంచి 30 నవంబర్ మధ్యన వివిధ జోన్లకు సంబంధించిన స్పెషల్ ట్రైన్స్ తో కలిపి మొత్తం 2,285 రైళ్లు దక్షిణ మధ్య రైల్వే మీదుగా ప్రయాణిస్తున్నాయన్నారు. గతేడాది ప్రయాణించిన 1,924 రైళ్లతో పోలిస్తే ఈ సంవత్సరం 19 శాతం ఎక్కువగా ప్రత్యేక రైళ్లు దక్షిణ మధ్య రైల్వే మీదుగా ప్రయాణం సాగిస్తున్నాయని తెలిపారు. ఈ రైళ్లన్నీ ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమబెంగాల్, ఉత్తర ప్రదేశ్, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్ తదితర రాష్ట్రాల మీదుగా ప్రయాణం సాగిస్తున్నాయని చెప్పారు. 21 సెప్టెంబర్, 20 అక్టోబర్ మధ్య నెల రోజుల సమయంలో దక్షిణ మధ్య రైల్వే పెరిగిన రద్దీని దృష్టిలో ఉంచుకుని నడిపిన అదనపు రైళ్లతో కలిపి మొత్తం 1,010 ప్రత్యేక రైళ్లను నడిపిందిని చెప్పారు. ఇందులో 399 రైళ్లను జోన్ పరిధిలో నడపగా, 611 రైళ్లను ఇతర జోన్లకు నడిపింది. ఇవి గతేడాది ఇదే సమయంలో నడిపిన 684ప్రత్యేక రైళ్లతో పోలిస్తే 47 శాతం ఎక్కువ. ఈ సమయంలో ప్రయాణం సాగించిన రోజువారీ రైళ్లతోపాటుగా ఈ స్పెషల్ ట్రైన్స్ సేవలను దాదాపు 5కోట్ల మంది సద్వినియోగం చేసుకున్నారు. గతేడాది ఈ పండుగల సమయంలో 1అక్టోబర్, 2024 నుంచి 31అక్టోబర్, 2024 వరకు దాదాపు 4.5 కోట్లమంది దక్షిణమధ్య రైల్వేస్పెషల్ ట్రైన్స్, రెగ్యులర్ ట్రైన్స్ సేవలను పొందారని వెల్లడించారు.


# బల్లెం వీరుడు నీరజ్‌చోప్రాకు 'లెఫ్టినెంట్ కల్నల్ హోదా'



**న్యూఢిల్లీ, అక్టోబరు 22:** భారత మేటి జావెలిన్ త్రోయర్, ఒలింపిక్ పతక విజేత నీరజ్ చోప్రాకు అరుదైన గౌరవం దక్కింది. జావెలిన్ సూపర్ స్టార్ నీరజ్ చోప్రాకు భారతీయ ఆర్మీలో గౌరవప్రదమైన లెఫ్టినెంట్ కల్నల్ ర్యాంక్‌ను అందజేశారు. ఢిల్లీలోని సౌత్ బ్లాక్‌లో ఆయన్ను ఆ ర్యాంక్‌తో సన్మానించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నీరజ్ చోప్రా కుటుంబం కూడా ఈ ఈవెంట్‌ను ప్రత్యక్షంగా వీక్షించింది. పట్టుదలకు, దేశభక్తికి నీరజ్ చోప్రా నిదర్శనమని రాజ్‌నాథ్ అన్నారు. ప్రభుత్వ గెజిట్ ప్రకారం నీరజ్ చోప్రా నియామకం ఏప్రిల్ 16వ తేదీన జరిగింది. జూనియర్ కమీషన్డ్ ఆఫీసర్‌గా నయిబ్ సుబేదార్ ర్యాంకుతో నీరజ్ చోప్రా 2016 ఆగస్టులో భారతీయ సైన్యంలో చేరారు. నీరజ్ చోప్రాకు గతంలో పద్మశ్రీ, మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్‌రత్న, అర్జున అవార్డులు దక్కాయి. పరమ విశిష్ట సేవా మెడల్, విశిష్ట సేవా మెడల్ కూడా ఆయన గెలుచుకున్నారు. 2020లో టోక్యోలో జరిగిన ఒలింపిక్స్ క్రీడల్లో జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా స్వర్ణ పతకం గెలుచుకుని చరిత్ర సృష్టించారు. ఆ తర్వాత 2024 పారిస్ ఒలింపిక్ క్రీడల్లో రజత పతకం సాధించాడు. 2023 వరల్డ్ అథ్లటిక్స్‌లో గోల్డ్ మెడల్ కొట్టాడు. ఏషియన్, కామన్‌వెల్త్ గేమ్స్‌తో పాటు డైమండ్ లీగ్‌ల్లోనూ అతను స్వర్ణ పతకాలు గెలుచుకున్నాడు. నీరజ్ చోప్రా తన జావెలిన్‌ను అత్యుత్తమంగా 90.23 మీటర్ల దూరం విసిరి రికార్డు సృష్టించాడు. నీరజ్ సాధించిన విజయాలను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ కీర్తించారు. రాబోయే తరాలకు ఇన్‌స్పిరేషన్‌గా ఆయన నిలుస్తారన్నారు. పట్టుదలకు, క్రమశిక్షణకు నీరజ్ ఆదర్శప్రాయుడన్నారు.

# అర్థర్ రోడ్డు జైలు..బ్యారక్ నంబరు 12

### ఇదే మెహుల్ చోక్సీని ఉంచే సెల్, బెల్జియం కోర్టుకు చిత్రాలు,విడియోలతో నివేదిక ఇచ్చిన సిబిఐ



**ముంబయి, అక్టోబరు 22:** పిఎన్‌బి కేసులో రెండో ప్రధాన నిందితుడుగా ఉన్న ఆభరణాల వ్యాపారి మెహుల్‌చోక్సీని భారత్‌రప్పించి ఆతడిని ముంబయిలోని అర్థర్‌రోడ్డు జైలులో ఉంచాలని భారత ప్రభుత్వం అన్ని ఏర్పాట్లుచేసింది. ఇందుకు సంబంధించి ఆర్థర్‌రోడ్డులోచోక్సీని ఉంచే సెల్ మొత్తం వివరాలు, ఆతనికి కల్పించిన సదుపాయాలతోపాటు జైలులో ఉన్న మౌలికవసతులన్నింటిపైనీ విడియో, ఫోటో చిత్రాల నివేదికను బెల్జియం కోర్టుకు సిబిఐ ఈడీ అదికారులు అందచేసారు. ఆర్థర్‌రోడ్డుజైలులోని బ్యారక్‌నంబరు 12ను చోక్సీకోసం కేటాయించినట్లు అధికారులు తెలిపారు. 46 చదరపు మీటర్ల బ్యారక్‌లో రెండు సెల్స్ ఉన్నాయి. వాటిలో ప్రైవేటు టాయిలెట్ సౌకర్యం కూడా ఉంది. ప్రాథమిక వసతలున్నీ ఉన్నాయి. సెల్‌లో టివి సదుపాయం కూడా ఉంది. భారత జైళ్ల పరిమితికిమించిన ఖైదీలతో ఉన్నాయని, భద్రత లేదని చేసిన వాదనను ఖండిస్తూ భారత దర్యాప్తుసంస్థలు ఈ నివేదికను ఇచ్చాయి. అర్థర్‌రోడ్డు జైలులోని బ్యారక్ నంబరు 12 అంటే ముంబయి దాడుల కేసు నిందితుడు అజమ్మల్‌కసబ్ నిందితుడు ఉన్న బ్యారక్ అని కూడా చెప్పాలి. కోర్టు విచారణ, వైద్య సపర్యలకు మినహాయిస్తే చోక్సీ బయటకు వచ్చేందుకు అనుమతిలేదు. ఆయన కస్టడీ కూడా జ్యుడిషియల్ పర్యవేక్షణలోనే ఉంటుంది. భారత జైళ్ల అధ్వాన్నంగా ఉంటాయని, న్యాయవ్యవస్థలో స్వయంప్రతిపత్తి స్వతంత్రత లేదని అందువల్ల తమ క్లయింట్‌కు భద్రతలేదని చోక్సీ న్యాయవాదులు వాదించారు. అయితే కోర్టు వీటన్నింటినీ తిరస్కరించింది.

# జీవికా దీదీలకు 30 వేల జీతం: ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తాం



### కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తాం

### ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ హామీ

### కూటమిలో ఎలాంటి విభేదాల్లేవని స్పష్టీకరణ

**పాట్నా, అక్టోబరు 22:** బీహార్‌లో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఆయా రాజకీయ పార్టీలు హామీల వర్షం కురిపిస్తున్నాయి. తాజాగా ఆర్‌జెడి అగ్రనేత తేజస్వి యాదవ్ జీవికా సీఎం దీదీలకు నెలకు రూ.30 వేలు జీతంతో శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారు. బుధవారం పాట్నాలో తేజస్వి యాదవ్ మీడియాతో మాట్లాడుతూ మహాఘట్‌బంధన్ అధికారంలోకి వస్తే జీవికా దీదీ (కమ్యూనిటీ మొబిలైజర్లు)లను పర్మినెంట్ చేస్తామని, జీతాలు పెంచుతూనే ప్రభుత్వ ఉద్యోగి హోదా ఇస్తామని హామీనిచ్చారు. ఈ ప్రభుత్వంలో జీవికా దీదీలకు అన్యాయం జరిగిందని అందరికీ తెలుసు. వారి జీతం నెలకు రూ.30 వేలకు పెంచాలని నిర్ణయించాం. ఇది సాధారణ ప్రకటన కాదు, ఇది జీవికా దీదీల డిమాండ్ అని పేర్కొన్నారు. ఇది ప్రజల దీర్ఘకాల డిమాండ్ అని తెలిపారు. జీవికా దీదీలకు అదనపు అలవెన్స్ రెండు వేలతో పాటు ఆ క్యాడర్‌కు రూ.5లక్షల బీమా కల్పించనున్నట్లు చెప్పారు. అంతేగాకుండా రాష్ట్రంలోని కాంట్రాక్టు ఉద్యోగులందరికీ శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్దీకరిస్తామని తేజస్వి ప్రకటించారు. ఎన్నికల అజెండాను ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ వెల్లడించారు. సీట్ల పంపకం విషయంలో మహాఘట్‌బంధన్‌లో ఎటువంటి విబేధాలు లేవని, గురువారం అన్ని సమాధానాలు దొరుకుతాయని తేజస్వి యాదవ్ అన్నారు. ఇప్పటికే నామినేషన్ దాఖలు ప్రక్రియ పూర్తయిందని, అక్టోబర్ 24 నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తామని వెల్లడించారు. "నామినేషన్ దాఖలు ప్రక్రియ ముగిసింది. ఇప్పుడు ప్రచారం కోసం సమయం ఆసన్నమైంది. ఈసారి, బీహార్ ప్రజలు మార్పు కోరు కుంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో బీహార్ ప్రజలు విసుగు చెందారు. ఈ డబుల్ ఇంజిన్ సర్కార్ పాలనలో అవినీతి, నేరాలు పెరిగాయి. నిరుద్యోగం, వలసలతో బిహారీలు విసుగు చెందారు. ప్రస్తుత ప్రభుత్వం మేం గతంలో ఇచ్చిన హామీలను కాపీ చేస్తోంది" అని తేజస్వి యాదవ్ విరుచుకుపడ్డారు.



ఈగల్ పోలీసులకు పట్టుబడ్డ గంజాయి స్మగ్లర్లు. వారి వద్ద లభ్యమైన గంజాయి

## గంజాయి స్మగ్లర్లపై ఈగల్ దాడి

### 300 కిలోమీటర్లకు పైగా ఛేజింగ్

### తెలంగాణ నుంచి ఝార్ఖండ్ వరకు వెంటాడి పట్టివేత

**హైదరాబాద్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతున్న ఈగల్ (పూర్వపు టి.నాబ్) మరోసారి భారీ ఆపరేషన్ చేబట్టింది. ఈ సందర్భంగా 500 కిలోల గంజాయితో పాటు ముగ్గురు అంతరాష్ట్ర నేరగాళ్లను పట్టుబడ్డారు. దీనికి సంబంధించిన వివరాలను ఈగల్ డిజి సందీప్ శాండిల్యా బుధవారం మీడియాకు వెల్లడించారు. ఒడిషా నుంచి తెలంగాణ మీదుగా యుపిలోని వారణాసికి 500 కిలోల గంజాయిని ట్రక్కులో తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఈగల్ పోలీసులు మొదట ఖమ్మం సరిహద్దుల్లో నిఘా వుంచారు. ఈగల్ పోలీసులతో పాటు ఖమ్మం పోలీసులు కూడా వున్నారు. పోలీసులు తమను గమనిస్తున్నారని అనుమానించిన గంజాయి స్మగ్లర్లు తమ వాహనాన్ని దారి మళ్లించి ఛత్తీస్‌ఘడ్ నుంచి ఝార్కండ్ వైపు మళ్లించారు. దీనిపై సమాచారం అందుకున్న ఈగల్ పోలీసులు ఈ విషయాన్ని ఛత్తీస్‌ఘడ్‌తో పాటు ఝార్కండ్ పోలీసులకు సమాచారంఅందించి స్మగ్లర్లను పట్టుకోవాలని కోరారు. మంగళవారం రాత్రి ఖమ్మం సరిహద్దుల నుంచి ఛత్తీస్‌ఘడ్ మీదుగా ఝార్కండ్‌కు 300 కిలోమీటర్లకు పైగా స్మగ్లర్ల వాహనాన్ని వెంబడించిన ఈగల్ పోలీసులు నేరగాళ్లను రాంచి సమీపంలో పట్టుకున్నారు. ఈ సందర్భంగా 500 కిలోలతో వెళుతున్న గంజాయివాహనంతోపాటు స్మగ్లర్‌గా వుంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్న హరియాణాకు చెందిన నసీం ఖుమ్రుద్దీన్‌ను, అతని వద్ద గంజాయి కొనేందుకు రాంచి వద్దకు వచ్చిన హరియాణాకు చెందిన ముస్తాక్ ఖాన్, ఆరిఫ్‌లను అరెస్టు చేశారు. వీరిద్దరు కొంతకాలంగా వారణాసిలో వుంటున్నారు. కాగా గంజాయితోపాటు డ్రగ్స్‌కు సంబంధించి ఎలాంటి సమాచారం వున్నా వెంటనే 8712671111కు ఫోన్ చేయాలని ఈగల్ డిజి సందీప్ శాండిల్యా కోరారు.

## 42శాతం రిజర్వేషన్లు పార్టీ పరంగా ఒప్పుకోం

### చట్టబద్ధంగానే బిసి రిజర్వేషన్లు కేటాయించాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి ఎంపి ఆర్.కృష్ణయ్య లేఖ

**హైదరాబాద్, అక్టోబరు 22,ప్రభాతవార్త:** బిసిలకు 42శాతం రిజర్వేషన్లు పార్టీ పరంగా కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తుందని దీన్ని ఎట్టిపరిస్థితిల్లో ఒప్పుకునేది లేదని బిసి జేఏసీ చైర్మన్ ఎంపి.ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఈమేరకు బుధవారం సిఎం రేవంత్‌రెడ్డికి లేఖను పంపారు. "మాకు బిక్షం వద్దు..చట్టబద్దంగా ఇవ్వాలి..కేసు కోర్టులో ఉండగా తొందరదేనికి తీర్పువచ్చేవరకు వేచిఉండాలన్నారు. ఇటీవల తాము తలపెట్టిన బంద్‌కు అన్ని పార్టీలు అన్ని వర్గాల మద్దతు లభించిందన్నారు. బంద్ తీవ్రతను చూసైనా ప్రభుత్వం కళ్ళు తెరవాలని కోరారు. స్థానిక సంస్థలలో బీసీలకు ఇచ్చిన రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధ, చట్టబద్ధత, న్యాయబద్ధత చేయొచ్చని రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-డి-6 ప్రకారం రిజర్వేషన్లు నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. పైగా అసెంబ్లీలో బీసీ బిల్లు చట్టం చేశారు. జనాభా లెక్కలు తీసి న్యాయ బద్దం చేశారని కావున సుప్రీంకోర్టు అనేకసార్లు తీర్పులలో జనాభా లెక్కలు ఉంటే దాని ప్రకారం రిజర్వేషన్లు పెంచవచ్చని తీర్పు చెప్పిందని గుర్తుచేశారు. కావున కోర్టుకు ఎవరైనా వెళ్లిన బీసీల, కేసులు గెలిచే అవకాశం ఉందన్నారు. కావున ప్రభుత్వం చట్టప్రకారమే 42శాతం బిసి రిజర్వేషన్లు కేటాయించాలని కోరారు.

## విద్యుత్ సంస్థల్లో మరో 6 నెలలు సమ్మె నిషేధం పొడిగింపు

**హైదరాబాద్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** తెలంగాణలోని విద్యుత్ సంస్థల్లో సమ్మె చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం కొరఢా ఝుళిపించింది. రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో రానున్న 6 నెలలపాటు సమ్మెలను నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. దీంతో ఇప్పటికే విద్యుత్ సంస్థల్లో సమ్మెకు సంబంధించి అమల్లో ఉన్న నిషేధాన్ని మరో 6 నెలల పాటు పొడిగించినట్లయింది. ఈ మేరకు దీనికి సంబంధించి బుధవారం ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ ఆదేశాలు జారీ చేశారు. ట్రాన్స్కో, డిస్ట్రిబ్యూషన్ సంస్థలైన దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, జెన్కోలో విద్యుత్ ఉద్యోగులు ఎలాంటి సమ్మెకు దిగరాదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు నవంబర్ 10 నుంచి అమల్లోకి రానున్నాయని తెలిపింది. అయితే ఇంతకముందు మే 10 నుంచి నవంబర్ 9 వరకు తెలంగాణ విద్యుత్ సంస్థల్లో సమ్మెలపై నిషేధం విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా, తాజాగా వాటిని మరో6 నెలలు పొడిగించినట్లయింది. ఈ ఉత్తర్వులను అతిక్రమించిన విద్యుత్ ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని కూడా హెచ్చరించింది.

## వి.హెచ్ ఇంట్లో దీపావళి పూజలు

### హాజరైన డిప్యూటీ సిఎం, మంత్రులు

**హైదరాబాద్, అక్టోబరు 22,ప్రభాతవార్త:** దీపావళి పండగ సందర్భంగా బాగ్‌అంబర్‌పేట్‌లోని మాజీ ఎంపి వి.హనుమంతరావు ఇంట్లో బుధవారం నోము, సత్యనారాయణ వ్రతం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దీనికి డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రబాకర్, వాకిటి శ్రీహరి, మాజీ ఎంపి కెవిపి రాంచందర్‌రావు, పిపిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ మంత్రి జానారెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్ తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా వారికి విహెచ్ స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు.

BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL-II
AT: Triveni Complex, 1st Floor, Abids, Hyderabad
O.A. No. 675 of 2025
BETWEEN:
M/s. YES Bank Ltd. ....Applicant
And
Mr. Nagalla Rakesh ....Defendants
SUMMONS BY WAY OF PAPER PUBLICATION
To,
Mr. Nagalla Rakesh, S/o. N. Namosiva Rao
Aged about 41 years, Occ: Business R/o. P.No. 35, 3rd Floor, A & M Residency, R No. 16B, Gopal Nagar, KPHB Colony, Hyderabad - 500085
Also at: Mr. Nagalla Rakesh, C/o. R S Aqua Traders, R S No. 470/4, Akiveedu (Post), Akividu, West Godavari District - 534235.
Also at: Mr. Nagalla Rakesh R/o. 10, Mantirpalem, Nagaram, Guntur- 522262
....Defendant/s
Please take the summons in the above O.A. No. 675/2025 filed by the applicant for recovery of money of Rs.22,62,870.44/- against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "VAARTHA" daily newspaper and posted the matter to 25/11/2025.
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under;
(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted; (ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the Original Application; (iii) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties; (iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of assets over which security interest in created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal; (v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets of other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 25/11/2025 at 10.30 A.M. at Debts Recovery Tribunal-II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad-500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take notice that in case of default the Application will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this day 17th of October, 2025.
(By order of the Court)
Signature of the Officer
Authorised to issue Summons

తెలంగాణ ప్రభుత్వం
పురపాలక సంఘ కార్యాలయము, కోడంగల్, వికారాబాద్ జిల్లా
No. MCK/E/275/2025 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు తేది: 22.10.2025
కోడంగల్ పురపాలక సంఘము యందు ప్రభుత్వ జూనియర్ కాలేజీ యందు పెయింటింగ్ మరియు ఇతర మరమ్మతుల పనిని చేపట్టుటకు e-Procurement ద్వారా టెండర్లు పిలువబడ్డమైనది. 1) పనుల సంఖ్య: (01), 2) పనుల విలువ: రూ.15.00 లక్షలు, 3) బిడ్స్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 23.10.2025 ఉ.11.00 గం.లకు 4) బిడ్స్ డౌన్‌లోడింగ్, సమర్పించుటకు ఆఖరు తేది: 29.10.2025 మ.3.30 గం.లకు, 5) ప్రైస్ బిడ్ తెరుచు తేది: 29.10.2025 సా.4.00 గం.లకు. మిగతా వివరములకు https://tender.telangana.gov.in చూడగలరు లేదా కార్యాలయ పని వేళల యందు ఫోన్ నెం.7416595493 నకు సంప్రదించగలరు.
సం/- మునిసిపల్ కమిషనర్, పురపాలక సంఘం కోడంగల్
DIPR.No.9533-PP/CL/Advt/1/2025-26, తేది: 22.10.2025

వార్త

విద్య లేకపోయినప్పటికీ గర్వించేవాడు, దరిద్రుడైనప్పటికీ పెద్ద ఎత్తులు వేసేవాడు, పనులు చేయనప్పటికీ ధనాన్ని ఆశించే వాడు మూర్ఖుడు.

-లావోసు

# పేదరికం తగ్గుముఖం!

దేశంలో పేదరికం తగ్గిందని ఎంతోకాలంగా విడుదలవుతున్న సర్వే సంస్థల నివేదికలు, నీతి ఆయోగ్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. తాజాగా గ్లోబల్ మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ సంస్థ కూడా అదే చెబుతోంది. ఈ సంస్థ ఏటా తన సర్వే నివేదికలు అందిస్తూనే ఉంది. కేవలం 15 సంవత్సరాల వ్యవధిలోనే ప్రపంచ విలువను తగ్గించుకున్న 25 దేశాలలో భారత దేశం కూడా ఒకటి. మన దేశంలో 2021 నుంచి 2025 మధ్య 415 మిలియన్ల మంది ప్రజలు పేదరికం నుంచి గట్టెక్కిన వైనాన్ని యునైటెడ్ నేషన్స్ నివేదిక గతంలోనే వెల్లడించింది. ఇది నిజంగా అద్భుతమైన విజయం గానే భావించాలి. 2023 నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం 2016-2021 మధ్య దేశ జనాభాలో 10శాతం మంది పేదరికం నుంచి తప్పించుకో గలిగారని వివరించిం ది. ఇలాంటి సానుకూల మార్పులకు దోహదపడే జీవన ప్రమాణాల సూచికలలో గణనీయ ప్రగతి కనపడింది. 2005-2006లో సుమారు 645 మిలియన్ల మంది పేదరికంలో మగ్గుతుండగా ,ఆ సంఖ్య 2015-2016 నాటికి 370 మిలియన్లకు తగ్గింది. 2019-2021 లో దాదాపు 230 మిలియన్లకు తగ్గింది. అంటే దేశంలో ప్రగతిశీల ఆలోచనలు, దారిద్ర్య రేఖకు దిగువనున్న వారి ఆర్థిక స్థితిగతులను పెంచేలా అమలు చేస్తున్న వివిధ పథకాల ఫలితంగానే పరిగణనలోకి తీసుకోవాల్సిందే! ఏటా అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినంగా అక్టోబరు 17న జరుపుకుంటాము. అనుకున్న లక్ష్యాలు సాధించగలిగామో లేదో తెలుసుకునే ప్రక్రియలో ద గ్లోబల్ ఇండెక్స్ సంస్థఈ ఏడాది అక్టోబరు 18నాటికి పేదరిక స్థాయిని అంచనా వేసి, ప్రపంచ వ్యాప్తంగా పేదరికంలో మగ్గుతున్న వారి స్థితిగతులపై ప్రత్యేక నివేదికను విడుదల చేసింది. పేదరిక నిర్మూలన కోసం కృషి చేయాలని ఐక్యరాజ్య సమితి సంకల్పిస్తే భారత్ పేదరిక నిర్మూలన నినాదాన్ని అందిపుచ్చుకుంది. ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధిలక్ష్యాలలో 2030 నాటికి పేదరికాన్ని నిర్మూలించాలి.ఆనాటికి ప్రపంచ జనాభాలో ఆరు శాతం మంది అంతర్జాతీయ దారిద్ర్య రేఖకు దిగువనే ఉంటారని 2019 జూలైలో ఆ సంస్థ నివేదిక చెబుతోంది. 101 దేశాల్లో 23.1 శాతం మంది పేదరికంలో ఉన్నట్లు తేలింది. ఇందులో సగం 18 ఏళ్ల లోపు వారే. అధ్యయనం జరిపిన దేశాల్లో 17.5 శాతం వయోజనులు పేదరికంలో మగ్గుతుండగా, 33.8 శాతం చిన్నారులు ఆ దురవస్థలో కూరుకుపోయి ఉన్నారు. పేదరికాన్ని సామాజిక, ఆర్థిక సమస్యగా గుర్తించిన దేశాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయి. అదే బాటలో భారత్ కూడా నడుస్తోంది. ఇది ఈ నాటి సమస్య కాదు. ఐతే స్వాతంత్రం వచ్చిన తరువాత నుంచి ప్రభుత్వాలు సమాజంలో వెనుకబాటు తనాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని బీదల పాట్లు ఎలా ఉంటాయో అధ్యయనం చేసి మరీ పథకాలను అందుబాటులోకి తెచ్చారు. కనీస అవసరాలైన ఆహారం, గృహవసతి, దుస్తులు పొందలేని పరిస్థితిని పేదరికంగా పేర్కొంటాము. ఎన్ని ఆటంకాలు ఎదురైనా శాస్త్రీయ కోణంలో ఆలోచించి ప్రభుత్వాలు పేదరిక నిర్మూలన కోసం పాటుపడుతున్నాయని చెప్పాలి. ఇప్పుడొస్తున్న ఫలితాలనుబట్టి పేదరిక నిర్మూలన,సామాజిక పురోగతి కోసం చేపడుతున్న కార్యక్రమాలకు, పెరుగుతున్న ఆర్థిక అసమానతలు అతిపెద్ద సవాలుగా మారుతున్నాయి. పేదల అభ్యున్నతికి ఉపాధి కల్పనతొలిమెట్టు. ఆపై ఆర్థిక స్వావలంబన కోసం విద్య, వైద్యం,రుణ సదుపాయం, మెరుగైన మౌలిక సదుపాయాలుఅందుబాటులో ఉండాలి. ఒకప్పుడు సంపన్నులు, పేదలు అనే వర్గాల గురించి విస్తృత చర్చ జరిగింది.కానీ ఎంత చేసినా, ఏమి చేసినా మరో వర్గం దారిద్ర్యం అంచున ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. వాళ్లే నిరుపేదలు. ఇప్పుడా పరిస్థితులు మారాయి. 1990లో మొత్తం జనాభాలో 36 శాతం మంది పేదరికంలో ఉంటే, 2025 నాటికి అది 10శాతానికి తగ్గింది. 2030 నాటికి ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ ఆదాయం కనీస అవస రానికి అనుగుణంగా ఉండాలనేది భావన. ప్రపంచం నుంచి పేదరికాన్ని తరిమి కొట్టడం సహస్రాబ్ది, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో కీలకంగా చెప్పుకొన్న నేపథ్యంలో దేశాల మధ్య యుద్ధం కాదు, పేదరికంపై సమరం చేయాలని ఆ మధ్య భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపుతో పాటు పెద్దల అభ్యున్నతికి చేసిన ఆలోచనలకు కూడా సత్ఫలితాలను ఇచ్చింది. శ్రామికులకు ఉపాధి కల్పించే వ్యవసాయ స్థితిగతులను మెరుగుపరిస్తే వారికి జీవనోపాధి కలిగి ఆర్థికంగా ఎదుగుతారు. భారతీయ శ్రామికుల్లో తొంభై శాతా నికిపైగా అసంఘటిత రంగాల్లోనే పని. ఆయా రంగాల్లో వేతన భత్యాల విషయమై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించి వాటిని మెరుగుపరచి నప్పుడే పేదరికాన్ని పారద్రోలేందుకు ఆస్కారముంటుంది. ఉభయ తెలుగు రాష్ట్రాలలో కూడా పేదరికం తగ్గుముఖం పట్టిందని గ్లోబల్ ఇండెక్స్ సర్వే ఘంటాపథంగా చెబుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో 11.77 శాతం నుంచి 6.06కి తగ్గగా తెలంగాణలో 13.180 శాతం నుంచి 5.85 శాతానికి తగ్గింది. అందరికీ ఉపాధి కల్పించినట్లయితే పేదరికం, ఆదాయ అసమానతలను తగ్గించవచ్చు. ప్రభుత్వం, నీతి ఆయోగ్ ,ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించాలి. భారత్‌లో కొన్నిరాష్ట్రాలు ముఖ్యంగా బీహార్, ఉత్తరప్రదేశ్‌లలో కూడా గణనీయంగా పేదరికం తగ్గినట్లు ఈ సర్వే వివరిస్తోంది. ఐరాస లక్ష్యం నెరవేరాలంటే మరో అయిదేళ్ల చిత్తశుద్ధితో ఆయా రాష్ట్రాలు బడుగుల అభ్యున్నతిలో భాగంగా నిరుపేదల లక్ష్యంగా పనిచేయాలి.

మనిషికి మనసును మించిన మహాశత్రువు వేరొకరు లేరు. అందుకే మనస్సును జయిస్తే ప్రపంచాన్ని జయించవచ్చు.



గురునానక్

మనిషి వంటిపై దుస్తులు వేసుకున్నా ముఖం మీద చిరునవ్వు లేనిచో ముస్తాబు పూర్తికానట్లే.



మహాత్మా గాంధీ

# మార్కెట్ యార్డులు రైతులకిచ్చే భరోసా ఎంత?

***పరిస్థితులు అనుకూలించక పండించిన పంటకూడా అనుకున్న రీతిలో రాకపోవడం వల్ల కష్టపడి పంటలు పండించే రైతులు, కాంట్రాక్టు వ్యాపారుల మధ్య విభేదాలు పొడ చూపుతున్నాయి. వీటివలన ఎక్కువగా నష్టపోయేది రైతులే అనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. దళారులు మోసం చేసిన నష్టపోయేది రైతులే, మార్కెట్ యార్డులో నష్టం వచ్చినా నష్టపోయేది రైతులే, ప్రకృతి కన్నెర్ర చేసినా నష్టపోయేది రైతులే. ఎటుచూసినా నష్టపోయేది రైతులే అనే విషయం విస్మరించరాదు. ఏది ఏమైనప్పటికీ రైతులుపండించిన పంటకు వ్యవసాయ మార్కెట్ యార్డుల ద్వారా తగిన రీతిలో గిట్టుబాటు ధర వచ్చే విధంగా రైతులు లబ్ధి పొందవలసి ఉంటుందన్న అభిప్రాయాలు వ్యవసాయరంగ నిపుణులలో లేకపోలేదు. ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ యార్డులు గతంతో పోలిస్తే కొంత ఆధునికరించబడినప్పటికి, అన్నదాతలు చాలావరకు మధ్య దళారీల చేతుల్లో నష్టపోకుండా పండించిన పంటకు తగిన గిట్టుబాటు ధరవచ్చే విధంగా రైతన్నలకు భరోసా ఇచ్చేవిధంగా మార్కెట్‌యార్డుల నిర్వహణ మరింతగా ప్రామాణికంగా కచ్చితత్వం కలిగి ఉండాల్సిన ఆవశ్యకత ఉంది.***

దాడిశెట్టి శ్యామ్ కుమార్

దేశానికి వెన్నెముక అయిన రైతు అన్నదాతగా వ్యవసాయ రంగంలో ఎదురు అవుతున్న అనేక అవరోధాల మధ్య దేశ ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. ప్రజల జీవనానికి అవసరమైన నిత్యవసర ఆహార ఉత్పత్తులను, వ్యాపార వాణిజ్య పంటలను రైతులు సమృద్ధిగా పండిస్తూ వ్యవసాయ మార్కెట్ యార్డుల ద్వారా అమ్మకాలు జరిపి వినియోగదారులకు అందించేందుకు నిర్విరామ కృషి చేస్తున్నప్పటికీ, వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్ణయించే ధరలు రైతులకు తగిన గిట్టుబాటు ధర కల్పించే స్థాయిలో లేకపోతున్నాయా అనే వాదనలు రైతాంగం నుండి వినిపిస్తుంటాయి. పెట్టుబడి పెట్టి పండించిన పంటలను రైతులు వ్యవసాయ మార్కెట్ యార్డుకు తీసుకు వచ్చినప్పుడు మార్కెట్ కమిటీ నిర్ణయించిన ధరలు లాభసాటిగా ఉన్నా లేకున్నా అమ్మకాలు జరిపి రావాల్సిన పరిస్థితిలో రైతాంగం ఉందనే భిన్నాభిప్రాయాలు లేకపోలేదు. ఒకవేళ లాభసాటిగా లేని ధరకు అమ్మడానికి ఇష్టం లేకపోయినా మార్కెట్‌కు తీసుకొచ్చిన పంటదిగుబడిని తిరిగి మళ్లీ వెనక్కి తీసుకుపోవడం భారంతో కూడిన పని. మద్దతు ధర పలికే వరకు నిలువ ఉంచాలన్నా కోల్డ్ స్టోరేజీల్లో రోజు వారీ కిరాయి కట్టవలసిందే.సొంత రవాణా ఖర్చు భరించాల్సిందే, ఇలాంటి పరిస్థితుల్లో కొంతమంది మధ్య దళారీలు రైతులకు ఎక్కువ ధర ఆశ చూపి కొనుగోలు చేసుకునే క్రమంలో రైతులు మధ్య దళారుల చేతుల్లో మోసపోతున్న సంఘటనలు అడపాదడపా చోటు చేసుకుంటూనే ఉన్నాయి. సాధారణంగా రైతులు పండించిన వరి, మొక్కజొన్న, గోధుమ, పప్పు దినుసులు తదితర ఆహార పంటలతో పాటు పత్తి, పసుపు, మిరప లాంటి వాణిజ్య పంటలను అమ్మకానికి కొనుగోలుకు వేదికగా వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉంటున్నాయి. వ్యవసాయ మార్కెట్లో ఆయా పంటలకు నిర్దిష్టమైన ధరను ప్రభుత్వం మార్కెట్ కమిటీ నిర్ణయం మేరకు రైతులు పండించిన పంట ఉత్పత్తులను మార్కెట్ యార్డులు కొనుగోలు చేసి తిరిగి కావలసిన వారికి విక్రయాలు చేయడానికి ఒక నిర్దిష్టమైన చట్టబద్ధత కలిగిన టువంటి వేదికగా వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉంటున్నప్పటికీ రైతుల విషయంలో మార్కెట్ యార్డులు అనుకున్న స్థాయిలో రైతులకు లాభాలు చేకూర్చే విధంగా గిట్టుబాటు ధరలు ఉండటం లేవనే భావన రైతాంగంలో లేకపోలేదు. రైతులు పండించిన పంటను మార్కెట్ యార్డుకు తీసుకు వచ్చినప్పుడు తూకం వేసే విధానంలో గతంలో అనేక లోటుపాట్లు తెరపైకి వచ్చినా ప్రస్తుతం ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగంతో తూకం నిర్వహిస్తున్నా, తరచుగా మిషన్లలో సాంకేతిక లోపాలు ఏర్పడడం, కొన్ని సార్లు తూకంలో హెచ్చుతగ్గులు గోచరిస్తుండటంతో రైతులలో



గందరగోళ పరిస్థితులు నెలకుంటున్నాయా అనే సంశయం కలుగక మానదు. ఇలాంటి సందర్భాల్లో రైతులు పండించిన పంటలకు వ్యవసాయ మార్కెట్ యార్డులు నిర్దిష్టమైన వేదికగా ఉంటూనే రైతుల నుండి పంటలు కొనుగోలు చేసే క్రమంలో అయినా, వినియోగదా రులకు విక్రయించే రీతిలో గానీ విశ్వసనీయతతో పురోగతి సాధించేందుకు వ్యవసాయ మార్కెట్ కమిటీలు క్షేత్రస్థాయి లో మరింత కార్యచరణను చేపట్టాల్సిన అవసరం ఉంటుం దేమో. వ్యవసాయ శాఖ అధికారులు రైతులు పండించిన పంటను ఆన్‌లైన్‌లో అమ్ముకోవడానికి ఇ మార్కెట్ విధానం తీసుకు వచ్చినప్పటికీ, తరచుగా టెక్నికల్ విషయంలో అనేక సమస్యలు వస్తున్నాయి. ఈ సందర్భంగా రైతులు అనేక ఇబ్బందులు పడవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దళారీల చేతుల్లో రైతులు మోసపోకుండా వ్యవసాయ మార్కెట్లను ఆన్‌లైన్ విధానంలోకి తీసుకు రావడానికి ప్రవేశపెట్టిన నేషనల్ అగ్రికల్చర్ మార్కెటింగ్ విధానం రైతులకు ఆశాజనకంగా ఉన్నప్పటికీ, వాటి పనితీరును ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకునే రీతిలో ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు కలగకుండా మార్కెట్ కమిటీలు వీలైనంత తగా చూడగలిగితే రైతుకు పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర మార్కెట్లో ఉన్నప్పుడు ధరను ముందుగా రైతులు తెలుసుకునే వెసులుబాటు ఉంటుంది.కాబట్టి పండించిన పంటను గిట్టుబాటు ధర ఉన్నప్పుడు సరైన సమయంలో మార్కెట్ యార్డ్‌లకు రైతులు తీసుకుని రావడానికి మరింత ఆసక్తి చూపుతారు. వ్యవసాయ మార్కెట్ చట్టాల ప్రకారం కాంట్రాక్టు పెట్టుబడి వ్యాపారులు కొంతమంది నేరుగా రైతులను కలుసుకుని పంట చేతికి వచ్చే వరకు ఖర్చును భరిస్తామని, పండించిన పంటను తామే కొని విక్రయిస్తామనే రీతిలో ఒప్పందాలు జరుపుకుంటున్నప్పటికీ, తరచుగా ఇలాంటి ఒప్పందాలతో పెట్టుబడి దారులకు రైతులకు మధ్య అనేక సమస్యలు ఏర్పడుతున్నాయి. కాంట్రాక్టు తీసుకున్న సమయానికి పంట చేతికి వచ్చి సరైన దిగుబడి వచ్చిందంటే సమస్య లేదు. కానీ పరిస్థితులు అనుకూలించక పండించిన పంటకూడా అనుకున్న రీతిలో రాకపోవడం వల్ల కష్టపడి పంటలు పండించే రైతులు, కాంట్రాక్టు వ్యాపారుల మధ్య విభేదాలు పొడ చూపుతున్నాయి. వీటి వలన ఎక్కువగా నష్టపోయేది రైతులే అనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. దళారులు మోసం చేసిన నష్టపోయేది రైతులే, మార్కెట్ యార్డులో నష్టం వచ్చినా నష్టపోయేది రైతులే, ప్రకృతి కన్నెర్ర చేసినా నష్టపోయేది రైతులే. ఎటుచూసినా నష్టపోయేది రైతులే అనే విషయం విస్మరించరాదు. ఏది ఏమైనప్పటికీ రైతులుపండించిన పంటకు వ్యవసాయమార్కెట్ యార్డుల ద్వారా తగిన రీతిలో గిట్టుబాటు ధర వచ్చే విధంగా రైతులు లబ్ధి పొందవలసి ఉంటుందన్న అభిప్రాయాలు వ్యవసాయరంగ నిపుణులలో లేకపోలేదు. ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్‌యార్డు లు గతంతో పోలిస్తే కొంత ఆధునికరించబడినప్పటికి, అన్నదాతలు చాలావరకు మధ్య దళారీల చేతుల్లో నష్ట పోకుండా పండించిన పంటకు తగిన గిట్టుబాటు ధరవచ్చే విధంగా రైతన్నలకు భరోసా ఇచ్చేవిధంగా మార్కెట్‌యార్డుల నిర్వహణ మరింతగా ప్రామాణికంగా కచ్చితత్వం కలిగి ఉండాల్సిన ఆవశ్యకత ఉంది. ●

# అమ్మాయిల చదువుకు ఆటంకాలు తొలగించాలి


డి. అశోక్

లింగ సమానత్వం దిశగా ప్రపంచం పురోగమిస్తోందని, విద్యా రంగంలో అద్భుతమైన మార్పులు వస్తున్నాయని భావిస్తున్న తరుణంలో, యునెస్కో విడుదల చేసిన తాజా నివేదిక మనల్ని ఆత్మపరిశీలన చేసుకొనేలా చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా నేటికీ 13.3కోట్ల మంది బాలికలు పాఠశాల విద్యకు దూరంగా ఉన్నారన్న వాస్తవం దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. మూడు దశాబ్దాల క్రితం బీజింగ్ డిక్లరేషన్ నిర్దేశించిన లక్ష్యాల సాధనలో గణనీయమైన ప్రగతి సాధించినప్పటికీ, ప్రాంతీయ అసమానతలు, నాణ్యమైన విద్యలో లోపాలు, నాయకత్వ స్థాయిలో మహిళల ప్రాతినిధ్యం కొరవడటం వంటి సవాళ్లు ఇంకా మిగిలే ఉన్నాయని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే, ఈ బాలికలు తమ భవిష్యత్తును నిర్మించుకొనే అవకాశాన్ని కోల్పోవడమే కాకుండా, సమాజాలు కూడా విద్య ద్వారా అందే సామాజిక, ఆర్థిక ప్రయోజనాలకు దూరమవుతాయి. 1995 నుంచి ప్రపంచవ్యాప్తంగా ప్రాథమిక, మాధ్యమిక విద్యలో బాలికల నమోదు నిష్పత్తి బాలురతో సమానంగా పెరిగింది. కానీ ఈ ప్రగతి అన్నిచోట్లా ఒకేలా లేదు. సబ్‌సహారా ఆఫ్రికా వంటి ప్రాంతాలు వెనుకబడి ఉండగా, లాటిన్ అమెరికాలో అబ్బాయిల కంటే అమ్మాయిలే ఎక్కువగా సెకండరీ విద్య వైపు మొగ్గుచూపుతున్నారు. పేదరికం, గ్రామీణ ప్రాంతాల్లో నివసించడం వంటి అంశాలు ఈ అసమానతలను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. గినియా, మాలి వంటి దేశాల్లో అతి తక్కువ సంఖ్యలో యువతులు పాఠశాలలకు వెళ్లగలుగుతున్నారంట పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.ప్రపంచ చిత్రానికి భారతదేశం అతీతమేమీ కాదు. 'బేటీ బచావో, బేటీ పడావో' వంటి పథకాలతో కేంద్ర ప్రభుత్వం బాలికా విద్యను ప్రోత్సహిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో సవాళ్లు అనేకం. ముఖ్యంగా ప్రాథమిక విద్య తర్వాత, ఉన్నత పాఠశాల, ఇంటర్మీడియట్ స్థాయికి వచ్చేసరికి బాలికల డ్రాపౌట్ల సంఖ్య పెరుగుతోంది. దీనికి సామాజిక,ఆర్థిక కారణాలు అనేకం. బాల్యవివాహాలు, ఇంటి పనుల్లో సహాయం చేయాలనే ఒత్తిడి, పాఠశాలలు దూరంగా ఉండటం, సరైన మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడం, భద్రతాపరమైన ఆందోళనలు ప్రధాన ఆటంకాలుగా నిలుస్తున్నాయి. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే గణాంకాల ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ బాల్య వివాహాలు బాలికల చదువుకు అడ్డుకట్టవేస్తున్నాయి. ఇక తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విషయానికొస్తే, ప్రభుత్వాలు బాలికా విద్య కోసం ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 'అమ్మఒడి', 'జగనన్న విద్యా దీవెన' వంటి పథకాలు విద్యార్థుల నమోదు నిష్పత్తిని పెంచడంలో దోహదపడ్డాయి. తెలంగాణలో గురుకుల పాఠశాలల వ్యవస్థ ద్వారా గ్రామీణ, పేద బాలికలకు నాణ్యమైన విద్యను అందించే ప్రయత్నం జరుగుతోంది. అయినప్పటికీ, పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య విద్యా నాణ్యతలో వ్యత్యాసాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని బాలికలు డిజిటల్ విద్యకు దూరమవుతున్నారు. పాఠ్య పుస్తకాల్లో లింగ వివక్ష చూపే అంశాలు, మహిళలను కేవలం సంప్రదాయ పాత్రలకే పరిమితం చేసేధోరణులు ఇంకా కొనసాగుతుండటం విచారకరం. యునెస్కో నివేదిక నొక్కి చెప్పిన మరో కీలక అంశం విద్యా రంగంలో నాయకత్వ లోపం.ప్రపంచవ్యాప్తంగా ఉపాధ్యాయుల్లో మహిళల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ, ఉన్నత విద్యా సంస్థల అధిపతుల్లో కేవలం 30మాత్రమే మహిళలున్నారు. ఈ పరిస్థితి మన దేశంలో, మన రాష్ట్రాల్లో కూడా భిన్నంగాలేదు. వ్యవస్థాగతమైన అడ్డంకులు మహిళలను నాయకత్వ స్థానాలకు చేరకుండా అడ్డుకుంటున్నాయి. విద్య ద్వారా సాధించాలనుకుంటున్న సంపూర్ణ సమానత్వానికి ఇది గొడ్డలిపెట్టు. బాలికా విద్యను కేవలం అక్షరాస్యత శాతాన్ని పెంచే అంకెగా కాకుండా, సామాజిక పరివర్తనకు సాధనంగా చూడాలి. ప్రభుత్వాలు కేవలం నమోదుపైనే కాకుండా, విద్య నాణ్యత, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు (ముఖ్యంగా బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్లు), భద్రతపై దృష్టి సారించాలి. బాల్య వివాహాలకువ్యతిరేకంగా చట్టాలను కఠినంగా అమలు చేయడంతోపాటు, ఆడపిల్ల చదువు కుటుంబానికి భారమనే భావనను తొలగించడానికి విస్తృత ప్రచారం కల్పించాలి. పాఠ్య పుస్తకాల్లో లింగ సమానత్వాన్ని పెంపొందించే అంశాలను చేర్చాలి. మహిళా శాస్త్రవేత్తలు, నాయకులు, క్రీడాకారుల విజయగాథలను పాఠ్యాంశాల్లో భాగం చేయాలి.విద్యా రంగంలో మహిళలకు నాయకత్వ బాధ్యతలు అప్పగించడానికి ప్రత్యేక శిక్షణ,ప్రోత్సాహకాలు అందించాలి. చదువుతోపాటు బాలికలకు వృత్తి నైపుణ్య శిక్షణ అందిస్తే, వారు ఆర్థికంగా నిలదొక్కుకోగలరనే భరోసా తల్లిదండ్రులకు కలుగుతుంది. విద్యావంతురాలైన మహిళ తన కుటుంబాన్నే కాకుండా,దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయగలదు. బీజింగ్ డిక్లరేషన్ ఆశయాలను సాకారం చేయాలంటే,గణాంకాలను చూసి సంతృప్తి చెందకుండా, క్షేత్రస్థాయిలోని సవాళ్లను అధిగమించడానికి ప్రభుత్వాలు,సమాజం కలిసికట్టుగా పనిచేయాలి. ●

# ఆందోళనలతో అట్టుడుకుతున్న అమెరికా!

ఐ.ప్రసాదరావు

ప్రపంచంలో ప్రజాస్వామ్య దేశాలకు మన ఇరుగు పొరుగు దేశాల్లో శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో సంభవించిన పరిణామాలు, అలాగే ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న పరిణామాలు కనువిప్పు కలగాలి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు స్వతహాగా స్వదేశంలోనే అమెరికా వాసులకు అగ్రహజ్వాలలు రగులుస్తున్నాయి. గత కొన్ని నెలలుగా అక్కడ అక్కడ స్వల్పంగా ప్రారంభమైన నిరసనలు అక్టోబర్ 19వ తేదీన అమెరికాలో దాదాపు 2500 ప్రాంతాల్లో 'నో కింగ్స్' పేరుతో నిరసనలు దేశవ్యాప్తంగా మిన్నంటాయి. లక్షలాది ప్రజలు, సంస్థలు, డెమోక్రట్స్‌తో సహా రోడ్లు ఎక్కి ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు పట్ల ప్లేకార్డ్స్, స్లోగన్స్‌తో హోరెత్తించారు. న్యూయార్క్, శాన్‌ఫ్రాన్సిస్కో, వాషింగ్టన్, ఫిలిడెల్ఫియా, అట్లాంటా, హ్యూస్టన్, చికాగో వంటి నగరాలతో పాటు యాభై రాష్ట్రాల్లో అమెరికాలో ,'రాజులు లేరు, చక్రవర్తులు (రారాజులు)లేరు' అంటూ నినదించారు.అమెరికా రాజ్యాంగం ప్రకారం పాలన అందించాలి అని, నిరంకుశ పాలన సహించం అని నిరసనకారులు నినదించారు. యూరప్ దేశాల్లో కూడా అమెరికా రాయబార కార్యాలయాల ముందు నిరసనలు వ్యక్తంచేశారు. ఇంత ఉధృతంగా రెండవసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన ట్రంప్‌కు స్వదేశంలోనే తిరుగుబాటు తేవడానికి ప్రధాన కారణం ఆయన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ పేరుతో రకరకాల ఉత్తర్వులు జారీ చేసి పాలనను అస్తవ్యస్తం చేయడమే. గత మూడు వారాలుగా అమెరికాలో 'షట్ డౌన్' ప్రారంభమై అనేకమంది ఉద్యోగాలు కోల్పోవడం, ద్రవ్యోల్బణం పెరుగుదల, వలసలపై తీసుకుంటున్న నిర్ణయాలు, ప్రఖ్యాత యూనివర్సిటకు నిధులు నిలుపుదల చేయడం, విద్యాశాఖపై తీసుకున్న నిర్ణయాలు, అనేక రంగాల్లో, శాఖల్లో ఉద్యోగాల కోత వంటి అనేక నిర్ణయాలు ప్రజలను ఆగ్రహావేశాలకు గురిచేస్తున్నాయి. ఈ నిరసనలు జెన్ జెడ్ తరహాలో ఉధృతం అవుతుండటం పట్ల ప్రపంచ వ్యాప్తంగా అమెరికాలో జరుగుతున్న పరిణామాలు పట్ల ఆసక్తి పెరుగుతుంది. 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (యమ్ .ఏ.జి.ఏ)'అనే నినాదంతో గద్దెఎక్కిన ట్రంప్, మొదట్లో చైనా, కెనడా, మెక్సికో వంటి దేశాలపై అధిక సుంకాలు విధించి, తదుపరి పునః సమీక్ష చేసుకోవడం, ఇక మనదేశంపై కూడా దాదాపు యాభై శాతం సుంకాలు విధిస్తూ, విరోధం తెచ్చుకోవడం, మన భారతీయ విద్యార్థులపై ఆంక్షలు విధించడం, వీసాలు జారీ కఠినతరం చేయడం వల్ల కూడా మనదేశానికి దూరం జరగడంతో, స్వతహాగా మనతో పాటు అమెరికాలో కూడా ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఒకడుగు ముందుకేసి భారత్, పాక్ మధ్య యుద్ధం నేనే ఆపానని ట్రంప్ చెప్పడం, దీనిని భారత్ ఖండించడంతో, ట్రంప్ తన వ్యక్తిగత స్టేచర్ కోల్పోవడం జరిగింది. తిరిగి



మరల నేడు భారత్ రష్యా నుంచి ఆయిల్ కొనదు అని ట్రంప్ చెప్పడం, ఈ విషయాన్ని మరల మన అధికారులు ఖండించడంతో మరింత పలచన అవ్వడం జరుగుతుంది. ఒక పక్క తాను తీసుకున్న నిర్ణయాలు రాజ్యాంగ విరుద్ధం అని ఫెడరల్ కోర్టు పేర్కొనటం, మరోపక్క నోబెల్ బహుమతి కోసం ఆరాటం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క కొన్ని రాష్ట్రాల్లో 'నేషనల్ గార్డ్' పోలీసులను పంపుతూ ఆయా రాష్ట్రాల ప్రజల, మేయర్ల ఆగ్రహానికి గురి అవుతున్న పరిస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో జనవరి నెలలో రెండవ సారి అమెరికా అధ్యక్షుడుగా బాధ్యత స్వీకరించిన ట్రంప్ అంతర్జాతీయంగా వివిధదేశాలతో సత్ సంబంధాలు కోల్పోవడం జరుగుతుంది. మరోపక్క తాను తీసుకుంటున్న నిర్ణయాలు వల్ల స్వదేశంలోనే నిరసనలు మిన్నంటుతున్నాయి. ఇంత స్వల్ప కాలంలోనే భారీగా అసంతృప్తి మూటగట్టుకోవడంతో,భవిష్యత్తులో అమెరికాపరిస్థితి ఏమిటి అనే భావనకు అందరూ వస్తున్నారు. ముఖ్యంగా ఒకపక్క భారత్ మాకు మిత్రుడు అంటూనే, మరోపక్క ఇటీవల కాలంలో పాకిస్థాన్‌తో సన్నిహితంగా మెలగటంతో మనకు మరింత దూరంగా జరుగుతున్నాడు. ఈ విధంగా స్వదేశంలోనూ, అంతర్జాతీయ స్థాయిలోనూ ట్రంప్ తన నిర్ణయాలు వల్ల వ్యతిరేకత మూటకట్టుకుంటున్నారు. తన ఎన్నికల ప్రచారంలో కుడి భుజంగా పనిచేసిన 'ఎలన్ మస్క్' ను సైతం తన నిర్ణయాలతో దూరం చేసుకోవడం జరిగింది.ఇదే సమయంలో తనకు అత్యంత ప్రియ మిత్రుడు అని చెప్పుకునే మన ప్రధాని మోడీని సైతం దూరం చేసుకోవడం గమనార్హం. ఈవిధంగా అతి తక్కువ సమయంలో దాదాపు అందరికీ దూరం జరగడం ఆందోళనకరం. ఇక అంతర్జాతీయ సంస్థలైన ఐక్యరాజ్యసమితి నిర్ణయాలు బేఖాతరు చేయడం, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్‌కు నిధులు నిలుపుదల చేయడం, పర్యావరణ పరిరక్షణ చట్టాల నుండి, ఒప్పందాలు నుంచి బయటకు రావడం, ఒబామా హెల్త్ కేర్‌ను ఉపసంహరించడం వంటి నిర్ణయాలు ట్రంప్ ఇమేజ్‌ను పూర్తిగా దెబ్బతిస్తున్నాయి. ఈ విధంగా ట్రంప్ నిర్ణయాలు మంచి కన్నా చెడ్డ ఎక్కువ కలుగుతుంది. ఒకవైపు చైనా అధ్యక్షుడుతో త్వరలో చర్చిస్తాను అని తెలపడం, వెంటనే చర్చలు లేవు అదనపు సుంకాలు 155శాతం విధిస్తామని అంటాడు. నిలకడ లేని స్థితిలో ఉండటం గమనార్హం. ఇకనైనా తన నిర్ణయాలు పునః సమీక్షచేసుకోవడం, ఆచితూచి అడుగులు వేయడం ద్వారానే తన ప్రతిష్టను, అమెరికా ప్రతిష్టను కాపాడుకోవడం జరుగుతుంది. లేని ఎడల అతి త్వరలోనే స్వదేశంలో, అంతర్జాతీయ స్థాయిలో పలుచనయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ట్రంప్ తెంపరితనం ఇకనైనా తగ్గించుకోవడం ఉత్తమం. ప్రపంచంలోనే అతిపెద్ద పురాతన ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే అమెరికా, ప్రస్తుతం తన డాలర్ ప్రాబల్యం ఎలా కోల్పోతుందో, అలాగే భవిష్యత్తులో తన ప్రజాస్వామ్య వైభవాన్ని ఇటువంటి వైఖరిలతో కోల్పోతుంది. ఇక మనదేశం కూడా విదేశాంగ విధానం, దౌత్య విధానం మెరుగు పరుచుకోవాలి. పెట్టుబడిదారీ దేశాలు, సామ్రాజ్యవాద దేశాలతో అప్రమత్తంగాఉండాలి.అలీన విధానంతో ముందుకు సాగాలి. మనదేశంలో కూడా ప్రజాస్వామ్య గొంతుకులను అణిచివేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అన్నిటికీ ఒకేవిధానికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. భిన్నత్వంలో ఏకత్వం గల మనదేశంలో రాజ్యాంగ బద్ధంగా, ప్రజాస్వామ్య సామ్యవాద లౌకికభావనతో పాలన అందించాలి. అప్పుడు మాత్రమే శాంతి, అభివృద్ధి సాకారం అవు తుందని అని పాలకులు గ్రహించాలి. అధికారం ఉందని, అహంకారంతో పోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ●

# ప్రజావాక్కు



## అధ్వానంగా ప్రధాన రహదారులు

రాష్ట్రంలోనిమహబూబాబాద్ జిల్లా కేంద్రం నుండి వయా ఇల్లందుద్వారా కొత్తగూడెం జిల్లా కేంద్రానికి వెళ్లే జాతీయ రహదారి గుంతల మాయమై అధ్వానంగా తయారైంది. ఈ దారి గుండా ప్రతిరోజు వేలాది వాహనాలు వివిధ ప్రదేశాలకు ప్రయాణిస్తుంటాయి. ముఖ్యంగా కరీంనగర్ నిజామాబాద్ హుజురాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్, గోదావరిఖని,హనుమకొండ, వరంగల్,నర్సంపేట నుండి భద్రాచలం, విజయవాడకు వెళ్లేవాహనాలు వయా మహబూబాద్, ఇల్లందు ద్వారా వెళుతుంటాయి. గోదావరిలో పుణ్యాసనము ఆచరించి పాపికొండలు పర్ణశాల లాంటి ప్రదేశాలకు భక్తులు ఎక్కువగా వెళుతుంటారు. సుమారు 70 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రహదారి అనేక ప్రాంతాల్లో గోతులమయమై నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న పాలకులు స్పందించకపోవడం శోచనీయం.

- కామిడి సతీష్ రెడ్డి జయశంకర్ భూపాలపల్లి జిల్లా

## స్టాఫ్‌ను నియమించాలి

ఆర్మీ స్కూల్‌గా పిలవబడేతెలంగాణ రాష్ట్రంలోని 2 సైనిక్ స్కూల్‌లో ఆర్మీ స్టాఫ్ చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ సైనిక్ స్కూల్ వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని అశోక్ నగర్ సైనిక్ స్కూల్‌లో ఒక్కరే ఆర్మీ స్టాఫ్ ఉంది. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రుక్మాపూర్ షెడ్యూల్ క్యాస్ట్ సైనిక్ స్కూల్‌లో అతి తక్కువ ఆర్మీ స్టాఫ్ వుంది. కాబట్టి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 2 సైనిక్ స్కూల్‌లో పేద విద్యార్థులు చదువుతున్నారు. కనుక ప్రభుత్వం ఈ స్కూల్‌లో స్టాఫ్‌ను నియమించాలి.

- రాపాక రవీందర్, జనగాం

## ప్రపంచ శాంతికి పాటుపడాలి

క్వాడ్ ఇటీవల ఒకస్పష్టమైన వైఖరిని తీసుకుంటున్నట్లు తోస్తుంది.అది చైనాకివ్యతిరేకంగా అనిమాత్రమే చెప్పవచ్చు.దానివైఖరి మూలంగానే ఇండోపసిఫిక్ అని అమెరికా తన వాణిజ్య సంబంధాలను మార్చుకుంది. ఇకపోతే కోవిడ్ దరిమిలా చైనా తన ఉత్పత్తి వ్యవస్థలు అతలాకుతల మయ్యాయి. తద్వారా తన ఆర్థిక వ్యవస్థకు తీరని నష్టంవాటిల్లింది. కానీ తిరిగి పుంజుకొని పాకిస్థాన్ వంటి దేశాల సహాయంతో అది తన ఆధిపత్యం చూపించాలి అనుకుంటుంది.

- భారత అవినాష్, జనగామ

## ముందస్తు చర్యలు అవసరం

ఇటీవల దేశవ్యాప్తంగా ప్రయాణీకుల బస్సుల్లో వరుసగా అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోవడం గమనార్హం. ఈ ఘోర సంఘటనలు మానవ ప్రాణాల భద్రతపై తీవ్రమైన ప్రశ్నలను రేకెత్తిస్తున్నాయి. బస్సు ప్రయాణం రోడ్లలో సురక్షితమైన మార్గంగా పరిగణించబడినా, ప్రస్తుత పరిస్థితులు జీవన భద్రతకు పెద్ద ముప్పుగా నిలుస్తున్నాయి.ప్రస్తుతం నివేదికల ప్రకారం, ఎక్కువగా పాత, సరిగా రక్షణా ప్రమాణాలు పాటించని బస్సులు ప్రమాదాలకు ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. డ్రైవర్ల శిక్షణలో కొరత, సాధారణ రక్షణ సాధనాలలో లోపాలు, మురికి, నిబంధనల ఉల్లంఘనలు భద్రతకు ముప్పుగా నిలుస్తున్నాయి. ప్రభుత్వం,రవాణావిభాగం తక్షణచర్యలు తీసుకోవాలి. ప్రయాణికుల కోసం అవగాహన కార్యక్రమాలు, అత్యవసర మార్గాల సూచనలు,డ్రైవర్ శిక్షణమరింత బలోపేతంచేయడం అవసరం.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## షరా మామూలే

ఎన్నికల్లో గెలుపొంది అధికారంలోకి రావాలని ముందు వెనుక ఆలోచించకుండా సాధ్యాసాధ్యాలను పరిశీలించకుండా హామీల వర్షం కురిపేస్తుంటారు పార్టీలకు చెందిన నాయకులు. అధికారంలోకి వచ్చాక హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుంటారు. అయితే ఒకరు మోసం చేసినా మరొకరు మంచి చేయకపోతారా అనే ఆశతో ప్రభుత్వాలను మారుస్తుంటారు. ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు దాటినా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ల అమలుకు నోచుకోలేదని సూపర్‌సిక్స్ సూపర్‌ఫ్లాప్ అనిఅనుకుంటున్నారు. గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వ పాలనలో తేడా కన్పించడంలేదు.

-ఎస్.శర్మ, హైదరాబాద్

## సామాజిక బాధ్యత

ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యం కోసం ఎంతోమంది వస్తుంటారు. వారితోపాటు వారి కుటుంబసభ్యులు, బంధువులు వస్తుంటారు. కొందరు ఆరుబయట నిద్రిస్తూ,తిని తినక ఎన్నో ఇబ్బందులు పడుతుంటారు.వారిలో చాలామంది పేదరికం వల్ల భోజనం కొనలేని పరిస్థితిలో ఉంటున్నారు. వారికి పట్టెడన్నం పెట్టాలి. కొన్ని స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఇప్పటికే అన్నదానం చేస్తున్నారు కానీ సరిపోవడంలేదు.ఇలాంటి వారికి సహాయం చేయడం మనందరి సామాజిక బాధ్యత.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

మన వి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

## ఆపరేషన్ సిందూర్ వీరులకు

# 'శౌర్య' పురస్కారాలు!




**న్యూఢిల్లీ, అక్టోబరు 22:** దేశ రక్షణలో అసాధారణ ధైర్యసాహసాలు, విశిష్ట సేవలు అందించిన భారత సైనిక దళాల సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం శౌర్య పురస్కారాలను ప్రకటించింది. ఇటీవల విజయవంతంగా ముగిసిన 'ఆపరేషన్ సిందూర్' సహా పలు కీలక ఆపరేషన్లలో పాల్గొన్న ఆర్మీ, వైమానిక దళాలకు చెందిన పలువురు అధికారులను ప్రతిష్ఠాత్మక 'వీర చక్ర' పురస్కారంతో గౌరవించింది. ఈ మేరకు కేంద్రం అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. వివిధ ఆపరేషన్లలో భాగంగా ఉగ్రవాద శిబిరాలను పూర్తిగా ధ్వంసం చేయడంలో కీలక పాత్ర పోషించిన 1988 (ఇండిపెండెంట్) మీడియం బ్యాటరీకి చెందిన లెఫ్టినెంట్ కల్నల్ సుశీల్ బిస్త్‌కు వీర చక్ర లభించింది. అలాగే, అత్యంత రహస్యంగా, తక్కువ సమయంలోనే ప్రత్యేక పరికరాలను విమానాల ద్వారా సమర్థంగా తరలించి, సైనిక సామర్థ్యాన్ని చాటిన 302 మీడియం రెజిమెంట్‌కు చెందిన కల్నల్ కోశాంక్ లాంబాను కూడా ఈ పురస్కారం వరించింది. భారత వైమానిక దళం (ఐఏఎఫ్) నుంచి పలువురు అధికారులు వీర చక్రకు ఎంపికయ్యారు. శత్రువుల కట్టుదిట్టమైన గగనతలంలోకి చొచ్చుకెళ్లి, నిర్దేశిత లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించినందుకు ఫైటర్ పైలట్ గ్రూప్ కెప్టెన్ రంజీత్ సింగ్ సిద్ధూకు ఈ గౌరవం దక్కింది.

ఫార్వర్డ్ ఎయిర్‌బేస్‌లో సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్ (ఎస్ఏఎం) స్క్వాడ్రన్‌కు నాయకత్వం వహించి, మన వనరులకు ఎలాంటి నష్టం జరగకుండా శత్రువులకు భారీ నష్టం కలిగించిన గ్రూప్ కెప్టెన్ అనిమేశ్ పట్నీ కూడా వీర చక్ర అందుకున్నారు. అత్యంత ప్రమాదకరమైన మిషన్‌లో భాగంగా, అర్ధరాత్రి వేళ శత్రు భూభాగంలోకి ప్రవేశించి కోటలాంటి లక్ష్యాలను ధ్వంసం చేసిన స్క్వాడ్రన్ లీడర్ రిజ్వాన్ మాలిక్, సంక్లిష్టమైన వైమానిక దాడిలో అద్భుతమైన సమన్వయం ప్రదర్శించిన స్క్వాడ్రన్ లీడర్ సిద్ధాంత్ సింగ్‌లకు కూడా వీర చక్ర పురస్కారాలు ప్రకటించారు. మొత్తంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 127 గ్యాలంట్రీ అవార్డులు, 40 విశిష్ట సేవా పురస్కారాలకు ఆమోదం తెలిపారు. వీటిలో 4 కీర్తి చక్రలు, 15 వీర చక్రలు, 16 శౌర్య చక్రలు ఉన్నాయి.



# ఉగ్రవాదంపై ఉమ్మడి పోరు

- ఆ దిశగా ప్రయత్నాలు సాగాలి
- ట్రంప్‌తో ప్రధాని మోడీ ఆకాంక్ష
- ఫోన్‌లో దీపావళి శుభాకాంక్షలు చెప్పిన ట్రంప్
- వైట్ హౌస్‌లోను దీపావళి వేడుకలు
- వాణిజ్య ఒప్పందం వేళ ఆసక్తికర పరిణామం
- సుంకాలు తగ్గే అవకాశం

**న్యూఢిల్లీ, అక్టోబరు 22:** ఉగ్రవాదంపై ఐక్యంగా పోరాడాలని, ఈ దిశగా ఉమ్మడి ప్రయత్నాలు జరగాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆకాంక్షించారు. ఫోన్ చేసి దీపావళి శుభాకాంక్షలు చెప్పినందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కృతజ్ఞతలు అంటూ మోడీ ట్వీట్ చేశారు. "దీపావళి శుభాకాంక్షలు తెలిపినందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కృతజ్ఞతలు. ఈ దీపావళి పండుగ నాడు రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాలు ప్రపంచాన్ని ఆశతో ప్రకాశింపజేయడం కొనసాగించాలి. అన్ని రకాల ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఐకనయంగా నిలబడాలని కోరుకుంటున్నా" అని మోడీ ఆ ట్వీట్‌లో రాసుకొచ్చారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడంతోపాటు, ఉగ్రవాదులకు సురక్షితమైన స్వర్గధామంగా అందించడంలో పేరుగాంచిన పాకిస్తాన్‌తో అమెరికా సాన్నిహిత్యం పెరుగుతున్న నేపథ్యంలో ప్రధాని మోడీ వ్యాఖ్యలకు ప్రాముఖ్యత సంతరించుకుంది. మంగళవారంనాడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రధాని మోడీకి ఫోన్ చేసిన దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇరు దేశాధినేతలు వివిధ అంశాలపై చర్చించినట్లు సమాచారం. వైట్‌హౌస్‌లో ప్రత్యేక దీపావళి కార్యక్రమంలో ట్రంప్ దీపం వెలిగించి, ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ మంగళవారం తాను భారత ప్రధానితో ఫోన్‌లో మాట్లాడానని చెబుతూ, మోడీ గొప్ప స్నేహితుడు అని ప్రశంసించారు. తమ ఇద్దరి మధ్య చాలా మంచి సంబంధం ఉందని పేర్కొన్నారు. అలాగే ఇకపై ఆయన రష్యా నుంచి పెద్దగా ఆయిల్ కొనుగోలు చేయబోరని పునరుద్ఘాటించారు. ఉక్రెయిన్–రష్యా యుద్ధం ముగియాలని నేను ఎంతగా కోరుకుంటున్నానో.. మోడీ కూడా అంతే కోరుకుంటున్నారని అన్నారు. వారు మరీ ఎక్కువగా చమురు కొనడం మానేస్తారు.. రష్యా కూడా యుద్ధం ఆపేందుకు ప్రయత్నిస్తుందని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఇప్పటికే భారత్ భారీగా చమురు కొనుగోళ్లను తగ్గించిందని.. మున్ముందు మరింతగా తగ్గిస్తుందని పేర్కొన్నారు. వైట్‌హౌస్‌లో నిర్వహించిన దీపావళి వేడుకలలో అమెరికాలో భారత రాయబారి వినయ్ క్వాత్రా, ఎఫ్‌బిఐ చీఫ్ కాష్ పటేల్, ఇంటెలిజెన్స్ హెడ్ తులసి గబ్బర్డ్, భారత్‌లో కొత్త అమెరికా రాయబారి సెర్గియో గోర్, భారతీయ అమెరికన్ వ్యాపార వేత్తలు పాల్గొన్నారు. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలపై భారత్ ఇప్పటి వరకు అధికారికంగా స్పందించనప్పటికీ.. బుధవారం ప్రధాని నరేంద్ర మోడీ మాత్రం ట్రంప్‌కు ఫోన్ చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఆయనకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. గతంలో కూడా ట్రంప్ ఇలాంటి కామెంట్లే చేయగా.. న్యూఢిల్లీ ఆ వ్యాఖ్యలను గట్టిగా తిరస్కరించింది. "భారత్ ఆయిల్, గ్యాస్ ముఖ్యమైన దిగుమతిదారు. అస్థిరంగా ఉన్న ఇంధన పరిస్థితులలో భారతీయ వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటం మా స్థిరమైన ప్రాధాన్యత. మా దిగుమతి విధానాలు పూర్తిగా ఈ లక్ష్యం ద్వారానే నిర్దేశించబడతాయి" అని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. తమ ఇంధన విధానాలు కేవలం దేశ అవసరాలు, వినియోగదారుల ప్రయోజనాలపైనే ఆధారపడి ఉంటాయని భారత్ తేల్చి చెప్పింది.

సుంకాలు తగ్గే అవకాశం: దీపావళి శుభాకాంక్షలు చెప్పడానికే ప్రధాని మోడీకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫోన్ చేసినా, వారిద్దరి మధ్య ఎక్కువగా వాణిజ్యంపైనే చర్చ జరిగినట్లుగా సమాచారం. ఈ మేరకు రాయిటర్స్ పేరొనకంది.

తాజా ఫోన్ కాల్ సంభాషణ ప్రకారం రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం జరగవచ్చని, దీంతో అమెరికా సుంకాలు 16శాతం వరకు తగ్గించవచ్చని రాయిటర్స్ ఆ కథనంలో పేర్కొంది. త్వరలో జరిగే ఆసియాన్ శిఖరాగ్ర సమావేశంలో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసే అవకాశం ఉందని నివేదించింది. భారత్‌పై ట్రంప్ తొలుత 25 శాతం సుంకం విధించారు. అనంతరం రష్యాతో సంబంధాలు కొనసాగిస్తుననందుకు జరిమానాగా మరో 25శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో భారత్‌పై 50శాతం సుంకం అమలవుతోంది. దీంతో రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో భారత్ – అమెరికా బంధం బలపడుతున్నట్లుగా కథనాలు పేర్కొంటున్నాయి. ఆసియాన్ శిఖరాగ్ర సదస్సులో కీలక పరిణామం జరగవచ్చని వార్తలు వినిపిస్తున్నాయి.

# మానాన్న చివరి అంకంలో ఉన్నారు..

## సతీశ్‌జర్కిహోళి పెద్ద బాధ్యతలకు అన్ని విధాలా అర్హుడు

## సీఎం సిద్ధరామయ్య తనయుడు యతీంద్ర సంచలన వ్యాఖ్యలు



**బెంగళూరు, అక్టోబరు 22:** కర్ణాటక సీఎం సిద్ధ రామయ్య రాజకీయ భవిష్యత్తుపై ఆయన కుమారుడే చేసిన వ్యాఖ్యలు ఇపుడు కర్ణాటక కాంగ్రెస్ రాజకీయాల్లో దుమారం రేపుతున్నాయి. తనయుడు యతీంద్ర తన తండ్రిపై చేసిన వ్యాఖ్యలు సంచలనం కలిగించాయి. తన తండ్రి రాజకీయ జీవితం చివరిదశలో ఉందని కర్ణాటకలో రాజకీయ నాయకత్వాం చేపట్టేందుక సతీశ్ జర్కిహోళి అన్నివిధాలా అర్హుడని ఆయన అన్నారు. యతీంద్ర వ్యాఖ్యలు కర్ణాటకలో నాయకత్వ మార్పు అనివార్యం అని స్పష్టంచేస్తున్నాయని కాంగ్రెస్ వర్గాల్లోనే వినిపిస్తోంది. స్వయంగా ముఖ్యమంత్రి తనయుడే ఈ వ్యాఖ్యలుచేయడంతో వీటికి మరింత ప్రాధాన్యం పెరిగింది. బెళగావిజిల్లాలో బుధవారం జరిగిన కార్యక్రమంలో యతీంద్ర ఈ వ్యాఖ్యలుచేసారు. రాజకీయాల్లో తన తండ్రి చివరిదశలో ఉన్నారని, ఈ సమయంలో బలమైన ప్రగతిశీల భావజాలం కలిగిన నాయకుడు ఆయనకు అవసరమని అన్నారు. అలాంటి నాయకుడికి సిద్ధరామయ్య మార్గదర్శకునిగా ఉంటారని అన్నా రు. సతీశ్‌జర్కిహోళికి ఆ లక్షణాలున్నాయని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని నడిపించేందుకు ఆయనే సరైన వ్యక్తి అన్నారు. ఈ గురుతరబాధ్యతలు స్వీకరించేందుకు ఆయన సంసిద్ధులు కావాలని అన్నారు. పెద్ద బాధ్యతలు అంటే సీఎం మార్పునే సూచిస్తున్నా యని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. సీఎం మార్పుఅంశంపై సిఎం సిద్ధరామయ్య, డికెశివకుమార్‌మధ్య ఇప్పటికే పరోక్షంగా వాగ్వాదాలు జరుగుతున్నాయి.

ఈ సమంలో సతీశ్‌పేరు తెరపైకి రావడం గమ నార్హం. రెండున్నరేళ్ల తర్వాత ముఖ్యంమంత్రి పీఠంలో మార్పు ఉంటుందని అధికారంలోకి వచ్చినప్పటినుంచి ప్రచారంలో ఉంది. పార్టీ ఎమ్మెల్యేలు కూడా ఆవిధానంపైనే నమ్మకంతో ఉన్నారు. ఐదేళ్లు తానే ముఖ్యమంత్రినని ప్రస్తుత సీఎం సిద్ధరామయ్య చెపుతున్నా తన చేతుల్లో ఏమీలేదని డికెశివకుమార్ చెపుతున్నా ఇప్పటికీ ఊహాగానాలు చెలరేగుతూనే ఉన్నాయి. అయితే సిద్ధరామయ్యను దించితే కర్ణాటకలో పార్టీ రెండుగా చీలిపోతుందని హైకమాండ్ భయపడుతోంది. ఇపుడు హైకమాండ్ నిర్ణయం ఏమిటన్నదే కర్ణాటక కాంగ్రెస్ మొత్తం ఉత్కంఠతో ఎదురుచూస్తున్నది.

# శారీరకసంబంధం పదంతో లైంగికదాడిని నిర్ధారించలేం!

## పోక్సో కేసు కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ, అక్టోబరు 22:** పోక్సో చట్టం కింద నమోదైన ఒక కీలక కేసులో ఢిల్లీ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. బాధితురాలు తన వాంగ్మూలంలో ఉపయోగించిన శారీరక సంబంధం అనే పదం చాలా అస్పష్టంగా ఉందని, కేవలం ఆ పదాన్ని ఆధారంగా చేసుకుని అత్యాచారం లేదా లైంగిక దాడి జరిగిందని నిర్ధారించలేమని స్పష్టం చేసింది. ట్రయల్ కోర్టు విధించిన పదేళ్ల కఠిన కారాగార శిక్షను రద్దు చేస్తూ నిందితుడిని నిర్దోషిగా ప్రకటించింది. రాహుల్ అలియాస్ భూపిందర్ వర్మ అనే వ్యక్తి తన 16 ఏళ్ల కజిన్‌ను పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరక సంబంధం పెట్టుకున్నాడని ఆరోపణలు వచ్చాయి. ఈ కేసును విచారించిన ట్రయల్ కోర్టు అతడిని దోషిగా తేల్చి పదేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ నిందితుడు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాడు. ఈ అప్పీలుపై విచారణ జరిపిన జస్టిస్ మనోజ్ కుమార్ ఓహ్రి నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం, ప్రాసిక్యూషన్ నేరాన్ని నిస్సందేహంగా నిరూపించడంలో విఫలమైందని అభిప్రాయపడింది. కేవలం శారీరక సంబంధం అనే పదాన్ని ఉపయోగించడం వల్ల, దానికి సరైన ఆధారాలు లేనప్పుడు, నేరం జరిగినట్లుగా భావించలేమని కోర్టు పేర్కొంది. భారత శిక్షాస్మృతి (ఐపీసీ)లో గానీ, పోక్సో చట్టంలో గానీ ఈ పదానికి నిర్దిష్ట నిర్వచనం లేదని గుర్తుచేసింది. బాధితురాలు శారీరక సంబంధం అని చెప్పినప్పుడు, దాని అర్థం ఏమిటో, అది లైంగిక దాడి కిందకు వస్తుందో లేదో ప్రాసిక్యూషన్ గానీ, ట్రయల్ కోర్టు గానీ స్పష్టత కోరలేదని హైకోర్టు తప్పుబట్టింది. సాక్షుల నుంచి సరైన వాస్తవాలను రాబట్టాల్సిన బాధ్యత కోర్టుపై ఉందని ఎవిడెన్స్ యాక్ట్‌లోని సెక్షన్ 165ను ఉటంకించింది. ఈ కేసులో ఘటన జరిగిన దాదాపు ఏడాదిన్నర తర్వాత మార్చి 2016లో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపైనా హైకోర్టు సందేహాలు వ్యక్తం చేసింది. నిందితుడు పెళ్లికి నిరాకరించడంతో బాధితురాలు విషం తాగిందని, ఆ తర్వాత ఆమెకు మాట పడిపోయిందని, తిరిగి మాట వచ్చిన తర్వాత ఫిర్యాదు చేశారని ప్రాసిక్యూషన్ వాదించింది. అయితే, ఈ వాదనను బలపరిచే ఎలాంటి వైద్యపరమైన ఆధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. ఇంత సుదీర్ఘ జాప్యానికి సరైన కారణాలు చూపడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని పేర్కొంది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ఇది ఒక దురదృష్టకరమైన కేసుఅని వ్యాఖ్యానిస్తూ, ట్రయల్ కోర్టు తీర్పును కొట్టివేసింది. నిందితుడిని వెంటనే జైలు నుంచి విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

## శ్వేతసౌధంలో సువిశాలమైన 'బాల్‌రూమ్'

### 999 అడుగుల విస్తీర్ణంలో రూ. 2200 కోట్లతో నిర్మాణం

**వాషింగ్టన్, అక్టోబరు 22:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన చిరకాల స్వప్నంగా భావిస్తున్న ప్రాజెక్టును పట్టాలెక్కించారు. శ్వేతసౌధం ప్రాంగణంలో అత్యంత సువిశాలమైన, ఆధునికమైన బాల్‌రూమ్ (నృత్యశాల) నిర్మాణ పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని ట్రంప్ స్వయంగా తన ట్రూత్ సోషల్ ఖాతా ద్వారా వెల్లడించారు. వైట్‌హౌస్ తూర్పు విభాగంలో ఈ నిర్మాణం కోసం సోమవారం కూల్చివేతలు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. వైట్‌హౌస్ మైదానంలోని తూర్పు విభాగంలో అతిపెద్ద, అందమైన బాల్‌రూమ్ నిర్మాణ పనులు మొదలయ్యాయని చెప్పడానికి ఎంతో సంతోషిస్తున్నానని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. గత 150 ఏళ్లుగా ప్రతి అమెరికా అధ్యక్షుడు వైట్‌హౌస్‌లో గ్రాండ్ పార్టీలు, ప్రత్యేక కార్యక్రమాల కోసం ఒక పెద్ద బాల్‌రూమ్ ఉండాలని కలలు కన్నారని, ఎట్టకేలకు ఆ ప్రాజెక్ట్ ఇప్పుడు ప్రారంభమైందని ఆయన వివరించారు. ఈ ఏడాది జూలైలో ఈ ప్రాజెక్టు గురించి ట్రంప్ మొదటిసారి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ భారీ నిర్మాణానికి సంబంధించిన ఓ ముఖ్యమైన విషయాన్ని కూడా ట్రంప్ స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుకు అయ్యే ఖర్చును ప్రభుత్వ నిధుల నుంచి కాకుండా పూర్తిగా దాతలు అందించే విరాళాలతో భరిస్తున్నట్లు ఆయన తెలిపారు. దీనివల్ల అమెరికా ప్రజలపై ఎలాంటి ఆర్థిక భారం పడదని ఆయన పేర్కొన్నారు.

# మసూద్ సోదరి నాయకత్వంలో మహిళా జైషే!



**ముజఫరాబాద్, అక్టోబరు 22:** పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఉగ్రవాద సంస్థ జైష్ ఏ మొహమ్మద్ 'జమాత్ ఉల్ మొమినాత్' పేరుతో తన తొలి మహిళా విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఇటీవల ప్రకటించింది. తాజాగా, జైష్ తుఫత్ అల్ ముమినాత్ పేరుతో ఆన్‌లైన్ శిక్షణా కోర్సును కూడా ప్రారంభించినట్లు తెలిపింది. దీని ద్వారా నిధులు సేకరించి, మరింతమంది మహిళలను ఆకర్షించాలని భావిస్తోంది. ఈ మహిళా బ్రిగేడ్‌కు మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ నాయకత్వం వహించనున్నారు. మే నెలలో భారత దళాలు ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా మర్కజ్ సుభానల్లాలోని జైష్ కార్యాలయంపై దాడి చేసినప్పుడు ఆమె భర్త యూసుఫ్ అజార్ మరణించినట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో సంస్థను మరింత బలోపేతం చేయడంలో భాగంగా మరింతమంది మహిళలను నియమించుకోవాలని భావిస్తున్నారు. సంస్థను బలోపేతం చేయడం కోసం మరింత మంది మహిళలను నియమించుకోవాలని యోచిస్తున్నారు. మసూద్ అజార్, కుటుంబ సభ్యులు, అతని కమాండర్లు జిహాదీ, మతం, ఇస్లాంకు సంబంధించిన అంశాలపై మహిళలకు శిక్షణ ఇస్తారు" అని జైష్ ఏ మహమ్మద్ వర్గాలు తెలిపాయి. మహిళలను ఉగ్రవాదం వైపు మళ్లించేందుకు నవంబర్ 8 నుంచి ఆన్‌లైన్ లైవ్ క్లాస్‌లు ప్రారంభించనున్నారు. ఈ శిక్షణలో భాగంగా ప్రతిరోజు 40 నిమిషాల పాటు మసూద్ సోదరీమణులు, కమాండర్ల కుటుంబ సభ్యులు మహిళలకు పాఠాలు బోధిస్తారని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఇందుకు మహిళా బ్రిగేడ్‌లోని సభ్యుల నుంచి విరాళాలు కూడా సేకరిస్తున్నారు.

## సంక్షిప్తంగా..

### రష్యా దాడుల్లో చిన్నారులు సహా ఏడుగురు మృతి : జెలెన్‌స్కీ



**కీవ్, అక్టోబర్ 22:** రష్యా తాజాగా చేపట్టిన డ్రోన్, మిస్సైల్ దాడుల్లో ఏడుగురు మరణించినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు వోల్డోమిర్ జెలెన్‌స్కీ తెలిపారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. ఉక్రెయిన్‌లోని రెండవ పెద్ద నగరమైన ఖార్కివ్‌లో ఉన్న కిండర్‌గార్డెన్‌పై అటాక్ జరిగింది. వరుస దాడుల వల్ల కీవ్‌లో కూడా నష్టం జరిగింది. చిన్నారులతో కలిపి సుమారు 26 మంది గాయపడినట్లు జెలెన్‌స్కీ చెప్పారు. అయితే బుడాపెస్ట్‌లో పుతిన్‌తో జరగాల్సిన భేటీని డొనాల్డ్ ట్రంప్ రద్దు చేసుకున్నారు. ట్రంప్, యూరోప్ నేతలు పిలుపు ఇచ్చినా ఫ్రంట్‌లైన్ వద్ద కాల్పులు ఆగడం లేదని రష్యా పేర్కొన్నది. బ్రియాన్‌స్క్ బోర్డర్ ప్రాంతంలో ఉన్న రష్యా రసాయనిక ప్లాంట్‌పై ఉక్రెయిన్ మిలిటరీ అటాక్ చేసింది. బ్రిటన్ పంపిన స్టార్మ్ షాడో మిస్సైల్‌తో ఉక్రెయిన్ ఆ దాడిలో పాల్గొన్నది. రష్యా ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను ఛేధించి ఆ స్టార్మ్ షాడో క్షిపణులు విజయవంతంగా దూసుకెళ్లినట్లు ఉక్రెయిన్ ప్రకటించింది.

### వైట్‌హౌస్ భద్రతా గేటును ఢీకొట్టిన కారు



**వాషింగ్టన్, అక్టోబరు 22:** అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ వద్ద మంగళవారం రాత్రి తీవ్ర కలకలం రేగింది. ఓ వ్యక్తి తన కారుతో నేరుగా వచ్చి భద్రతా గేటును ఢీకొట్టాడు. ఈ ఘటన జరిగిన సమయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భవనం లోపలే ఉన్నారని, దీంతో భద్రతా సిబ్బంది ఒక్కసారిగా అప్రమత్తమయ్యారని యూఎస్ సీక్రెట్ సర్వీస్ వెల్లడించింది. వాషింగ్టన్‌లోని 17వ ఈ స్ట్రీట్స్ కూడలి సమీపంలో రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఓ కారు వేగంగా దూసుకొచ్చి వైట్‌హౌస్ ఆవరణలోని సెక్యూరిటీ గేటును ఢీకొట్టింది. వెంటనే స్పందించిన సీక్రెట్ సర్వీస్ యూనిఫాం విభాగం అధికారులు ఆ కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో వైట్‌హౌస్‌కు ఎలాంటి లాక్‌డౌన్ విధించలేదని అధికారులు స్పష్టం చేశారు. కారును క్షుణ్ణంగా తనిఖీ చేసారు.

### శ్రీలంకలో కౌన్సిల్ ఛైర్మన్ కాల్చివేత!



**కొలంబో, అక్టోబర్ 22:** శ్రీలంకకు చెందిన ఓ రాజకీయ నేత పార్టీ ఆఫీస్‌లో దారుణ హత్యకు గురయ్యారు. వెలిగామా కౌన్సిల్ ఛైర్మన్ లసంత విక్రమశేఖర బుధవారం తన కార్యాలయంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సమయంలో ఇద్దరు దుండగులు ఆఫీస్‌లోకి చొరబడ్డారు. తమ వద్ద ఉన్న గన్‌తో విక్రమశేఖరపై పలు రౌండ్ల కాల్పులు జరిపారు. అనంతరం పరారయ్యారు.

తీవ్రంగా గాయపడిన విక్రమశేఖరను ఆసుపత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టామని, దుండగుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు వెల్లడించారు. దాడికి కారణాలు తెలియాల్సి ఉంది.



## ఎల్వోసి వెంబడి మళ్లీ చురుకుగా ఉగ్రశిబిరాలు!

### హోంశాఖకు నిఘా వేగుల నివేదిక

**న్యూఢిల్లీ, అక్టోబరు 22:** ఆపరేషన్ సింధూర్ తర్వాత తునాతునకలయిన ఉగ్రవాద స్థావరాలు మళ్లీ జీవంపోసుకుంటున్నాయి. వాస్తవాధీనరేఖ వెంబడి మళ్లీ ఉగ్ర లాంచ్‌ప్యాడ్‌లు, ఉగ్రశిక్షణ శిబిరాలు ప్రారంభం అయినట్లు భారత నిఘా వర్గాలు గుర్తించాయి. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని భారత సరిహద్దుప్రాంతాల్లో వీటిని నిర్వహిస్తున్నట్లు తేలింది. చిన్నచిన్న క్లాసులు రూపంలో వీటినినిర్వహిస్తున్నారు. అయితే సాంకేతికతను జోడించి ఆధునిక పరిజ్ఞానంతో వీటిని నిర్వహిస్తున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. తద్వారా ఈ శిక్షణా శిబిరాలు డ్రోన్ నిఘాలను, వైమానిక దాడులను సైతం తప్పించుకునేదిశగా ఈ శిబిరాలు నడుస్తున్నట్లు తెలుస్తోంది. కేంద్ర హోంశాఖకు అందిన నిఘా నివేదికల్లో సుమారు 100 మంది ఉగ్రవాదులకు సరిహద్దుల్లో శిక్షణ జరుగు తోందని, ఎంతమేర ఈశిబిరాలు విధ్వంసం చేసినా మళ్లీ పురుడు పోసుకుంటున్నాయని తెలిపింది. దీనితో ఇపుడు హోంశాఖ అన్ని దళాలను అప్రమత్తంచేసి వ్యూహాత్మక కసరత్తును సిద్ధంచేసుకోవాలని సూచించింది. సరిహద్దుల్లో ఇప్పటికీ ఉగ్రముప్పు దాగి ఉన్నందున మరింత నిఘాను పెంచుకోవాలనిసూచించింది. లూని, పుత్వాల్, టిపు పోస్ట్, జామిల్‌పోస్ట్, ఉస్మాన్ వాలి, చాప్రార్ ఫార్వార్డ్, ఛోటా చక్, జంగ్లోరా ప్రాంతాల్లో ఉగ్రశిబిరాలు మళ్లీ చురుకుగా పనిచేస్తున్నాయని నిఘా వర్గాలు హోంశాఖకు నివేదిక ఇచ్చాయి. భద్రతా దళాలు వీటిని నిర్మూలించడానికిసైతం వీలులేని విధానంలో శిక్షణ ఇవ్వడం అక్కడి నుంచి కనుమరుగవడంచేస్తున్నాయని తేలింది.



## సెర్బియా పార్లమెంట్‌పై ఉగ్రదాడి

- కాల్పులు.. టెంట్ దగ్ధం
- ఓ అనుమానితుడు అరెస్టు

**బెల్‌గ్రేడ్ (సెర్బియా), అక్టోబరు 22:** సెర్బియా పార్లమెంట్ వద్ద కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పులో ఒకరు గాయపడ్డారు. అలాగే అధ్యక్షుడు అలెగ్జాండర్ వుసిక్ మద్దతుదారులకు చెందిన టెంట్‌కు నిప్పు పెట్టారు. భద్రతా అధికారుల సమాచారం ప్రకారం, పార్లమెంట్ వెలుపల కాల్పులు చోటుచేసుకున్నాయని, అదే సమయంలో టెంట్ అగ్నికీలలో దగ్ధమైంది. కాల్పుల్లో 57ఏళ్ల వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అప్రమత్తమైన సాయుధ భద్రతా దళం ఘటనా స్థలంలో అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసింది. దాడికి ఎవరు పాల్పడ్డారన్నది తెలియడం లేదు. ఘటనను ఉగ్రవాదచర్యగా అధ్యక్షుడు అలెగ్జాండర్ వుసిక్ అభివర్ణించారు.

# తమిళనాడులో భారీ వర్షాలు

## లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు



**చెన్నై, అక్టోబరు 22:** తమిళనాడును భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. కడలూరు జిల్లాలో కుండపోత వానకు ఓ నివాసం కూలిపోవడంతో ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం రాబోయే 24 గంటల్లో తీరం దాటే అవకాశం ఉండటంతో తమిళనాడుతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా జిల్లాల్లోనూ అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. వాతావరణ శాఖ తమిళనాడులోని చెంగల్‌పట్టు, విల్లుపురం, కడలూరు, మైలాడుతురై జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, కడప జిల్లాలకు కూడా రెడ్ అలర్ట్ ప్రకటించింది. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. 24 గంటల వ్యవధిలో 20 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వర్షాల నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రెడ్ అలర్ట్ జారీ అయిన జిల్లాలకు 12 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులను పర్యవేక్షకులుగా నియమించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, సహాయక శిబిరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. చెంగల్‌పట్టు కలెక్టర్ డి. స్నేహ మాట్లాడుతూ, వర్షాలకు ముందే పూడికతీత పనులు పూర్తి చేశాం. నీటిని తోడే పంపులు, సహాయక కేంద్రాలు, కమ్యూనిటీ కిచెన్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. భారీ వర్షాల కారణంగా తమిళనాడులోని 13 జిల్లాల్లో పాఠశాలలకు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. తూత్తుకుడి, తిరువారూర్ జిల్లాల్లోని పలు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. నాగపట్నం, తిరువారూర్ జిల్లాల్లో వేలాది ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జేసీబీలు, బోట్లు, చెట్లను తొలగించే యంత్రాలతో పాటు జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) బృందాలను సిద్ధంగా ఉంచారు.

# కన్నతల్లిని హత్యచేసిన కసాయి

**చండీగఢ్, అక్టోబరు 22:** దేశమంతా దీపావళి సంబరాల్లో మునిగివున్న వేళ చండీగఢ్‌లో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. కన్న కొడుకే కాలయముడై తన తల్లిని అత్యంత కిరాతకంగా హత్య చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం సెక్టార్ 40లో నివసిస్తున్న 60 ఏళ్ల సుశీల అనే మహిళను ఆమె కొడుకు రవీందర్ నేగి అలియాస్ రవి (40) కత్తితో పొడిచి చంపాడు. దీపావళి రోజు ఉదయం 7 గంటల సమయంలో సుశీల ఇంట్లో నుంచి గట్టిగా కేకలు వినిపించాయని పొరుగున ఉంటున్న ఆకాశ్ బెయిన్స్ పోలీసులకు తెలిపారు. దీంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకునేసరికి ఇంటికి లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. వారు టెర్రస్ పైనుంచి ఇంట్లోకి ప్రవేశించి చూడగా, రవి చేతిలో కత్తితో పారిపోవడం కనిపించింది. లోపల సుశీల రక్తపు మడుగులో పడి ఉన్నారు. వెంటనే స్థానికులు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

# మరిన్ని పెట్టుబడులు పెట్టండి



## దిగ్గజ సంస్థ ఒరికాకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం

### ఆస్ట్రేలియాలో సిఇఒ, ఎండి సంజీవ్ గాంధీతో ప్రత్యేకంగా భేటీ

**హైదరాబాద్, అక్టోబరు 22 ప్రభాతవార్త:** దేశంలోనే పారిశ్రామికాభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలుస్తున్న తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఆస్ట్రేలియా ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలను నిర్వహిస్తున్న దిగ్గజసంస్థ ఒరికా ప్రతినిధులను మంత్రి శ్రీధర్ బాబు కోరారు. ఆ దేశ పర్యటనలో భాగంగా బుధవారం మెల్‌బోర్న్‌లో పారిశ్రామిక పేలుడు పదార్థాల తయారీ, మైనింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర రంగాల్లో అంతర్జాతీయ అగ్రగామిగా ఉన్న ఆ సంస్థ సిఈఓ, ఎండి సంజీవ్ గాంధీ, ఇతర ప్రతినిధులతో మంత్రి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తెలంగాణలో ఒరికా ప్రస్తుత కార్యకలాపాలు, భవిష్యత్తు విస్తరణ ప్రణాళికలపై ఈసమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఇన్నోవేషన్, టెక్నాలజీ హబ్‌లను ఏర్పాటు చేసేందుకు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు తెలంగాణ వైపు చూస్తున్నాయి. జిసిసిలు, పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రం అత్యంత అనుకూలం. పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించే ప్రగతిశీల విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ఎకో సిస్టమ్, స్థిరమైన ప్రభుత్వం, సమర్థవంతమైన నాయకత్వం అందుబాటులో ఉంది అని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు కంపెనీ ప్రతినిధులకు వివరించారు. ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్, సస్టెయినబిలిటీ, మాన్యుఫాక్చరింగ్, మైనింగ్ రంగాల్లో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని ఆహ్వానించారు. పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చొరవ, అమలు చేస్తున్న ప్రోత్సాహకర, ప్రగతిశీల విధానాలు అభినందనీయం. ప్రస్తుతం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న జిసిసిలో డిజిటల్ ఇంజనీరింగ్, ఆటోమేషన్, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్ తదితర రంగాల్లో 600 మంది హై స్కిల్డ్ నిపుణులకు ఉద్యోగాలు కల్పించాం. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. తెలంగాణలో కార్యకలాపాల విస్తరణ, వివిధ రంగాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఒరికా సంస్థ సిఈఓ, ఎండి సంజీవ్ గాంధీ తెలిపారు. ఆస్ బయోటెక్ 2025 ఇంటర్నేషన్ కాన్ఫరెన్స్‌లో కీలకోపన్యాసం చేసేందుకు ఆస్ట్రేలియాకు విచ్చేసిన మంత్రి శ్రీధర్ బాబును కంపెనీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

# రాష్ట్రంలో కొత్తగా 10 వ్యవసాయ మార్కెట్లు

## వ్యవసాయ మంత్రి తుమ్మల

**హైదరాబాద్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** తెలంగాణలో రైతుల సౌకర్యార్థం కొత్తగా 10 వ్యవసాయ మార్కెట్ యార్డులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డుల సంఖ్య 207కి చేరుతుందన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో రాష్ట్రంలో ఇప్పటి వరకు 172 మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గాలను నియమించినట్లు చెప్పారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 2,408 మంది పార్టీ కార్యకర్తలకు మార్కెట్ కమిటీలలో నామినేటెడ్ పోస్టులు దక్కాయని వెల్లడించారు. మిగిలిన 35 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు త్వరలోనే నియామకాలు పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు.

తమ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతులు పంటలు అమ్ముకునే సమయంలో ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకొని అన్ని మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మార్కెట్ కమిటీ లలో పాలక వర్గాల నియామకం వల్ల మార్కెట్లలో పారదర్శకత పెరుగుతుందని, రైతులకు సకాలంలో సౌకర్యాలు అందుతాయని తెలిపారు.

# తెలంగాణ వచ్చాక మోసపోయింది దళితులే

## ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం

**హైదరాబాద్, అక్టోబరు 22 ప్రభాతవార్త:** తెలంగాణ వచ్చాక ఎవరైనా మోసపోయారంటే అది దళితులే అని ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం అన్నారు. బుధవారం గాంధీ భవన్‌లో మీడియా మాట్లాడారు. పదేండ్ల పాలనలో బిఆర్ఎస్ ఒక చేత్తో రాజయ్యకు ఇలా మంత్రి పదవి ఇచ్చి అలా మరో చేయితో లాక్కున్నారని అన్నారు. ఆ తర్వాత కడియంకు ఇచ్చి ఆయన్ను కూడా పక్కదోవ పట్టించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోకి వచ్చాక 15 మంది ఉన్న కేబినెట్ లో ఐదుగురు దళితులకు మంత్రి పదవులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌ది అన్నారు. ఇందులో ఒక డిప్యూటీ సిఎం, స్పీకర్, హెల్త్ మినిస్టర్, మైన్స్ మినిస్టర్, సోషల్ వెల్ఫేర్ మినిస్టర్ ఉన్నారు అన్నారు. అద్లూరిపై మాట్లాడే స్థాయికి కిశోర్ రావడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అద్లూరిపై మరోసారి మాట్లాడితే నాలుక చీరుతామన్నారు.

# రాష్ట్ర సాధన కోసం కోదండరాం నిస్వార్థ కృషి



## టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

### జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో టిజెఎస్ మద్దతు కోరిన మహేష్‌కుమార్‌గౌడ్

### ఉద్యమకారులకు గుర్తింపునివ్వాలి: ప్రొ.కోదండరాం

**హైదరాబాద్, అక్టోబరు 22 ప్రభాతవార్త:** తెలంగాణ ఆవిర్భావంలో కోదండరాం పాత్ర చరిత్రలో నిలిచిపోయేదని, నిస్వార్థంగా నిజాయితీగా రాష్ట్ర సాధన కోసం కృషి చేశారని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం నాంపల్లిలోని తెలంగాణ జనసమితి పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షులు కోదండ రాంతో టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ భేటి అయ్యారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి టిజెఎస్ మద్దతుపై చర్చించారు. ఈ సందర్భంగా టిపిసిసి చీఫ్ మాట్లాడుతూ పదేళ్ల బిఆర్ఎస్ పాలన ఎలా గాడి తప్పిందో ప్రజలకు తెలుసునన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ నిరంకుశ పాలన విముక్తి కోసం 2023లో మేమెంత కలిసి పోరాడామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి వారి సహకారం మరచిపోమని, ఉద్యోగ నియామక రూప కల్పనలో కోదండరాం సలహాలు సూచనలు విలువైనవని అన్నారు. ప్రజల ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగా ప్రజా పాలన సాగుతుందన్నారు. జూబ్లీ హిల్స్ ఎన్నికలో మద్దతు కోరినట్లు తెలిపారు. యువకుడైన నవీన్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేసినట్లు వివరించారు. సిపిఐ, సిపిఎం, ఏంఐఎం పార్టీల మాదిరిగానే టిజెఎస్ మద్దతు కోరినట్లు తెలిపారు.

కేంద్ర మంత్రి స్థాయిలో ఉండి బండి సంజయ్ ఏం మా ట్లాడుతున్నారో అర్థమవుతుందా? అంటూ ప్రశ్నిం చారు. కేంద్రమంత్రికి స్థాయి వ్యక్తి నోటికొచ్చింది మాట్లాడటం విచారకరం అన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టి, సెంటిమెంట్ రాజేసి లబ్ధి పొందాలని బిజెపి నేతల పన్నాగం చేస్తున్నారని అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మతవాద శక్తులకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. మిత్ర పక్షాల విషయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని అన్నారు. ఎన్నికల సమ యంలో కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు గుర్తింపు ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని, నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం వేగంగా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మిత్రపక్షంగా టిజెఎస్ పార్టీకి ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వంలో తగిన భాగస్వామ్యం కల్పించాలని, రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో పలుచోట్ల టిజెఎస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా బిసిరిజర్వేషన్ల సాధన కోసం తీవ్రంగా కృషి చేయాలని, ఆ ప్రయత్నానికి టిజెఎస్ పార్టీ తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక విషయంలో టిజెఎస్ రాష్ట్ర కమిటీసమావేశంలో చర్చించి తుది నిర్ణయం ప్రకటిస్తామని కోదండరాం తెలిపారు. ఈ కార్యక్రమంలో టిజెఎస్ పార్టీ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వరరావు,ప్రధాన కార్యదర్శులు గొప్పగాని శంకర్‌రావు, పల్లెవినయ్, నిజ్జన రమేష్ ముదిరాజ్,ఆశప్ప, నాయకులు మాసంపల్లి అరుణ్ కుమార్, సర్దార్‌జస్వంత్, బట్టల రామ చందర్, కొత్తరవి,ప్రశాంత్, హనుమంత్ రెడ్డి పాల్గొన్నారు.

# ఐఎఎస్ రిజ్వీ విఆర్ఎస్‌కు ఆమోదం

## ముగ్గురికి అదనపు బాధ్యతలు

**హైదరాబాద్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** తెలంగాణలో పనిచేస్తున్న సీనియర్ ఐఎఎస్ అధికారి సయ్యద్ అలీ ముర్తజా రిజ్వీ స్వచ్ఛంద పదవీ విరమణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రిజ్వీ స్వచ్ఛంద పదవీ విరమణ ఈ నెలాఖరు నుండి అమల్లోకి రానుంది. తనకు స్వచ్ఛంద పదవీ విరమణకు అనుమతి ఇవ్వాలని ఇటీవల రిజ్వీ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ప్రభుత్వం అందుకు అనుమతించింది. ఈ మేరకు దీనికి సంబంధించి బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా తెలంగాణలో ముగ్గురు ఐఏఎస్ అధికారులకు అదనపు బాధ్యతల్లో ప్రభుత్వం మార్పులు చేసింది. దీనికి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మరోక ఉత్తర్వులు జారీ చేశారు. వాణిజ్య పన్నుల కమిషనర్ ఎం.రఘునందన్ రావును రెవెన్యూ (వాణిజ్యపన్నులు, ఎక్సైజ్) శాఖ కార్యదర్శి పదవికి పూర్తి అదనపుఛార్జ్ (ఎఫ్ఎసి) ఇచ్చింది. తెలంగాణ జెన్కో సిఎండి. ఎస్ హరీష్ ను ఎండోమెంట్స్ డైరెక్టర్ బాధ్యలను అప్పగించింది. శైలజా రామయ్యర్ ను పూర్తి అదనపు ఛార్జ్ నుండితప్పించింది. అలాగే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేష్ మిశ్రా ను గనులు, భూగర్భ శాస్త్ర డైరెక్టర్ పదవిలో పూర్తి అదనపు బాధ్యతలను కట్టబెట్టింది. ఈ అదనపు పూర్తి బాధ్యతలను ఇప్పటి వరకూ చూస్తున్న వల్లూరు క్రాంతిని దాని నుండి తప్పించింది. ఇక రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలను గరిమా అగర్వాల్‌కు కట్టబెట్టింది. గరిమా అగర్వాల్ ప్రస్తుతం సిద్దిపేట అదనపు కలెక్టర్‌గా సేవలందిస్తున్నారు. గరిమా అగర్వాల్ ఇంతకు ముందు కరీంనగర్ జిల్లాఅదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా సేవలు అందించారు. 2019 ఐఏఎస్ బ్యాచ్ కి చెందిన గరీమా అగర్వాల్ యాదాద్రి భువనగిరి జిల్లా ట్రైనీకలెక్టర్‌గా రెండేళ్లు, కరీంనరగ్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా రెండేళ్లు పనిచేశారు.

# సంక్షేమ హాస్టళ్ల టెండర్లు రద్దు

**హైదరాబాద్,అక్టోబరు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగ తులు, మైనార్టీ వర్గాలకు చెందిన గురుకులాలు, హాస్టళ్లలో టెండర్లను రద్దు చేస్తూ తెలంగాణ సర్కార్ నిర్ణయం తీసుకుంది. సంక్షేమ గురుకులాలు, హాస్టళలో లక్షలాది మంది విద్యార్థులకు అవసరమయ్యే వస్తువుల సరఫరాకు సంబంధించిన టెండర్లను పునఃసమీక్షించనుంది. దీంతో ప్రస్తుత విద్యాసంవత్సరంలో సంక్షేమ గురుకులాలు, హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు ట్రంక్ పెట్టెలు, డ్రెస్సులు, స్కూల్ బ్యాగుల వంటి వ్యక్తిగత వస్తువులు అందించే కార్యక్రమం వాయిదా పడింది. గురుకుల విద్యార్థులకు యూనిఫాంలు, పీటీ డ్రెస్సులు, స్కూల్ బ్యాగులు, ట్రంక్ పెట్టెలు, బెడ్ మెటీరియల్, బూట్ల వంటి వ్యక్తిగత వస్తువుల సరఫరా కోసం కేంద్రీకృత (సెంట్రలైజ్డ్) టెండర్ల ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో ప్రారంభించింది. అన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల సొసైటీలకు కలిపి ఒకే టెండర్ విధానాన్ని (గవర్నమెంట్ ఇమార్కెట్ ప్లేస్ జెమ్) తీసుకొచ్చారు. వాస్తవానికి ఈ టెండర్లు గత నెలలోనే ఖరారై, సరఫరా ఈనెల 1 నుంచి ప్రారం భం కావాల్సి ఉండగా, స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ కారణంగా ఆలస్యం జరిగింది. ఫలితంగా ఇప్పటికే విద్యాసంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు కావడంతో వివిధ వస్తుల సరఫరా టెండర్లను పూర్తిగా నిలిపివేశారు. జెమ్‌లో చేసుకున్న దరఖాస్తులు కూడా రద్ద య్యాయి.మరోవైపు విద్యార్థుల డైట్ (పౌష్టికాహారం) కోసం సరకుల సేకరణ ప్రక్రియ విషయంలో ఇప్పటికే పెండింగ్‌పడింది. ఈ పౌష్టికాహారం సరఫరాకు సంబంధించిన టెండర్ల వ్యవహారం కూడా కోర్టు పరిధిలో ఉండడంతో దీనిపైకూడా సందిగ్ధత నెలకొంది. ఈ నిర్ణ యంతో ఈ విద్యాసంవత్సరం విద్యార్థులకు వస్తువుల సరఫరా ఉండే అవకాశాలు కనిపించడం లేదు.

# రికార్డు స్థాయిలో జల విద్యుత్

**హైదరాబాద్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** ఈ సీజన్‌లో రిజర్వాయర్లలోకి భారీ వరద నీరు వచ్చి చేరడంతో తెలంగాణలో జల విద్యుత్తు కేంద్రాలు పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయి. జల విద్యుత్ ఉత్పత్తిని రికార్డు స్థాయిలో జరుపుతున్నాయి. తెలంగాణ జెన్కో ఈ నెల 19న అర్ధరాత్రి నాటికి 5 వేల మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసింది. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత రికార్డు స్థాయిలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో 6831 మిలియన్ యూనిట్ల జలవిద్యుత్తు ఉత్పత్తి జరగ్గా, ఆ రికార్డును ప్రస్తుత సంవత్సరంలో దాటే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో ఈ నెల 20 నాటికి జల, థర్మల్ విద్యుత్తు కలిపి 20 వేల మిలియన్ యూనిట్లు ఉత్పత్తి జరిగింది. దీంతో సీజన్ ముగిసేనాటికి జలవిద్యుత్తు ఉత్పాదన కొత్త రికార్డులు సృష్టిస్తుందని అంచనా వేస్తున్నారు. కరెంటు యూనిట్ రూ.4 చొప్పున డిస్కమ్‌లకు విక్రయిస్తోంది. విద్యుత్తును ఉత్పత్తి చేసి విక్రయించడంతో ఇప్పటి వరకూ తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కోకు 2 వేల కోట్ల రూపాయలకు పైగా ఆదాయం లభించింది. కాగా రాష్ట్రంలో తొమ్మిది ప్రాజెక్టుల వద్ద 2441.8 మెగావాట్ల సామర్థం కలిగిన జలవిద్యుత్ కేంద్రాలు ఉండగా, అందులో కృష్ణా నదిపై 2371.6 మెగావాట్ల కేంద్రాలు, గోదావరిపై 70.2 మెగావాట్ల కేంద్రాలున్నాయి.

# హంతకులకు మద్దతు తెలపడం సరికాదు

## విహెచ్‌పి రాష్ట్ర ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి

**హైదరాబాద్ (అఫ్జల్‌గంజ్), అక్టోబరు 22ప్రభాత వార్త:** విధి నిర్వహణలో ఉన్న పోలీసులను అత్యంత క్రూరంగా హత్య చేసిన సమయంలో స్పందించని మానవ హక్కులు,ఉగ్రవాదులకు తగురీతిలో జవాబు ఇచ్చినప్పుడు స్పందిచడం అత్యంత దారుణం అని విశ్వహిందు పరిషత్ రాష్ట్ర ప్రచార ముఖ్ పగుడాకుల బాలస్వామి అన్నారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర ప్రవృత్తులకు మరింత ప్రోత్సాహం, లభించేలా మానవ హక్కులు మాట్లాడటం చూస్తుంటే హంతకులకు ఆయుధాలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు అవుతుందని ఏద్దేవా చేశారు. పోలీసుల ప్రాణాలకు విలువలేదా,అని మానవహక్కులను ఆయన ప్రశ్నించారు.నిజామాబాద్ నగరంలో ప్రమోద్ అనే కానిస్టేబుల్‌ను అత్యంత ఘోరంగా హత్య చేసి,మరి కొంతమందిని చంపేందుకు ప్రయత్నం చేసిన రియాజ్‌ను ఎన్‌కౌంటర్ పోలీసుల పనితీరుకు నిదర్శనం అని ప్రశ్నించారు. ఈవిషయంలో తెలంగాణ డిజిపి శివధర్‌రెడ్డి,నిజామాబాద్ కమిషనర్ సాయిచైతన్య పనితీరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఉగ్రవాది జాతికి సంబంధించిన రియాజ్ ఎన్‌కౌంటర్ పోలీసుల సమర్ధతకు సాక్ష్యంగా నిలుస్తుందన్నారు.చట్టాన్ని చేతిలోకి తీసుకుని రాజ్యాంగాన్ని ఉల్లఘించే ఎంతటి జిహాదీ మూకలకైనా ఇదే రీతిలో జవాబు ఇవ్వాలని పోలీసుయంత్రాంగానికి బాలస్వామి కోరారు. అంతే కాకుండా ప్రమోద్ కుటుంబాన్ని ఆదుకుని పోలీసు విభాగం బాసటగా నిలిచిందన్నారు.

# కెకెసి జాతీయ ఉపాధ్యక్షుడుగా నవాబ్ షేక్ ఇబ్రహీం

**హైదరాబాద్, అక్టోబరు 22 ప్రభాతవార్త:** కార్మికుల, ఉద్యోగుల కాంగ్రెస్ (కంఘార్ కర్మచారి కాంగ్రెస్) జాతీయ ఉపాధ్యక్షులుగా తెలంగాణకు చెందిన నవాబు షేక్ ఇబ్రహీంను నియమిస్తూ ఏఐసిసి ప్రధాన కార్యదర్శి ఆర్గనైజేషన్ కేసి వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బుధవారం నవాబ్ ఇబ్రహీం గాంధీభవన్‌లో టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ని కలిసి తనకు ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్య వాదాలు తెలిపారు. తనకు ఇచ్చిన అవకాశాన్ని కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసే లక్ష్యంతో కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కౌశల్ సమీర్ పాల్గొన్నారు.



# వర్షాలకు దెబ్బతిన్న పంటలు

## తడిసిన ధాన్యం, మొక్కజొన్న

**హైదరాబాద్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** రాష్ట్రం లోని వివిధ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు చేదికంది వచ్చిన పంటలు నీటి పాలవుతున్నాయి. రైతులు దిగుబడి రాక ఇబ్బందులు పడుతుంటే ప్రకృతి రైతుపై కక్ష కట్టినట్లు పంట చేతికొచ్చే దశలో అధిక వర్షాలు పడటంతో పంట మొత్తం దెబ్బతిని తీవ్రంగా నష్టపోతున్నామని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. కోతకు వచ్చిన వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలు వర్షాలకు దెబ్బతిన్నాయని, పెట్టుబడులు సైతం నష్టపోతున్నామని పలువురు కన్నీటి పర్యాంతమవుతున్నారు. రాష్ట్రంలోని సిద్దిపేట పట్టణంలో ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. దీంతో పత్తి మార్కెట్‌లో ఉన్న మొక్కజొన్న, వరి ధాన్యం తడిసి ముద్దయింది. చాలా రోజుల కిందటే మార్కెట్‌కు మొక్క జొన్నలు, ధాన్యం తెచ్చినప్పటికీ కొనుగోలు చేయకపోవడంతో ధాన్యం మొత్తం తడిసిపోయిందని రైతులు వాపోయారు. తేమ శాతం తక్కువగా ఉన్నప్పటికీ కొందరు వ్యాపారులు కొనుగోలు చేయడం లేదని ఆరోపిస్తున్నారు. వ్యాపారులు నామమాత్రంగా కొన్ని కుప్పలను మాత్రమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నారని, మిగతా కుప్పలకు చాలా తక్కువ ధరలను నిర్ణయిస్తున్నారని, దీంతో నష్టపోతున్నామని అంటున్నారు. అలాగే దుబ్బాక మండల పరిధిలోని రాజక్కపేట ఐకేపీ సెంటర్లో పలువురు రైతులు ధాన్యాన్ని ఆరబెట్టారు. వేకువజామున కురిసిన వర్షంతో ధాన్యం తడిసి నీటి పాలైంది. అలాగే ఖమ్మం జిల్లాలో వర్షాలతో పత్తి పంట దెబ్బతింది. ఎకరాకు 50 వేల రూపాయలు పెట్టుబడి పెడితే కనీసం 20 వేల రూపాయల పంట కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదన్నారు. పత్తి తేమ ఉందని రూ.3,500 కే అడుగుతున్నారన్నారు. ఎకరాకు రూ.50 వేల చొప్పున, రూ.8 లక్షల పెట్టుబడి పెట్టినట్లు బాధిత రైతులు తీవ్ర నిర్వేదంతో తెలిపాడు. ఇక ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలో మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దాదాపు రెండు గంటలపాటు వర్షం ఎడతెరిపి లేకుండా కురిసింది. వారం రోజులు వర్షం కురువకపోవడంతో మక్క, సోయా, మినుము, పెసరు వంటి పంటలు చేతికి వచ్చాయి. ప్రస్తుతం పత్తి పంట చేతికి వచ్చే సమయంలో వర్షం కురవడంతో పత్తి పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు హెడ్ ఆఫ్ అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలి

## ఎమ్మెల్సీ మల్క కొమరయ్య

**హైదరాబాద్, అక్టోబరు 22 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న సుమారు 3,000 మంది రెగ్యులర్ టీచింగ్ సిబ్బందిని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్‌లో విలీనం చేసి, వారి వేతనాలను హెడ్ ఆఫ్ అకౌంట్ విధానం ద్వారా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ఆర్థికశాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాను కోరారు. ఈమేరకు సచివాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మల్క కొమరయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 194 మోడల్ స్కూళ్లలో సుమారు 3,000 మంది రెగ్యులర్ టీచింగ్ సిబ్బంది నిరంతరం సేవలందుతున్నారు. ఈ ఉపాధ్యాయులు రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థులను తయారు చేస్తున్నారు. వారి సేవలను గుర్తించి, తగిన న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తు చేశారు. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులను ఇప్పటికే స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో విలీనం చేసి హెడ్ ఆఫ్ అకౌంట్ విధానం ద్వారా వేతనాలు చెల్లిస్తున్న అంశాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. తెలంగాణలో కూడా ఇదే విధానాన్ని అమలు చేసి, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని ఎమ్మెల్సీ విజ్ఞప్తి చేశారు. ఇలాంటి నిర్ణయం ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రతను కల్పించడమే కాకుండా, ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింతబలోపేతంచేస్తుందని ఆయన పేర్కొన్నారు.



నిరుద్యోగుల సదస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య,చిత్రంలో గుజ్జ కృష్ణ తదితరులు

# 24న నిరుద్యోగుల సదస్సు

## 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేసి జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ అక్టోబరు 22 ప్రభాతవార్త:** రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేసి జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని బిసి జెఎసి చైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సదస్సుకు సంబందించిన పోస్టర్ ఆవిష్కరణ బుధవారం బిసిభవన్‌లో జరిగింది. అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ గత రెండేళ్లలో పలు నోటిపికేషన్లు కలిపి 60వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని ధ్వజమెత్తారు. మిగతా ఉద్యోగాలు ఎన్ని భర్తీ చేస్తారని ప్రశ్నించారు. ఇంకా అనేక ప్రభుత్వశాఖలలో పెద్ద ఎత్తున ఖాళీలను భర్తీ చేయడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నెల 24న వేలాదిమందితో నిరుద్యోగుల సదస్సు జల విహార్‌లో జరుపాలని నిర్ణయించామని, ప్రభుత్వం జాబ్ క్యాలెండరు ప్రకటిస్తారని నిరుద్యోగులంతా ఎదురుచూస్తున్నారని తెలిన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడానికి నిరుద్యోగులు కారణమని, వీరిని విస్మరిం చడం తగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి నేతలు గుజ్జ కృష్ణ, వేముల రామకృష్ణ, అంజి, అనంతయ్య,రెడపాక రవి, కయ్య వెంకటేష్, శంకర్ నాయక్, బాలకోటి, రవికుమార్, సింధు రెడ్డి, రమాకాంత్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిష్ఠాత్మక గ్లోబల్ సదస్సుకు కెటిఆర్‌కు ఆహ్వానం

## శ్రీలంకలో జరిగే గ్లోబల్ ఎకనామిక్ అండ్ టెక్నాలజీ సమ్మిట్‌లో కీలకోపన్యాసం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, అక్టోబరు22:** తెలంగాణ మాజీ ఐటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి శాఖామాత్యులు, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు మరో అరుదైన గౌరవం దక్కింది. శ్రీలంకలోని కొలంబోలో జరగబోయే ప్రతిష్ఠాత్మక గ్లోబల్ ఎకనామిక్ అండ్ టెక్నాలజీ సమ్మిట్(జిఈటిఎస్)- 2025 సదస్సులో ఆయనకు కీలకోపన్యాసం చేసేందుకు ఆహ్వానం అందింది. ఈ సదస్సు నవంబర్ 10 నుంచి 12, 2025 వరకు కొలంబోలోని ది కింగ్స్‌బరీ హోటల్‌లో జరగనుంది.శ్రీలంక సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ తరపున, జిఈటిఎస్ శ్రీలంక డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎ.యు.ఎల్.ఎ. హిల్మీ ఈ ఆహ్వానాన్ని కేటీఆర్‌కు పంపారు. ఇన్నోవేషన్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ప్రాంతీయ సహకారం వంటి అంశాలపై చర్చించేందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న విధాన రూపకర్తలు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నాయకులను ఈ సదస్సు ఒకే వేదికపైకి తీసుకురానుంది. డాక్టర్ హిల్మీ తన లేఖలో ఐటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి రంగాలలో తెలంగాణను భారతదేశంలోనే అత్యంత శక్తివంతమైన కేంద్రంగా తీర్చిదిద్దడంలో కేటీఆర్ పోషించిన పాత్రనును కొనియాడారు. పెద్ద ఎత్తున పారిశ్రామిక, సాంకేతిక కార్యక్రమాలను ఆయన నడిపించిన విధానం, అనేక వర్ధమాన ఆర్థిక వ్యవస్థలకు ఒక ఆదర్శంగా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు. కేటీఆర్ పాల్గొనడం వల్ల దక్షిణ ఆసియాలోని విధాన రూపకర్తలు, పారిశ్రామికవేత్తలు స్ఫూర్తి పొందుతారని జిఈటిఎస్- 2025 సదస్సు కార్యదర్శి తెలిపారు. అలాగే, సాంకేతిక, ఆర్థిక వృద్ధిలో భారతదేశం - శ్రీలంక సహకారాన్ని బలోపేతం చేయడానికి ఇది దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సదస్సుకు వివిధ దేశాల నుండి మంత్రులు, పెట్టుబడిదారులు, స్టార్టప్ నాయకులు, ఆవిష్కర్తలు హాజరవుతారని, సుస్థిరమైన, సాంకేతికత ఆధారిత ఆర్థిక వ్యవస్థలను నిర్మించడంపై దృష్టి సారిస్తారని తెలిపారు.

# వచ్చేనెల 26న ఢిల్లీలో 'రాజ్యాంగ హక్కుల సాధన సభ': అద్దంకి దయాకర్

**హైదరాబాద్, అక్టోబరు 22,ప్రభాతవార్త:** వచ్చేనెల 26న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగినే "రాజ్యాంగ హక్కుల సాధన సభ"ను విజయవంతం చేయాలని జాతీయ మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు ఎంఎల్‌సి అద్దంకి దయాకర్ అన్నారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సభ పోస్టర్ ఆవిష్కరించి మాట్లా డుతూ ప్రైవేట్‌రంగంలో రిజర్వేషన్లు సాధిం చడంతో పాటు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై జరిగిన దాడికి నిరసనగా నవంబర్ 26న నిర్వహించ తలపెట్టిన జంతర్ మంతర్ సభను విజయవంతం చేయాలని అద్దంకి పిలుపుని చ్చారు. 1990 అనంతరం ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు తగ్గిపోవడం రిజర్వేషన్ల పాత్ర తగ్గిందని అన్నారు. ఆనాటి నుంచి ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లను సాధించుకునేందుకు ప్రయత్నిస్తున్న ప్రయోజనం లేకుండా పోయిందని ఈ నేపథ్యంలో ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ సాధిం చుకోవడంతో పాటు రాజ్యాంగాన్ని పరీక్షిం చుకునేందుకు




ప్రతి ఒక్కరు హాజరు కావాలని కోరారు. దీనికి దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి పెద్దఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు.

# 'సృష్టి'గోల్‌మాల్‌పై త్వరితగతిన విచారణ

**చంచల్‌గూడ జైల్లో ఐదు గంటల పాటు మహిళా నిందితురాలిని విచారించిన ఇడి**

**28వ తేదీ వరకు కొనసాగనున్న విచారణ**

**మనీలాండరింగ్‌లో కోట్లాది రూపాయలు అక్రమంగా చేతులు మారాయని గుర్తింపు**

**హైదరాబాద్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా సలచంనం రేపిన సృష్టి ఆసుపత్రి సరోగసి స్కాంలో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ విచారణ వేగం పుంజుకుంది. గత జూలై నెలలో ఈ ఆసుపత్రిలో సరోగసి స్కాం జరుగుతున్నట్లు హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేయడం తెలిసిందే. ఈ సందర్బంగా సృష్టి ఫర్టిలిటీ కేంద్రంలో జరుగుతున్న చైల్డ్ ట్రాఫికింగ్ అక్రమాలను రట్టు చేయడం విదితమే. పిల్లలు కలగని దంపతులకు సరోగసి ద్వారా పిల్లలు కనేలా చేస్తామని లక్షలాది రూపాయలు దండుకుని, నవజాత శిశు విక్రయ ముఠాల నుంచి పిల్లల ను కొనుగోలు చేసి ఈ పసికందులను దంపతులకు వారికి పుట్టిన వారిగా నమ్మించి అంటగడుతున్నట్లు పోలీసులు తేల్చడం సంచలనం రేపింది. ఈ కేసులో సృష్టి ఆసుపత్రి నిర్వాహకురాలు డాక్టర్ నమ్రతతో పాటు 30 మంది అరెస్టు చేయగా మరికొందరు ఇప్పటికీ పరారీలో వున్నారు. వీరి కోసం దేశ వ్యాప్తంగా గాలిస్తున్నారు. కాగా సృష్టి ఫర్టిలిటీ కేంద్రం దేశ వ్యాప్తంగా గల శిశు విక్రయ ముఠాలతో సంబంధాలు కలిగి వుండి, పదుల కోట్ల రూపాయలను దండుకుందని, ఇదంతా మనీలాండరింగ్ కోణంలో జరిగిందని నిర్ధారించిన ఈడీ దీనిపై విచారించేందుకు ఆగస్టు నెల మొదటి వారంలో రంగంలో దిగడం తెలిసిందే. ఇదే విషయంలో అప్పట్లోనే పోలీసులు అరెస్టు చేసిన నిందితులను విచారించేందుకు ఈడీ అధికారులు ప్ర యత్నించగా అప్పటికే వారిని జైలుకు తరలించడంతో వీలు కుదరలేదు. దీంతో ఈడీ అధికారులు ఈ కేసులో అరెస్టయి చంచల్‌గూడ మహిళా జై లులో వున్న నలుగురు నిందితులను విచారించేందుకు నాంపల్లి కోర్టు నుంచి ప్రత్యేకంగా అనుమతి పొందారు. మహిళా జైల్లో వున్న సృష్టి ఆసుపత్రి నిర్వాహకురాలు డాక్టర్ నమ్రతతో పాటు ఆసుపత్రిలో పనిచేసే నందిని, సంతోషి, కల్యాణిలను విచారించేందుకు ఈ నెల 28వ తేదీ వరకు కోర్టు నుంచి ఈడీ అధికారులు అనుమతి పొందారు. ఈ అనుమతి పత్రాలతో బుధవారం ఉదయం 11 గంటల సమయంలో ఈడీ అధికారులు చంచల్ గూడ మహిళా జైలు అధికారులను కలిసి మొదటగా సంతోషి అనే నిందితురాలిని ఐదు గంటల పాటు విచారించారు. సృష్టి ఆసుపత్రి గోల్‌మాల్‌లో డాక్టర్ నమ్రత వెంట మొదటి నుంచి వున్నది సంతోషిగా పోలీసులు తేల్చడంతో ఆమె విచారణ కీలకంగా మారింది. సంతోషిని ఐదు గంటల పా టు విచారించిన ఈడీ అధికారులు ఆమె నుంచి ఈ స్కాంలో కీలక సమాచారం రాబట్టినట్లు తెలిసింది. విచారణ సమయంలో డాక్టర్ నమ్రత సన్ని హితులు కొందరిని ఈడీ అధికారులు వెంట తెచ్చినట్లు తెలిసింది. సంతోషిని విచారించిన తరువాత ఈడీ అధికారులు మీడియాతో మాట్లాడకుండా వెళ్లిపోయారు. గురువారం నాడు మరో నిందితురాలిని విచారించే వీలుందని తెలిసింది. వారం రోజుల పాటు సాగే ఈడీ విచారణలో డాక్టర్ నమ్రత ను రెండు రోజుల పాటు విచారించే వీలుందని సమాచారం. ఈ కేసులో ఈడీ అధికారులు ఇప్పటికే మనీలాండరింగ్ కోణంలో కేసు నమోదు చేయడంతో పాటు ఇందులో భాగంగా సికింద్రాబాద్‌లోని ఆసుపత్రితో పాటు విజయవాడ, వైజాగ్ లలో దీనికి అనుబంధంగా వున్న ఆసుపత్రులలోనూ త నిఖీలు చేబట్టి పత్రాలు జప్తు చేశారు. మూడు ప్రాంతాల్లో గల ఆసుపత్రుల బ్యాంకు ఖాతాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి కొన్నింటిని సీజ్ చేశారు. తా జాగా జరిగే విచారణ తరువాత ఈ కేసులో ఈడీ అధికారులు కొందరిని అరెస్టు చేసే వీలుంది.



## ఐదుదశాబ్దాల తర్వాత చీకటినుంచి స్వగ్రామానికి నాగా వృద్ధనేత

**ఇంపాల్, అక్టోబరు 22:** నాగా ఉద్యమ నేత, నేషనలిస్ట్ సోషలిస్టు కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్ (ఎన్ఎస్‌సిఎన్ ఇషాక్‌మ్యుయ్‌వా) అధినేత థయింగ్‌లాంగ్ ముయివా సుమారు 50 ఏళ్ల తర్వాత స్వగ్రామానికి వచ్చారు. బుధవారం మణిపూర్‌లోని ఉఖ్రుల్ జిల్లాలోని స్వగ్రామమైన సోమ్‌డాల్‌కు చేరుకున్నారు. 91 ఏళ్ల ముయివాకు అక్కడి ప్రజలు ఘన స్వాగతం పలికారు. వేలాది మంది నాగా మహిళలు సాంప్రదాయ దుస్తుల్లో రాగా, ఈటెలతో పాటు తలపాగాలు ధరించిన పురుషులు ముయివాను స్వాగతించారు. అనేక మంది పార్టీ కార్యకర్తలు సైతం హాజరయ్యారు. ఇది నాగాలందరికీ ఒక భావోద్వేగ క్షణమని, తామంతా ఆయన కథ వింటూనే పెరిగామని వారు తెలిపారు. ఆయన పర్యటన నేపథ్యంలో జిల్లాలో అనేక హోర్డింగ్‌లు, వాల్ పెయింటింగ్‌లు ఏర్పాటు చేశారు. జిల్లా ప్రధాన కార్యాలయంతో పాటు వివిధ ప్రాంతాల్లో రాత్రి శుభ్రతా కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా కేంద్రం నుంచి 25 కి.మీ దూరంలో ఉన్న తన స్వస్థలమైన సోమ్‌డాల్ గ్రామానికి ముయివా వెళ్తారని మరొక అధికారి వెల్లడించారు. ఆయన రాక కోసం సోమ్‌డాల్ వద్ద హెలిప్యాడ్ నిర్మించినట్లు ఆయన వివరించారు. తన స్వగ్రామంలో ఒక వారం బస చేసిన తర్వాత అక్టోబర్ 29న మణిపూర్‌లోని సేనాపతి జిల్లా మీదుగా దిమాపూర్‌కు వెళతారాని పేర్కొన్నారు. 1960లో జరిగిన నాగా ఉద్యమంలో థయింగ్‌లాంగ్ ముయివా కీలక పాత్ర పోషించారు. కాగా, 1975 నవంబరులో నాగా నేషనల్ కౌన్సిల్ ఎన్ఎన్‌సీలోని ఒక వర్గంతో ప్రభుత్వం షిల్లాంగ్ శాంతి ఒప్పందం కుదుర్చుకుంది. దీనికింద నాగా నేషనల్ కౌన్సిల్ (ఎన్ఎన్‌సీ), నాగా ఫెడరల్ గవర్నమెంట్ (ఎన్ఎఫ్‌జీ) సంబంధిత వర్గం వారు ఆయుధాలు విడిచిపెట్టేందుకు అంగీకరించారు. కానీ, థయింగ్‌లాంగ్ ముయివా నేతృత్వంలోని 140 మంది సభ్యులు మాత్రం ఈ ఒప్పందాన్ని తిరస్కరించారు. అనంతరం వారితో విభేదించి 1980లో వీరంతా కలిసి నేషనలిస్ట్ సోషలిస్టు కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్ (ఎన్ఎస్‌సీఎన్)ను స్థాపించారు. ముయివాతో పాటు ఇసాక్ చిషి షూ, ఎస్.ఎస్.ఖప్లాంగ్‌లు చేతులు కలిపి ఎన్ఎస్‌సిఎన ఏర్పాటు చేశారు. అయితే, 1988లో ఒక హింసాత్మక ఘటన అనంతరం ఎన్ఎస్‌సీఎన్‌లో చీలిక ఏర్పడింది. ఫలితంగా ఎన్ఎస్‌సీఎన్ (ఇసాక్ ముయివా), ఎన్ఎస్‌సీఎన్ (కప్లాంగ్)లుగా విడిపోయాయి. కాలక్రమంలో ఇషాక్ ముయివా వర్గమే ప్రాచుర్యంలోకి వచ్చింది.

# విద్యుత్ చట్ట సవరణతో ఉచిత విద్యుత్ రద్దయ్యే ప్రమాదం

**బిసిల పట్ల బిజెపి మోసపూరిత నాటకం, 2 నాల్కల ధోరణి**

**సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు**



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, అక్టోబరు22:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లుకు అసెంబ్లీలో మద్దతిచ్చి కేంద్రంలో బీజేపీ అడ్డుకుంటుందని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు విమర్శించారు. బీజేపీ బీసీల పట్ల మోసపూరితంగా నాటకం ఆడుతూ రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తున్నదని అన్నారు. సుప్రీంకోర్టు విధించిన 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేస్తే బీసీలకు స్థానిక సంస్థలతో పాటు అన్ని రకాలుగా 42 శాతం రిజర్వేషన్ అమలవుతుందన్నారు. రెండు రోజుల పాటు హైదరాబాద్ లోని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్ లో జరిగిన ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 18న నిర్వహించిన రాష్ట్ర బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలూ, సంఘాలు, సంస్థలు మద్దతిచ్చాయని, బీజేపీ కూడా ఈ బంద్ పాల్గొన్నదని అన్నారు. ఇది బీజేపీ మోసపూరిత వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఆ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే గవర్నరుకు చెప్పి బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదింపజేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర క్యాబినెట్ సలహా మేరకు రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. బీజేపీ ఎక్కడ ఏ అవసరం ఉంటే అలా వ్యవహరిస్తోందని, ప్రజలను మోసం చేస్తున్నదని అన్నారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులకు చిత్తశుద్ధి ఉంటే కేంద్రానికి చెప్పి రాజ్యాంగ సవరణ చేయించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చట్ట సవరణతో ఉచిత విద్యుత్ రద్దయ్యే ప్రమాదముందని అన్నారు. ఈ సవరణతో ముఖ్యంగా తెలంగాణకు తీవ్ర నష్టదాయకం అన్నారు. విద్యుత్ సవరణ బిల్లు అమల్లోకి వస్తే వ్యవసాయానికి ఉచిత విద్యుత్, గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ రద్దవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. డిస్కంలు ప్రైవేటుపరం అవుతాయని విమర్శించారు. ఈ సంస్కరణలన్నీ ప్రజల కోసం కాదని, అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు లాభం చేకూర్చడం కోసమేనని అన్నారు.

**ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేస్తున్న కేంద్రం: విజయరాఘవన్:** ఆర్ఎస్ఎస్ ఎజెండాను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్నదని మరో పొలిట్ బ్యూరో సభ్యులు విజయరాఘవన్ విమర్శించారు. దేశాన్ని, ప్రజలను విభజించడమే ఆర్ఎస్ఎస్ ఎజెండా అని అన్నారు. ఆర్ఎస్ఎస్ శతవసంతాల సందర్భంగా ముస్లిం మైనార్టీలకు వ్యతిరేకంగా ఆ సంస్థ చీఫ్ మోహన్ భగవత్ వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని చెప్పారు. మత విద్వేషాలను రెచ్చగొడుతున్నదని విమర్శించారు. జ్ఞానవాపి, మధుర వంటి విషయాలను వివాదాస్పదం చేస్తుందని అన్నారు. సామాన్యుల ఆర్థిక పరిస్థితి, ట్రంప్ విధిస్తున్న టారిఫ్, నిరుద్యోగం, సామాజిక భద్రత వంటి అంశాలపై కేంద్రం దృష్టి సారించడం లేదన్నారు. బీహార్‌లో ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు ఓడిస్తారని, అక్కడ బీజేపీ కూటమిని ఓడించడమే తమ లక్ష్యమన్నారు. తాము అందుకే మహాకూటమిలో ఉన్నామని వివరించారు.

**కాంగ్రెస్‌కు మద్దతిచ్చినా ప్రజా సమస్యలపై పోరాడతాం: జాన్ వెస్లీ**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే తమ కర్తవ్యమని రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ చెప్పారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని నిర్ణయించామని అన్నారు. కాంగ్రెస్ కు మద్దతు ఇచ్చినంత మాత్రాన ప్రజా సమస్యలపై పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. రైతుల ఆమోదం ఉంటేనే ఆర్ఆర్ఆర్ కోసం భూసేకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మార్కెట్ రేటుకు అదనంగా మూడు రెట్లు పరిహారం చెల్లించాలని కోరారు. రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాలిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## బాలిస్టిక్ క్షిపణులను పరీక్షించిన ఉత్తర కొరియా




**ప్యాంగ్యాంగ్, అక్టోబరు 22:** షార్ట్ రేంజ్ బాలిస్టిక్ క్షిపణులను పరీక్షించింది ఉత్తర కొరియా. ఈ రోజు పలు మిస్సైళ్లను ప్రయోగించినట్లు దక్షిణ కొరియా మిలిటరీ పేర్కొంది. అయితే మే నెల తర్వాత మళ్లీ ఉత్తర కొరియా బాలిస్టిక్ క్షిపణులను రిలీజ్ చేసినట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఆ క్షిపణుల పరీక్షపై బ్యాన్ ఉన్న విషయం తెలిసిందే. మరోవైపు వచ్చే వారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్, దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జె మియింగ్ భేటీ కానున్నారు. ఈ నేపథ్యంలో ఉత్తర కొరియా క్షిపణి పరీక్ష నిర్వహించడం ఆందోళనకరంగా మారింది. ఆసియా పసిఫిక్ ఎకనామిక్ కో ఆపరేషన్ మీటింగ్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తోనూ ట్రంప్ భేటీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఉత్తరకొరియా పలు స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను పరీక్షించినట్లు దక్షిణ కొరియా గుర్తించింది. ఆ క్షిపణులను ట్రాక్ చేసినట్లు దక్షిణ కొరియా మిలిటరీ పేర్కొంది. ఆ ప్రొజెక్టైల్స్ సుమారు 350 కిలోమీటర్ల దూరం ప్రయాణించిట్లు ఉత్తర కొరియా వెల్లడించింది. భూమిపైనే ఆ క్షిపణులు పడినట్లు గుర్తించింది.

## అసెంబ్లీ,శాసనమండలి సమావేశాలను ప్రొరోగ్ చేసిన గవర్నర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, అక్టోబరు22:** తెలంగాణ అసెంబ్లీ,శాసనమండలి సమావేశాలను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రొరోగ్ చేశారు. ఆగస్టు 30 ప్రారంభమైన అసెంబ్లీ 6వ సమావేశాలు, శాసనమండలి 24వ మావేశాన్ని గవర్నర్ ప్రొరోగ్ చేసినట్లు బుధవారం అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు నోటిఫికేషన్ విడుదల చేశారు. దీంతో గురువారం కేబినెట్ సమావేశంలో ఆర్డినెన్స్‌పై చర్చించి ఆమోదించే అవకాశం ఉంది.

## చిన్నప్లాట్లలో జీ +1 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, అక్టోబరు22:** చిన్న ప్లాట్లలో ఇందిరమ్మ ఇళ్లను జీ+1 పద్ధతిలోనూ నిర్మాణం చేసుకునేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో స్థలం ఉన్న వారికి ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేస్తున్న విషయం తెలిసిందే.అయితే, ఇల్లు కనీసం 400 చదరపు అడుగులు.గరిష్ఠంగా 600చదరపు అడుగులు ఉండాలని షరతు విధించిందిన విషయం విదితమే.అయితే,గ్రౌండ్‌ఫ్లోర్‌లో 400చ.అ నిర్మాణంచేపట్టలేని ప్లాట్లలో జీ ప్లస్ వన్‌పద్ధతిలోకట్టుకునేందుకు సర్కారుసడలింపు ఇచ్చింది. ఇళ్ల పథకం లబ్ధిదారులకు ఏమైనా సమస్యలు ఉంటే ఆదివారం మినహా మిగతా రోజుల్లో 18005995991 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను చెప్పాలని సూచించింది.

## కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు పరిస్థితి విషమం?

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, అక్టోబరు22:** మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఆరోగ్య పరిస్థితి విషమించినట్లు తెలుస్తోంది. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నారు.అయితే తాజాగా ఆయన పరిస్థితి విషమిం చడంతో బుధవారం సాయంత్రం హుటాహుటిన కోయంబత్తూర్ తరలించినట్లు తెలుస్తోంది.

## కొమురం భీమ్ జయంతి సందర్భంగా సిఎం రేవంత్ నివాళి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, అక్టోబరు22:** ఆదివాసీ గిరిజనుల ఆరాధ్యదైవం, అస్తిత్వ,ఆత్మగౌరవ పోరాటాలకు స్ఫూర్తి ప్రదాత కొమురం భీమ్ అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కొమురం భీమ్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఘనంగా నివాళులర్పించారు.

### కెసిఆర్ ఘన నివాళి

ఆదివాసీ గిరిజన సమాజ హక్కుల కోసం గోండు వీరుడు కొమురం భీమ్ జరిపిన ఆత్మగౌరవ పోరాటం, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాలకు స్ఫూర్తిని నింపిందని మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు.

# దేశానికి పొలిటికల్ ఇస్లాం పెనుప్రమాదం

**యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్**



**గోరఖ్‌పూర్, అక్టోబరు 22:** భారతదేశానికి పొలిటికల్ ఇస్లాం పెను ప్రమాదమని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హెచ్చరించారు. ఈ ముప్పుతో మన పూర్వీకులు పోరాడారని, అయితే దాని గురించి అంతగా చర్చ జరగలేదని ఆయన అన్నారు. చరిత్రలో బ్రిటిష్, ఫ్రెంచ్ వలసదారుల ప్రస్తావన ఉన్నప్పటికీ, పొలిటికల్ ఇస్లాంపై ప్రస్తావన చాలా తక్కువగా వచ్చిందని అన్నారు. గోరఖ్‌పూర్‌లో జరుగుతున్న ఆరెస్సెస్ శతజయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ఛత్రపతి శివాజీ, గురుగోవింద్ సింగ్, మహారాణా ప్రతాప్, మహారాణా సంగా వంటి వీరులు పొలిటికల్ ఇస్లాంపై పోరాటం చేశారని గుర్తు చేశారు. ఈ చరిత్రను ఎవరూ పెద్దగా పట్టించుకోలేదని అన్నారు. పొలిటికల్ ఇస్లాం ద్వారా దేశాన్ని విడగొట్టేందుకు చాంగూర్ బాబా వంటి శక్తులను ఉపయోగించుకుంటారని, అలాంటి శక్తుల నుంచి రక్షించేందుకు సమాజాన్ని ఏకం చేసే కృషిని ఆరెస్సెస్ కొనసాగిస్తోందని అన్నారు. మతమార్పిడులకు సిద్ధపడేవారికి కులం ఆధారంగా చాంగూర్ బాబా డబ్బులు ఆఫర్ చేసేవారిని ఆదిత్యనాథ్ తెలిపారు. ఈ డబ్బులు ఎక్కడి నుంచి వస్తున్నాయో ఎవరికీ తెలియదని అన్నారు. ఎక్కడో విదేశాల నుంచి రావడం లేదని, మీ నుంచే వస్తున్నాయని ప్రజలను ఉద్దేశించి అన్నారు. మీరు ఏదైనా వస్తువులు కొన్నప్పుడు దానిపై హలాల్ సర్టిఫికెట్ ఉందో లేదో చూసుకోవాలని అన్నారు. ఉత్తర ప్రదేశ్‌లో హలాల్ సర్టిఫికెట్‌ను జారీ చేశామని అన్నారు. ఆశ్చర్యకరమేమంటే హలాల్ సర్టిఫికెట్ ఉన్న వస్తువుల్లో సబ్బులు, దుస్తులు, అగ్గిపెట్టెలు ఉన్నాయని అన్నారు.కేంద్రం నుంచి లేదా రాష్ట్రం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే హలాల్ సర్టిఫికేషన్ పేరుతో రూ. 25,000 కోట్లు పోగు చేశారని ఆరోపించారు. ఈ డబ్బును ఉగ్రవాదం, లవ్ జిహాద్, మతమార్పిడులకు ఖర్చు చేస్తుంటారని యోగి ఆరోపించారు. ఏదైనా వస్తువు కొనేటప్పుడు ఎవరు తయారు చేశారో చూసుకోవాలని అన్నారు.

## బెంగాల్‌లో 1000 మంది బూత్‌లెవల్ అధికారులకు ఇసిఐ నోటీసులు

**దేశవ్యాప్తంగా ప్రత్యేక సమగ్ర రివిజన్‌కు ఇసి కసరత్తులు**




**న్యూఢిల్లీ, అక్టోబరు 22:** పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలపై దాదాపు వెయ్యి మంది బూత్‌స్థాయి అధికారులకు (బీఎల్‌ఓ) ఎన్నికల సంఘం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఎన్నికల సంఘం జారీచేసిన ఆదేశాలను పాటించడంలో విఫలమైనందుకు వారిపై ఈ చర్యలు తీసుకున్నట్లు ఓ సీనియర్ అధికారి బుధవారం వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా బీఎల్‌ఓలుగా నియమితులైన అధికారులు తమ పేర్లను ఈఆర్‌ఓనెట్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే, సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్‌ఓ) పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ సుమారు 1,000 మంది అధికారులు ఈ ప్రక్రియను పూర్తి చేయలేదు. వారి వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఉన్నతాధికారులు ఈ నోటీసులు జారీ చేశారు. ఈ ఉల్లంఘనను ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950లోని సెక్షన్ 32 కింద తీవ్రమైన నేరంగా పరిగణిస్తున్నట్లు నోటీసుల్లో స్పష్టం చేశారు. ఎన్నికల విధులకు నియమితులైన ప్రతి అధికారి భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) జారీ చేసే ఆదేశాలను కచ్చితంగా పాటించాలి. దానిని ఉల్లంఘించడం అంటే ఉద్దేశపూర్వకంగా విధులను నిరక్ష్యం చేయడమేనని సీనియర్ అధికారి వివరించారు. అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోతే వారిపై చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల సమగ్ర రివిజన్‌కు కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తును చేస్తోంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక సమగ్ర రివిజన్ చేయాలని నిర్ణయించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్‌సింగ్ సంధు, వివేక్‌జోషిలు సం యుక్తంగా రాష్ట్రాల సిఇఒలతో రివిజన్‌సమావేశం నిర్వహించి సన్నద్ధత నివేదికలు కోరింది. డిఇఒలు, ఈఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలు, బిఎల్వోలు, బిఎల్ఎలు నియామకాలు వెంటనేచేపట్టాలని సూచించింది. ఏకకాలంలో సర్ నిర్వహిస్తారా లేక రెండు విడతలుగా నిర్వహిస్తారా అన్నది నిర్ధారణ కాలేదు. ప్రాంతీయంగా ఉన్న వాతావరణ పరిస్థితులు, ఉత్తరాదిలో ఉన్నమంచుకురిసే వాతావరణం, శీతాకాలంలో చలివాతావరణం వంటి వాటిని తట్టుకుని నిలిచేవిధంగా ఈ సర్ కార్యాచరణ ఉండాలని ఎన్నికల కమిషనర్లు సూచించినట్లు సమాచారం.

# మద్యం షాపుల దరఖాస్తులకు నేడు ఆఖరు తేదీ

**బుధవారం వరకు 90వేలకు చేరువలో దరఖాస్తులు**

**27న లాటరీ పద్ధతిలో మద్యం షాపుల కేటాయింపు**


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, అక్టోబరు22:** తెలంగాణ రాష్ట్రంలో మద్యం షాపుల దరఖాస్తులు లక్షకు చేరువలో ఉన్నాయి. ఇప్పటి వరకు 89,805 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ శాఖ తెలిపింది. రంగారెడ్డిలో అత్యధికంగా 27వేలు, ఆదిలాబాద్‌లో అత్యల్పంగా 3,894 దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించింది. గురువారం వరకు అవకాశం ఉండటంతో దరఖాస్తులు లక్ష వరకు చేరుకోవచ్చని అంచనా వేస్తోంది. 2,620 మద్యం షాపులకు గానూ వచ్చిన దరఖాస్తులతో దాదాపు 2,700 కోట్ల ఆదాయం సమకూరినట్లు సమాచారం. కాగా, గురువారం కూడా దరఖాస్తుల స్వీకరణకు గడువు ఉండటంతో ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈనెల 27న లాటరీ పద్దతిలో నిర్వహకుల ఎంపిక జరగనున్నట్లు ఎక్సైజ్ శాఖ పేర్కొంది. జిల్లాల పరిధిలో కలెక్టర్ సమక్షంలో నిర్వహకుల ఎంపిక చేపడుతారు. లక్కీ డిప్‌లో దక్కే లైసెన్సు 2027 వరకు పనిచేస్తుంది. ముందు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం దరఖాస్తు గడువు అక్టోబర్ 18తో ముగియాల్సి ఉంది.

అయితే చివరి రోజున బీసీబంద్ కారణంగా చాలామంది వ్యాపారులు దరఖాస్తులు చేయలేకపోయారని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం.. దరఖాస్తు గడువును ఈ నెల 23 వరకూ పొడిగించింది.

# సైన్స్,ఆవిష్కరణలకు కేంద్రం హైదరాబాద్

**పరిశోధనా సంస్థలు, పెట్టుబడిదారులకు స్వాగతం**

**బయోఇన్‌స్పైర్డ్ ఫ్రాంటీయర్స్ సదస్సులో డిప్యూటీ సిఎం భట్టి**




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, అక్టోబరు22:** పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ కాలం నుంచి హైదరాబాద్ సైన్స్,ఆవిష్కరణలకు కేంద్రంగా విరాజిల్లుతోందని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు, బుధవారం జెఆర్‌సి కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన బయోఇన్‌స్పైర్ ఫ్రాంటియర్స్-2025 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ స్పేస్ ఎకానమీ, బయోమిమిక్రి అండ్ ఎక్స్‌ట్రా టెరెస్ట్రియల్ రిసోర్స్ సదస్సులో ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం ప్రసంగించారు. ప్రపంచ స్థాయి వ్యవస్థల రూపకల్పనకు కేంద్రంగా తెలంగాణ నిలిచింది అన్నారు. హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి పరిశోధన సంస్థలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పక్షాన ఆహ్వానం పలుకుతున్నామని తెలిపారు. ప్రపంచ స్థాయి మౌలిక వసతుల కల్పనకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది అన్నారు. హైదరాబాదు నగరానికి ప్రపంచ నలుమూలల నుంచి విచ్చేసిన శాస్త్రవేత్తలు, పరిశ్రమ నాయకులు, ఆవిష్కర్తలకు ఆయన స్వాగతం తెలిపారు. శాస్త్ర సున్నితత్వం, కల్పనాత్మకత కవిత్వం కలిసిన ఈ నగరం ఎప్పుడూ సృజనాత్మకతకు నిలయంగా నిలిచింది అన్నారు. బయోఇన్స్పైర్డ్ ఫ్రాంటియర్స్ 2025 జీవశాస్త్రం, సాంకేతికత, అంతరిక్ష అన్వేషణల మధ్య జరుగుతున్న ఈ ప్రపంచ స్థాయి సంభాషణ భారత శాస్త్రీయ గమ్యాన్ని అర్థ శతాబ్దానికి పైగా నిశ్శబ్దంగా మలిచిన ఈ నగరంలో జరుగుతుండటం గర్వకారణం అన్నారు. ఈ దశాబ్దాల ప్రజా పెట్టుబడి, శాస్త్రీయ స్ఫూర్తి కలయికతో రూపుదిద్దుకున్న ఈ పరిసర వ్యవస్థే హైదరాబాద్‌కు ప్రత్యేకమైన సైన్స్ డీఎన్ఏని ఇచ్చింది, అది క్రమశిక్షణతో కూడినది, సృజనాత్మకమైనది, నిశ్శబ్దంగా కానీ స్పష్టమైన ఆశయాలతో కూడింది అన్నారు. ఈ వారసత్వాన్ని నేటి యువ ఆవిష్కర్తలు కొత్త ఉత్సాహంతో ముందుకు తీసుకెళ్తున్నారని డిప్యూటీ సీఎం ఆనందం వ్యక్తం చేశారు. స్కైరూట్ ఏరోస్పేస్, ఇక్కడే హైదరాబాద్‌లో జన్మించి, భారతదేశంలోనే ప్రైవేట్ రంగం ద్వారా రాకెట్ ప్రయోగాలు సాధ్యమని నిరూపించింది. వారి విజయం కేవలం ఉత్పత్తి కాదు, ఒక కొత్త ఎకోసిస్టమ్‌ను సృష్టించింది. ప్రొపల్షన్ ఇంజనీర్లు, కాంపోజిట్ నిపుణులు, స్పేస్ సరఫరాదారులు అనే కొత్త తరాన్ని పెంచింది అని వివరించారు. ధ్రువ స్పేస్, మరో హైదరాబాద్ ఆధారిత సంస్థ, ఉపగ్రహ రూపకల్పన నుండి తయారీ, ప్రయోగం, గ్రౌండ్ స్టేషన్‌ల వరకు సంపూర్ణ పరిష్కారాలను చూపుతుంది, మనం ప్రపంచ స్థాయి వ్యవస్థలను మన రాష్ట్రంలోనే రూపకల్పన చేయగలమని చూపిస్తోంది అని తెలిపారు. సాంకేతిక ఎకోసిస్టమ్‌లలో ఒకటిగా నిలిచింది ఐటి, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, రక్షణ, ఇప్పుడు అంతరిక్ష సాంకేతికతలో ప్రపంచ నాయకులకు ఆతిథ్యం ఇస్తోంది అన్నారు. సమావేశంలో ట్రాన్స్ సిఎండి కృష్ణ భాస్కర్, జిఈఓపిఏఓ సీఈవో ఎం.అబ్బాస్, లీడ్ స్పాన్సర్ సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

## సరిహద్దు ఘర్షణలో భారత్ హస్తం ఆరోపణలు ఖండించిన అఫ్ఘాన్



**కాబూల్, అక్టోబరు 22:** పాకిస్థాన్‌కు ఆఫ్ఘనిస్తాన్‌కు మధ్య జరుగుతున్న సరిహద్దు ఘర్షణల వెనుక భారత్ హస్తం ఉందంటూ పాకిస్థాన్ చేస్తున్న ఆరోపణలను ఆఫ్ఘనిస్థాన్ తీవ్రంగా ఖండించింది. ఆ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, అర్థరహితమని కొట్టిపారేసింది. ఈ క్లిష్ట సమయంలో భారత్‌తో తమ సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటామని స్పష్టం చేస్తూ పాకిస్థాన్‌కు గట్టి షాక్ ఇచ్చింది. అల్ జజీరా వార్తా సంస్థకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆఫ్ఘనిస్థాన్ రక్షణ మంత్రి మహ్మద్ యాకూబ్ మాటాడుతూ భారత్‌పై చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవి, అహేతుకమైనవి, ఏమాత్రం ఆమోదయోగ్యం కానివి. మా భూభాగాన్ని ఇతర దేశాలకు వ్యతిరేకంగా ఉపయోగించాలనే విధానం మాకు లేదు. ఒక స్వతంత్ర దేశంగా భారత్‌తో మాకు సంబంధాలు ఉన్నాయి. మా జాతీయ ప్రయోజనాల మేరకు ఆ బంధాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటామని తాలిబన్ వ్యవస్థాపకుడు ముల్లా ఒమర్ కుమారుడైన యాకూబ్ స్పష్టం చేశారు. ఇటీవల అక్టోబర్ 11న ఆఫ్ఘనిస్థాన్ పాకిస్థాన్ సరిహద్దుల్లో ఘర్షణలు తీవ్రమయ్యాయి. తెహ్రీక్‌ఇతాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) వంటి ఉగ్రవాద సంస్థలకు ఆఫ్ఘన్ ఆశ్రయం ఇస్తోందని పాకిస్థాన్ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలోనే, ఆఫ్ఘనిస్థాన్‌తో తమ సంబంధాలు దెబ్బతినడానికి భారతే కారణమని, తాలిబన్ ప్రభుత్వం భారత్ ఒడిలో కూర్చొని తమపై ప్రాక్సీ యుద్ధం చేస్తోందని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తీవ్ర ఆరోపణలు చేశారు. పాకిస్థాన్ చేసిన ఈ ఆరోపణలను భారత్ కూడా దీటుగా తిప్పికొట్టింది. ఉగ్రవాద సంస్థలకు ఆశ్రయం కల్పిస్తూ, తమ అంతర్గత వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి పొరుగు దేశాలపై నిందలు వేయడం పాకిస్థాన్‌కు అలవాటేనని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ బదులిచ్చారు. ప్రస్తుతం తాలిబన్ ప్రభుత్వాన్ని భారత్ అధికారికంగా గుర్తించనప్పటికీ, ఇరు దేశాల మధ్య ఉన్నత స్థాయి అధికారుల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ తరుణంలో ఆఫ్ఘన్ రక్షణ మంత్రి చేసిన తాజా వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# ఎవర్ గ్రీన్.. రెబల్ స్టార్ ప్రభాస్..



**ఒబల్ ఫ్యాన్స్‌కు** దీపావళితో పాటు వచ్చే పండగ రెబల్ స్టార్ ప్రభాస్ బర్త్ డే. ఈ నెల 23న ఆయన పుట్టినరోజును ఘనంగా సెలబ్రేట్ చేస్తుంటారు ఫ్యాన్స్, మూవీ లవర్స్. ప్రభాస్ బర్త్‌డే ఇప్పుడు పాన్ ఇండియా స్థాయిలో నేషనల్ అకేషన్‌గా మారింది. దేశం నలుమూలలా ప్రభాస్‌కు అభిమానులు ఉన్నారు, ఆయన సినిమాలను ఇష్టంగా చూసేవాళ్లున్నారు. ఓవర్సీస్‌లో యూఎస్, యూకే, జపాన్..ఇలా ప్రతి దేశంలోనూ ప్రభాస్ సినిమాల కోసం ఎదురుచూస్తుంటారు. తన సినిమాలకు ఆయా దేశాల్లో వచ్చే బాక్సాఫీస్ కలెక్షన్స్ ప్రభాస్ యూనివర్సల్ క్రేజ్‌కు నిదర్శనంగా నిలుస్తుంటాయి. అందుకే ప్రభాస్ చేసే ప్రతి సినిమా ట్రూ పాన్ వరల్డ్ మూవీ అవుతోంది. తన స్టార్ డమ్, ఛరిష్మా, పర్ ఫార్మెన్స్, స్క్రీన్ ప్రెజెన్స్, రికార్డ్ స్థాయి బాక్సాఫీస్ వసూళ్లతో ప్రభాస్ తెలుగు సినిమా ఖ్యాతిని ఖండాంతరాలకు చేర్చారు. ఇండస్ట్రీలో పేరు తెచ్చుకునే హీరోలను చూస్తుంటాం...టాలీవుడ్‌కే పేరు తెస్తున్న అరుదైన స్టార్ రెబల్ స్టార్ ప్రభాస్. ఆయన బర్త్ డేకు తన బ్లాక్ బస్టర్ మూవీస్ రీ రిలీజ్‌తో పాటు కొత్త సినిమాల అప్డేట్స్ సందడి చేస్తుంటాయి. ఈ నెల 31న ప్రభాస్ కెరీర్‌లో మైల్ స్టోన్‌గా నిలిచే మూవీ 'బాహుబలి ది ఎపిక్' రీ రిలీజ్ అవుతోంది. బాహుబలి రెండు చిత్రాలు కలిసి ఒకే పార్ట్‌గా విడుదలకు వస్తుండటం మూవీ లవర్స్, ఫ్యాన్స్‌లో ఆసక్తి కలిగిస్తోంది. తెలుగువారు గర్వపడేలా ప్రభాస్ భారీ పాన్ వరల్డ్ మూవీ లైనప్ కంటిన్యూ చేస్తున్నారు. డైరెక్టర్ మారుతితో ప్రభాస్ చేస్తున్న 'ది రాజా సాబ్' సినిమా వచ్చే సంక్రాంతికి జనవరి 9న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. రాజా సాబ్ మూవీలో ప్రభాస్ ను మనం ఇంతకాలం మిస్ అయిన వింటేజ్ లుక్‌లో రొమాంటిక్ హారర్ కామెడీలో చూడబోతున్నాం. డైరెక్టర్ హను రాఘవపూడి, మైత్రీ మూవీ మేకర్స్ కాంబినేషన్‌లో ప్రభాస్ నటిస్తున్న సినిమాపై భారీ అంచనాలు ఏర్పడుతున్నాయి. సందీప్ వంగా డైరెక్షన్‌లో ప్రభాస్ నటించనున్న 'స్పిరిట్' సినిమాపై ఇప్పటికే స్కై రేంజ్ ఎక్స్ పెక్టేషన్స్ ఉన్నాయి. ప్రభాస్ క్రేజీ లైనప్‌లో రానున్న సలార్ 2, కల్కి 2 ఎగ్జైట్ చేస్తున్నాయి. ఈ ఏడాది మంచు విష్ణు కన్నప్ప సినిమాలో ప్రభాస్ చేసిన రుద్ర క్యారెక్టర్ ఆ చిత్రానికే ప్రధాన ఆకర్షణగా నిలిచింది. రుద్ర పాత్రలో ప్రభాస్ చేసిన డివైన్ పర్ ఫార్మెన్స్ అందరినీ ఆకట్టుకుంది. మచ్చలేని జీవితం, శత్రువు ఎరుగని వ్యక్తిత్వం, చేతికి ఎముకలేని దాతృత్వం, మర్చిపోలేని ఆతిథ్యం... ఇవన్నీ ప్రభాస్‌ను అందరూ ఇష్టపడే డార్లింగ్‌లా మార్చేశాయి. స్టార్‌గా ప్రభాస్ స్థాయిని బాక్సాఫీస్ రికార్డులు చెబితే, అందరూ ప్రేమగా పిలిచే డార్లింగ్ అనే మాట వ్యక్తిగా ఆయన గొప్పదనం చూపిస్తుంది. తెలుగు తెరపై వరుస విజయాలతో ప్రభాస్ మరెన్నో ఇలాంటి పుట్టినరోజులు జరుపుకోవాలని కోరుకుందాం. హ్యాపీ బర్త్ డే టు రెబల్ స్టార్ ప్రభాస్.

# 'మిరాయ్'కి బ్లాక్ బస్టర్ ఇచ్చినందుకు ఆడియెన్స్‌కు రుణపడి ఉంటా : హీరో తేజ సజ్జా



**సూపర్ హీరో తేజ సజ్జా** బ్రహ్మాండ్ బ్లాక్ బస్టర్ 'మిరాయ్'. ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. రాకింగ్ స్టార్ మనోజ్ మంచు పవర్ ఫుల్ పాత్ర పోషించారు. రితికా నాయక్ హీరోయిన్‌గా నటించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ భారీ స్థాయిలో నిర్మించారు. సెప్టెంబర్ 12న వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజైన ఈ చిత్రం బ్రహ్మాండ్ బ్లాక్ బస్టర్ సక్సెస్ ని అందుకుని అద్భుతమైన కలెక్షన్స్ తో రికార్డ్ క్రియేట్ చేసింది. ఈ సందర్భంగా మేకర్స్ బ్రహ్మాండ్ బ్లాక్ బస్టర్ సక్సెస్ సెలబ్రేషన్ మీట్ నిర్వహించారు. ఈ వేడుకలో యూనిట్ అందరికీ మెమెంటోలు అందించి అభినందించారు. బ్రహ్మాండ్ బ్లాక్ బస్టర్ సక్సెస్ సెలబ్రేషన్‌లో హీరో తేజ సజ్జ మాట్లాడుతూ..అందరికి నమస్కారం. మాతో ఈ సక్సెస్ ని సెలబ్రేట్ చేసుకోవడానికి వచ్చిన మీడియా వారికి, ఆడియన్స్ కి, మమ్మల్ని ప్రోత్సహించడానికి ఇక్కడికి వచ్చిన రవి గారికి, రాధా మోహన్ గారికి, మారుతి గారికి, సంపత్ నంది గారికి, శ్రీరామ్ ఆదిత్య కి.. అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఈ సినిమాకి మేము చాలా ఈవెంట్లు చేశాము. ఈవెంట్ మాత్రం మా వెనకాల ఉండి మమ్మల్ని నడిపించిన టెక్నీషియన్స్ అందరికోసం. వాళ్లకి గుర్తుగా ఉండాలని ఈవెంట్ ని నిర్వహించాం. సినిమా రిలీజ్ అయి దాదాపుగా 45 డేస్ అవుతుంది. ఒటీటీకి వచ్చిన వరకూ కూడా థియేటర్లో రన్ నడుస్తుంది. ఓటీటీకి వచ్చాక కూడా ఈవెంట్‌ని పెట్టడం విశ్వ గారి గొప్ప మనసు. ఒక మంచి సినిమా వస్తే సపోర్ట్ చేసి ఎంతో గొప్ప స్థాయికి తీసుకువెళ్తారు. నా కెరీర్లో నాకు ఇది ఎన్నో సార్లు చూపించారు. మీరు ప్రోత్సహించిన విధానం ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటాను. మీ అందరికీ ఎప్పుడు కూడా కృతజ్ఞతతో ఉంటాను. ఆడియన్స్ వల్లే ఇక్కడ ఉన్నాను. మీ అందరికీ పాదాభివందనాలు థాంక్యూ' అన్నారు. నిర్మాత టిజి విశ్వప్రసాద్ మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. ఈ సినిమాకి ఇంత అద్భుతమైన విజయాన్ని అందించిన ప్రేక్షకులకు మీడియాకు ధన్యవాదాలు. దీనిని ఫ్యాన్ వరల్డ్ ఫ్రాంచైజ్ చేస్తున్నాం. మిరాయి విజయంతో ఇది మొదలైంది. జియో స్టార్ లార్జెస్ట్ యూజర్ బేస్ ఉన్న ఒటిటి. తెలుగు సినిమాల్లో ఇది అత్యధికంగా ప్రేక్షకులు వీక్షించిన సినిమా అవుతుందని వారి నుంచి మాకు ఫీడ్బ్యాక్ వచ్చింది. ఇండియాలోనే ఎక్కువ మంది చూసిన సినిమాగా నిలుస్తుందని ఆశిస్తున్నాం. మరిన్ని అద్భుతమైన సినిమాలు చేయాలని కోరుకుంటున్నాం. అందరికీ థాంక్యు అన్నారు. డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని మాట్లాడుతూ..'సినిమాని నేను ఎప్పుడు కూడా మ్యాజిక్ అనుకునేవాడిని. తీయడం మొదలుపెట్టాక మ్యాజిక్ అనేది నెమ్మదిగా అర్థమైంది. అందరి కొలాబరేషన్‌తో సినిమా తయారవుతుంది. మా టీమ్ అందరికీ థాంక్యూ సో మచ్' అన్నారు. హీరోయిన్ రితిక నాయక్ మాట్లాడుతూ.. 'నాకు విభా క్యారెక్టర్ ఇచ్చిన డైరెక్టర్ కార్తీక్ గారికి థాంక్యూ సో మచ్. ఈ సినిమాకి బ్యాక్ బోన్‌గా నిలిచిన విశ్వప్రసాద్ గారికి కృతి ప్రసాద్ గారికి థాంక్యూ సో మచ్. తేజ గారు ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. ఆయన పాషన్‌తోనే ఇది సాధ్యపడింది. ఈ సినిమాకి పనిచేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు' అన్నారు..

నిర్మాత వై రవిశంకర్ మాట్లాడుతూ... 'తేజ, కార్తీక్ మిగతా టెక్నీషియన్ అందరు కూడా మాకు చాలా ఆప్తులు. ఈ సినిమా అద్భుతమైన సక్సెస్ అయినందుకు చాలా హ్యాపీగా ఫీల్ అయ్యాం. సిజిని ఈ బడ్జెట్‌లో ఇంత అద్భుతంగా తీయొచ్చు అని విశ్వగారు మా అందరికీ ఒక పెద్దన్నలా చూపించారు. ఈ సినిమాకి అన్ని వైపుల నుంచి అద్భుతమైన విజయం దక్కింది. విశ్వ గారు నుంచి రాజా సాబ్, ఆ తర్వాత వస్తున్న సినిమాలో కూడా పెద్ద విజయాలు సాధించాలని కోరుకుంటున్నాను అన్నారు.

డైరెక్టర్ మారుతి మాట్లాడుతూ.. 'పీపుల్ మీడియా ఫ్యాక్టరీలో మిరాయ్ అలంటి అద్భుతమైన సినిమా రావడం చాలా ఆనందంగా అనిపించింది. ఇండియాలోనే క్వాలిటీతో సినిమా చేయగలమని విశ్వగారు చేసిన ప్రయత్నానికి నిదర్శనమే ఈ సినిమా. మన దగ్గర కూడా ఎంత అద్భుతమైన టీం ఉందని నిరూపించిన సినిమా ఇది. ఇది టెక్నీషియన్స్‌కి జరుగుతున్న ఒక సత్కారం అని చెప్పాలి. ఇలాంటి సినిమాలు మరెన్నో రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. మా రాజాసాబ్ కూడా మీ అందరి అంచనాలకు తగినట్టుగా ఉంటుంది. అందరికీ థాంక్యు'అన్నారు.



## 'కాంత' నవంబర్ 14న రిలీజ్

**దుల్కర్ సల్మాన్** పీరియాడికల్ మూవీ 'కాంత' టీజర్‌తో సంచలనం సృష్టించింది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ తమిళతెలుగు ద్విభాషా చిత్రంలో దుల్కర్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటించింది. సముద్రఖని కీలక పాత్ర పోషిస్తున్నారు. స్పిరిట్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, వేఫేరర్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. కాంత ఫస్ట్ సింగిల్ హే పసి మనసేకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. మేకర్స్ తాజాగా రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు. కాంత నవంబర్ 14న వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే, సముద్రఖని వింటేజ్ అండ్ ఇంటెన్స్ లుక్స్‌లో కనిపించిన రిలీజ్ డేట్ పోస్టర్ చాలా క్యురియాసిటీ పెంచింది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ డానీ సాంచెజ్ లోపెజ్, ఆర్ట్ డైరెక్షన్‌ను థా. రామలింగం.

# 'బైసన్' తెలుగు ప్రేక్షకులందరికీ నచ్చుతుంది

## అక్టోబర్ 24న అందరూ చూడండి.. ప్రెస్ మీట్‌లో హీరో ధృవ్ విక్రమ్



**ధృవ్ విక్రమ్,** అనుపమ పరమేశ్వరణ్ జంటగా అప్లాజ్ ఎంటర్టైన్మెంట్స్, నీలం స్టూడియోస్ బ్యానర్ మీద పా. రంజిత్ సమర్పణలో సమీర్ నాయర్, దీపక్ సెగల్, పా. రంజిత్, అదితి ఆనంద్ నిర్మాతలుగా మారి సెల్వరాజ్ తెరకెక్కించిన చిత్రం 'బైసన్'. ఈ సినిమాకి నివాస్ కె. ప్రసన్న సంగీతాన్ని అందించారు. ఇక ఈ మూవీని తెలుగులో జగదంబే ఫిల్మ్స్ బ్యానర్ మీద తెలుగులో అక్టోబర్ 24న రిలీజ్ చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం (అక్టోబర్ 21) నాడు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో.. హీరో ధృవ్ విక్రమ్ మాట్లాడుతూ . 'బైసన్'ను తెలుగులో ప్రమోట్ చేసేందుకు మొదటి సారిగా హైదరాబాద్ వచ్చాను. అలా నాకు ఈ చిత్రం ఎంతో ప్రత్యేకంగా మారింది. నేను కొన్ని రోజుల క్రితం ఇక్కడికి షాపింగ్ చేసేందుకు వచ్చాను. అక్కడ ఆ షాప్ ఓనర్ నన్ను చూసి 'మీరు విక్రమ్‌లా ఉన్నారు' అని అన్నారు. అవును.. నేను ఆయన కొడుకుని అని చెప్పాను. మా నాన్న గారి కష్టం, సినిమా కోసం చేసే ప్రయోగాల గురించి చాలా చెప్పారు. ఆయన ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా వచ్చి ఈ స్థాయికి ఎదిగారు. కానీ నేను ఆయన కొడుకుగా నాకు అన్నీ సులభంగానే అందాయి. కానీ ఆయనలా అందరి ప్రేమను సంపాదించేందుకు చాలా కష్టపడతాను. నాకు తెలుగులో నటించాలని ఉంది. 'బైసన్' కోసం మూడేళ్లు కష్టపడ్డాను. ఈ మూవీని చూడండి. నచ్చితే సపోర్ట్ చేయండి. నాన్న గారిలానే నేను కూడా చాలా కష్టపడి వంద శాతం ఎఫర్ట్ పెడతాను. నా కొడుకు కూడా ఇలా వస్తే..'మీ నాన్న ధృవ్ అంటే చాలా ఇష్టం' అని చెప్పే స్థాయికి వెళ్లాలని కోరుకుంటున్నాను. తమిళంలో మా సినిమాకు మంచి ఆదరణ దక్కింది. మారి సెల్వరాజ్ గారు తన జీవితంలో ఎదురైన అనుభవాలు, చూసిన సంఘటనల నుంచే కథల్ని రాసుకుంటారు. పీపుల్స్‌ని ఎడ్యుకేట్ చేయాలని ఆయన పరితపిస్తుంటారు. అర్జున అవార్డు గ్రహీత మణతి గణేషన్ కథ ఆధారంగా ఈ మూవీని మారి సెల్వరాజ్ గారు తెరకెక్కించారు. ఈ మూవీ కోసం నేను కబడ్డీ నేర్చుకున్నాను. నంబర్స్ గురించి కాకుండా తెలుగులో మా సినిమాను అందరూ చూడాలని కోరుకుంటున్నాను. తెలుగు ప్రేక్షకులందరికీ మా చిత్రం నచ్చుతుంది. అక్టోబర్ 24న అందరూ చూడండి' అని అన్నారు. అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ .. 'మారి సెల్వరాజ్ గారి మొదటి చిత్రంలో నేను నటించాల్సింది. కానీ అప్పుడు బిజీగా ఉండటం వల్ల కుదరలేదు. ఆయన దర్శకత్వంలో నటించాలనే కోరిక ఉండేది. ఇప్పుడు ఆయన తీసిన 'బైసన్' చిత్రంలో నటించడం ఆనందంగా ఉంది. తమిళంలో ఆల్రెడీ ఈ చిత్రానికి మంచి ఆదరణ దక్కింది. తెలుగులో రిలీజ్ చేయాలనే డిమాండ్ కూడా ఎక్కువైంది. మేం అక్టోబర్ 24న తెలుగు ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నాం. ధృవ్‌తో నటించడం నాకు గర్వంగా ఉంది. అక్టోబర్ 24న'బైసన్' తెలుగులో రాబోతోంది. అందరూ చూసి సక్సెస్ చేయాలి' అని అన్నారు. నిర్మాత వీపీ సెల్వన్ బాలాజీ మాట్లాడుతూ 'బైసన్' మూవీని తెలుగులో రిలీజ్ చేస్తుండటం ఆనందంగా ఉంది. లింగుస్వామి, నా సోదరుడు చంద్రబోస్‌గారి వల్లే తెలుగులోకి ఈ మూవీని తీసుకు వస్తున్నాను. ఇది గొప్ప విజయం సాధిస్తుంది, చాలా మంచి చిత్రం అని లింగుస్వామి గారు మాకు సలహా ఇచ్చారు. ఈ మూవీని నేను చూశాను. తెలుగు ఆడియెన్స్‌కి తప్పకుండా కనెక్ట్ అవుతుందన్న నమ్మకం నాకు ఏర్పడింది. తమిళంలో ఆల్రెడీ బ్లాక్ బస్టర్ టాక్‌తో దూసుకుపోతోంది. ఇక ఇప్పుడు తెలుగులో అక్టోబర్ 24న మాచిత్రం రాబోతోంది. పెద్ద హిట్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.



## 'ది బ్లాక్ గోల్డ్' ఫస్ట్ లుక్ రిలీజ్

**టాలీవుడ్ లక్కీ చార్మ్** సంయుక్త ఫస్ట్ ఫిమేల్ సెంట్రిక్ ఫిల్మ్ యోగేష్ కెఎంసి దర్శకత్వంలో చేస్తున్నారు. ఇంటెన్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సామజవరగమన, ఊరు పేరు భైరవకోన వంటి విజయవంతమైన చిత్రాలు అందించిన నిర్మాత రాజేష్ దండా నిర్మిస్తున్నారు.సంయుక్త స్వయంగా ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. సింధు మాగంటి సహ నిర్మాత. నిన్న ఈ మూవీ టైటిల్ 'ది బ్లాక్ గోల్డ్' అని అనౌన్స్ చేశారు. దీపావళి సందర్భంగా చిత్రానికి సంబంధించిన ఇంటెన్స్, గ్రిప్పింగ్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. చేతిలో పిస్టల్, టీషర్ట్, చేతులపై రక్తపు మరకలతో రైల్వే ఫ్లాట్ పై సంయుక్త కనిపించడం అదిరిపోయింది.రైల్వే స్టేషన్ అంతా శవాలతో నిండిపోయి, ఇంటెన్స్ ఫైట్ జరిగిందని సూచిస్తుంది. 'వెల్‌కమ్' అని రాసిన బోర్డు కింద సీలింగ్‌కివేలాడుతున్నవ్యక్తి కనిపించడం పోస్టర్‌కిమరింత క్యురియాసిటీ పెంచింది. సంయుక్త ఇప్పటివరకు చూడని యాక్షన్ అవతార్‌లో చూపించబోతోందని ప్రామిస్ చేస్తోంది. దర్శకుడు యోగేశ్ సంయుక్తని నెవర్‌సీన్‌బిఫోర్ అవతార్‌లో చూపించే పవర్‌ఫుల్ స్క్రిప్ట్ రాశారు. ఆమె చేసిన హైఆక్టేన్ స్టంట్స్ ప్రేక్షకులను షాక్‌కి గురి చేయబోతున్నాయి. ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ టెక్నీషియన్స్ పని చేస్తున్నారు. ఎ వసంత్ కెమెరా మ్యాన్ కాగా, సామ్ సిఎస్ సంగీతం అందిస్తున్నారు.

# నిర్మాత నుంచి దర్శకుడిగా మారుతున్నా: సెవెన్ హిల్స్ సతీష్



**సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్** బ్యానర్‌పై బట్టలరామస్వామి బయోపిక్, కాఫీ విత్ ఏ కిల్లర్, సోలోబాయ్ సినిమాలను నిర్మించిన ప్యాషనేట్ ప్రొడ్యూసర్ సెవెన్ హిల్స్ సతీష్ తన పుట్టినరోజు (అక్టోబర్ 23) సందర్భంగా నూతన ప్రయాణం మొదలుపెట్టినట్లు ప్రకటించారు. 3 విజయవంతమైన సినిమాలను నిర్మించి సతీష్.. త్వరలో దర్శకుడిగా మారబోతున్నట్లు తెలిపారు. డైరెక్టర్ కావాలనే లక్ష్యంతో ఇండస్ట్రీకి వచ్చిన తను నిర్మాతగా ప్రారంభమై సినిమా నిర్మాణానికి అన్నీ నేర్చుకుని పూర్తిగా సన్నద్ధం అయిన తర్వాత తన లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. అలాగే తన బ్యానర్‌లో ఇంకో రెండు సినిమాలు తీస్తున్నట్లు చెప్పారు. ఎడిటర్ ప్రవీణ్ పూడి దర్శకత్వంలో ఒక సినిమా తీస్తున్నామని, రాజశేఖర్ గద్దం దర్శకత్వంలో మరో సినిమా స్క్రిప్ట్ దశలో ఉందని చెప్పారు. నార్నె నితిన్ హీరోగా ఉగాది రోజున ప్రారంభమైన సినిమా అనుకోకుండా పట్టాలెక్కక పోవడంతో ఆ కథను సరికొత్తగా మార్చి త్వరలో సినిమా చేస్తున్నామని చెప్పారు. సోలోబాయ్ ఈవెంట్‌లో తన గురువు వీవీ వినాయక్ చెప్పిన విధంగా తాను డైరెక్టర్ అవ్వాలనే ప్రయత్నాన్ని ఈ పుట్టినరోజు సందర్భంగా మొదలు పెట్టినట్లు సెవెన్ హిల్స్ సతీష్ తెలిపారు. తన స్నేహితుల సహాయంతో వాళ్ల నిర్మాణంలో తన మొదటి సినిమా డైరెక్షన్ చేయబోతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సెవెన్ హిల్స్ సతీష్ ప్రెస్‌మీట్‌లో మరిన్ని విషయాలు మాట్లాడుతూ.'నేను మీడియా ముఖంగా ఎప్పుడూ బర్త్ డే చేసుకోలేదు. నా ఫ్రెండ్స్ నాకు సర్‌ప్రైజ్ ఇచ్చారు. తప్పకుండా బర్త్ డే చేసుకోవాలని సూచించారు. మూడు సినిమాల నిర్మాణంలో ఎన్నో విషయాలు నేర్చుకున్నా. అన్ని క్రాఫ్ట్‌లకు సంబంధించి విషయాలు నేర్చుకున్నాను. వయసులో ఉన్నప్పుడే డైరెక్షన్ చేయాలని వీవీ వినాయక్ గారు చెప్పడంతో డైరెక్టర్‌గా మారుతున్నా. డైరెక్టర్‌గా డెబ్యూ మూవీ అనేది చాలా ముఖ్యం. మంచి సినిమా చేస్తేనే మన ట్యాలెంట్ ఏంటనేది బయటపడుతుంది. ప్రస్తుతం మనం మెసేజ్ ఇస్తే చూసే మూడ్‌లో ఆడియన్స్ లేరు. అందుకే నవ్వించి ఎంటర్‌టైన్ చేస్తేనే ఆడియన్స్ థియేటర్లకు వస్తారు బలగం, లిటిల్ హార్ట్స్ వంటి సినిమాలతో అది ప్రూవ్ అయింది. అందుకే తక్కువ బడ్జెట్‌తో మంచి కంటెంట్ ఉన్న సినిమా చేస్తాను. డైరెక్టర్‌గా నేను ఏంటనేది నిరూపించుకుంటే తర్వాత పాన్ ఇండియా సినిమా చేయడానికి సిద్ధం. లిటిల్ హార్ట్స్ లాంటి కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలు చేస్తే దర్శకులకు మంచి గుర్తింపు ఉంటుంది' అని తెలిపారు. ముందుగా నేను ఇండస్ట్రీకి వచ్చినప్పుడు అసిస్టెంట్ డైరెక్టర్‌గా కొన్ని చిత్రాలకు పని చేశాను. ఆ తర్వాత డబ్బు సంపాదించుకుని వద్దామని రియల్ ఎస్టేట్ బిజినెస్‌లో కొంత డబ్బులు సంపాదించి, ఆ తర్వాత నిర్మాతగా ఇండస్ట్రీలో అడుగు పెట్టాను. సాధారణంగా ఇండస్ట్రీలో ఎత్తుపల్లాలు ఉంటాయని నాకు తెలుసు. ఒక మంచి సినిమాను ప్రేక్షకులకు అందించాలని ఆశయంతో నిర్మాతగా వచ్చాను. ప్రస్తుతం ఇండస్ట్రీలో ఉన్న కొంతమంది టాప్ డైరెక్టర్స్ వెంకీ అట్లూరి, సాగర్ చంద్ర, సంపత్ నంది, బలగం వేణు వంటి వారు నాకు మంచి స్నేహితులు. అలాగే నేను సురేష్ ప్రొడక్షన్స్ ఇంకా వేరే ప్రొడక్షన్స్‌లో కూడా పనిచేశాను. ఆ సమయంలో నందినీ రెడ్డి, మచ్చ రవి, నేచురల్ స్టార్ నానితో కూడా కలిసి డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో వర్క్ చేశాను. ఎన్నో వేలమంది, లక్షలమంది చూసి ఆదరించే సినిమాను.. వారు సంతృప్తి పరిచే విధంగా ఉండాలంటే ముందు కథ సెలెక్ట్ చేసుకునే విధానంలో ఎంతో జాగ్రత్త తీసుకోవాలి. నేను అటువంటి జాగ్రత్తలే తీసుకుని సినిమాలు తీస్తున్నాను. అలాగే సినిమాలు చేయడానికి ఇష్టం కాదు, పిచ్చి ఉండాలి. నాకు సినిమాలు అంటే అటువంటి పిచ్చే ఉంది. అందుకే సెలక్టెడ్‌గానే సినిమాలు చేస్తున్నాను అన్నారు.



## 'నారి నారి నడుమ మురారి' సంక్రాంతికి వరల్డ్ వైడ్ రిలీజ్

**చార్మింగ్ స్టార్ శర్వా** ఫీల్‌గుడ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ నారి నారి నడుమ మురారిలో నటిస్తున్నారు. బ్లాక్ బస్టర్ 'సామజవరగమన' దర్శకుడు రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్నారు. అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ఎకె ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రంలో సాక్షి వైద్య, సంయుక్త హీరోయిన్స్. ఫస్ట్ లుక్, ప్రమోషనల్ పోస్టర్లు ఇప్పటికే బజ్ క్రియేట్ చేసింది. ఫస్ట్ సింగిల్ ఖిదర్శనమేఖి కూడా చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. దీపావళిసందర్భంగా, ఈ చిత్రం 2026 సంక్రాంతికి రిలీజ్ అవుతుందని మేకర్స్ ప్రకటించారు. గతంలో 'శతమానం భవతి'తో బ్లాక్‌బస్టర్ అందించిన శర్వాకు సంక్రాంతి లక్కీ సీజన్. దీపావళి శుభాకాంక్షలు తెలియజేసేన పోస్టర్‌లో శర్వా సాంప్రదాయ పంచె కట్టులో పూల మంచం మీద స్టైలిష్‌గా నడుస్తున్నట్లు కనిపించడం ఆకట్టుకుంది. అందమైన డ్యాన్సర్స్, డ్రమ్మర్‌లతో పోస్టర్‌లో పండగ వైబ్ కనిపించింది. ఈ చిత్రానికి విశాల్ చంద్ర శేఖర్ సంగీతం అందిస్తుండగా, జ్ఞాన శేఖర్ విఎస్, యువరాజ్ కలిసి సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు. భాను బోగవరపు కథను రాశారు. నందు సావిరిగణ డైలాగ్స్ అందించారు. బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్. అజయ్ సుంకర సహ నిర్మాతగా, కిషోర్ గరికిపాటి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. ఈ చిత్రం షూటింగ్ పూర్తయ్యే దశలో ఉంది. నిర్మాతలు త్వరలో నెక్స్ట్ ప్రమోషన్స్‌ను ప్రారంభించనున్నారు.

# 'లవ్ ఒటిపి' చిత్రం అందరినీ అలరిస్తుంది

## ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో రాజీవ్ కనకాల



**శ్రీమతి పుష్ప మణిరెడ్డి** సమర్పణలో భావప్రీత ప్రొడక్షన్స్ బ్యానర్ మీద అనీష్ హీరోగా స్వీయ దర్శకత్వంలో రానున్న 'లవ్ ఒటిపి' చిత్రాన్ని విజయ్ ఎం రెడ్డి నిర్మించారు. ఈ చిత్రంలో రాజీవ్‌కనకాల ప్రధాన పాత్రలో నటిం చారు. జాన్విక, నాట్యరంగ వంటి వారు కీలక పాత్రల్ని పోషించారు. ఈ సినిమాను నవంబర్14న రిలీజ్‌చేయబోతున్నారు. ఈ మేరకు బుధవారం 'లవ్ ఓటీపీ'కి సంబంధించిన ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈక్రమంలో నిర్వహించిన ఈవెంట్‌లో.. రాజీవ్ కనకాల మాట్లాడుతూ.. 'లవ్ ఓటీపీ' చిత్రాన్ని తెలుగు, కన్నడ భాషల్లో చిత్రీకరించాం. ఇందులో నేను తండ్రి పాత్రను పోషించాను. కొడుకుని కూతురిలా చూసుకునే ఓ డిఫరెంట్ ఫాదర్ కారెక్టర్‌ను చేశాను. భావప్రీత బ్యానర్ మీద విజయ్ గారు ఈ మూవీని భారీ ఎత్తున నిర్మించారు. అనీష్ గారు తెలుగు ఇండస్ట్రీలోకి అడుగు పెట్టారు. జాన్వికకి తెలుగులో మంచి ఫ్యూచర్ ఉంటుంది. ఆనంద్ గారి మ్యూజిక్ చాలా బాగుంటుంది.హర్ష గారి విజువల్స్ అద్భుతంగా వచ్చాయి. అనీష్ ఈ మూవీని ఇష్టపడి, కష్టపడి చేశాడు. రాజమౌళిలా అన్ని క్రాఫ్ట్‌ల మీద పట్టున్న అనీష్‌కు మంచి పేరు రావాలి. నవంబర్ 14న ఈ చిత్రం రాబోతోంది. అందరూ తప్పకుండా చూసి సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. హీరో, దర్శకుడు అనీష్ మాట్లాడుతూ.. 'హీరో అవ్వాలని చిన్నప్పటి నుంచీ కలలు కంటుండేవాడిని. వైజాగ్ మూర్తి వద్ద యాక్టింగ్ నేర్చుకున్నాను. ఎప్పటి నుంచో మళ్లీ తెలుగులోకి రావాలని చాలా ప్రయత్నాలు చేసి విఫలం అయ్యాను. మళ్లీ ఇప్పుడు ఇలా ఇన్నేళ్లకు టెక్నీషియన్‌గా, దర్శకుడిగా, హీరోగా ఆడియెన్స్ ముందుకు వచ్చాను. ఇందులో మంచి కంటెంట్ ఉంటుంది. ఈ రోజు అదే మా ఈవెంట్‌కు గెస్ట్. మేం కంటెంట్‌ను నమ్మి ఈ మూవీని చేశాం. రాజీవ్ కనకాల గారు ఈ మూవీని భుజానికెత్తుకుని ముందుకు తీసుకు వెళ్తున్నారు. నవంబర్ 14న ఈ చిత్రం రాబోతోంది. అందరినీ ఆకట్టుకునేలా ఈ చిత్రం ఉంటుంది. అందరూ చూసి సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాన్థ అని అన్నారు. నిర్మాత విజయ్ ఎం రెడ్డి మాట్లాడుతూ..'అనీష్‌తో నాకు పదహారేళ్ల నుంచి బంధం ఉంది. సినిమా చేయాలని హైదరాబాద్‌కు వచ్చాం. ఇప్పుడు నేను నిర్మాతగా అనీష్‌ని హీరోగా, దర్శకుడిగా పరిచయం చేస్తున్నాను. అనీష్ ఎప్పుడూ కష్టపడుతూనే ఉంటాడు. ట్రైలర్ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాను.

రాజీవ్ కనకాల గారు మాకు ఎంతో సపోర్ట్ చేశారు. నవంబర్ 14న మా చిత్రం రాబోతోంది. అందరూ చూసి సపోర్ట్ చేయండి' అని అన్నారు. హీరోయిన్ జాన్విక మాట్లాడుతూ.. 'తెలుగులో ఇదే నాకు మొదటి చిత్రం. నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన నిర్మాత విజయ్ గారికి, హీరో, దర్శకుడు అనీష్ గారికి థాంక్స్. షూటింగ్ అంతా సరదాగా చేశాం. రాజీవ్ కనకాల గారితో పని చేయడం ఆనందంగా ఉంది. మా సినిమా నవంబర్ 14న రాబోతోంది. అందరూ చూసి సపోర్ట్ చేయండి' అని అన్నారు. బాబా భాస్కర్ మాట్లాడుతూ. 'లవ్ ఓటీపీలో నన్ను నమ్మి అవకాశం ఇచ్చిన అనీష్ గారికి థాంక్స్. నిర్మాత గారు మాకు ఎంతో సపోర్ట్ చేశారు. ఇందులో లవ్, మాస్ సాంగ్స్ ఇలా అన్నీ బాగుంటాయి. ఈ చిత్రం చాలా బాగా వచ్చింది. నవంబర్ 14న ఈ మూవీ రాబోతోంది. అందరూ చూసి సపోర్ట్ చేయండి' అని అన్నారు.

# చదువుతో పాటు ఆధ్యాత్మికత

పిల్లలకు చదువు ఎంత ప్రధానమో.. ఆధ్యాత్మిక చింతన కూడా అంతే అవసరం. దీనివల్ల జీవితంలో సన్మార్గంలో నడవడంతో పాటు, సవాళ్లను ఎలా ఎదుర్కోవాలి, ఒత్తిడిని అధిగమించి మానసిక ప్రశాంతత ఎలా పొందాలి మొదలైన విషయాలు తెలుస్తాయంటున్నారు నిపుణులు. అయితే పిల్లలకు ఆధ్యాత్మిక చింతనను అలవర్చే తల్లిదండ్రులు కొన్ని విషయాలు దృష్టిలో పెట్టుకోవాలంటున్నారు. మరి, అవేంటో తెలుసుకుందామా....



**ముందు మీరు తెలుసుకోండి!**
కుటుంబపరంగా, సమాజపరంగా వివిధ ఆచారాలు, సంప్రదాయాలు పాటించడం సహజం. వాటివల్ల కొన్ని ప్రయోజనాలు కూడా ఉంటాయి. కానీ, ఈ రోజుల్లో చాలామంది వాటి అసలు అర్థం తెలుసుకోకుండా ఎవరికి నచ్చినట్టు వారు మార్చేస్తున్నారు. ఒకరిని చూసి మరొకరు గుడ్డిగా పాటించేస్తూ అసలు గాలికి వదిలేస్తున్నారు. కాబట్టి, ముందుగా మీరు పిల్లలకు ఏ విషయాలు నేర్పించాలనుకుంటున్నారో వాటి గురించి పూర్తిగా తెలుసుకోవాలి. ఆ తర్వాత పిల్లలకు నేర్పించడం వల్ల ఆయా ఆచారాలు, సంప్రదాయాల వల్ల కలిగే లాభాలు ఏంటో వారు తెలుసుకోగలుగుతారు. వారికి క్రమేపీ ఆధ్యాత్మికత దిశగా ఆసక్తి కలుగుతుంది..

**కథలు చెప్పాలి...** వివిధ గ్రంథాలు, పురాణాలు మొదలైన వాటిలో ఉండే వివిధ అంశాల గురించి పిల్లలకు చిన్న చిన్న కథల రూపంలో చెప్పడం వల్ల వారిలో ఆధ్యాత్మిక భావన పెరుగుతుంది. అలాగే జీవితంలో వచ్చే ఎత్తుపల్లాలను ఎలా ఎదుర్కోవాలి? ఇతరులతో ఎలా ప్రవర్తించాలి? వంటి విషయాలు వారికి వ్యక్తిగత పాఠాలుగా ఉపయోగపడతాయి.

**చేసి చూపించాలి...** అసలు విషయాలు శోధించాలే కానీ ప్రతి మతంలోనూ ఎన్నో మంచి విషయాలు దాగి ఉంటాయి. చాలా మంది వీటి గురించి నలుగురిలో ఉన్నప్పుడు మాట్లాడతారు కూడా. మానవ సేవే మాధవ సేవ, అబద్ధాలు చెప్పకూడదు. మోసం చేయకూడదు.. మొదలైనవన్నీ అందులో భాగమే. అయితే పాటించాల్సిన సమయం వచ్చినప్పుడు మాత్రం చాలామంది వెనకడుగు వేస్తారు. పిల్లల విషయంలో మీరూ ఈ తప్పులు చేయకూడదని నిపుణులు, మంచి అలవాట్లను మీరు పాటిస్తూ, వారినీ పాటించేలా చూడాలన్నారు. అప్పుడే వాళ్ల ఆధ్యాత్మికతకు అసలైన అర్థమేంటో . తెలుసుకోగలుగుతారు.

**ధ్యానం..** ధ్యానానికి ఎంతో ప్రాముఖ్యం ఉంటుంది. అయితే ఒక్కొక్కరు ఒక్కో విధంగా ధ్యానం చేస్తారు. ఎలా చేసినా అంతిమంగా కలిగే ప్రయోజనాలు మాత్రం దాదాపు ఒకేవిధంగా ఉంటాయి.

# గృహిణి నుంచి డీఎస్పీగా..

పెళ్లై, పిల్లలు పుట్టాక కెరీర్ ముగిసినట్లుగానే చాలామంది మహిళలు. ఇల్లు, పిల్లల బాధ్యత తలమునకలై తామేమీ సాధించలేమనుకుంటారు. కానీ ఇవేవీ మన కెరీర్‌కు అడ్డు కాదని, ఈ రెండింటినీ సమన్వయం చేసుకుంటూనే జీవితంలో మనం అనుకున్నది సాధించవచ్చని నిరూపిస్తున్నారు కొందరు మహిళలు. హరియాణాకు చెందిన అంజూ యాదవ్ ఇదే కోవకు చెందుతుంది. పుట్టింట్లో పేదరికం కారణంగా చిన్న వయసులోనే వివాహ బంధంలోకి అడుగు పెట్టిన ఆమె.. మంచి చదువు, ఉన్నతోద్యోగంతోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలను కుంది. ఈ పట్టుదలే ఆమెను పోలీసాఫీసర్‌ని చేసింది. రాజస్థాన్ పోలీస్ శాఖలో డీఎస్పీగా ఇటీవలే బాధ్యతలందుకున్న అంజు తన జీవిత కథ తెలుసుకుందాం.

ఆ కలలు కల్లలయ్యాయి! అంజుది హరియాణాలోని దౌలెడ అనే గ్రామం. ఆమెది వ్యవసాయాధారిత కుటుంబం. ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగానే ఆ ప్రభావం తమ పిల్లలపై పడనివ్వలేదు అంజు తల్లిదండ్రులు. అందులోనూ నలుగురూ కూతుళ్లే అయినా వాళ్లను తక్కువ చేసి చూడకుండా..వాళ్ల ఇష్టాయిష్టాల్ని తీసుకొని ఉన్నత చదువులు చదివారు. అంజుకి కూడా చిన్నతనం నుంచి చదువంటే ప్రాణం. ఇంటర్ వరకు స్థానిక ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో చదువుకున్న ఆమె.. ఆపై దూరవిద్యలో డిగ్రీ పూర్తి చేసింది. అయితే ఇంకా పైచదువులు చదవాలని ఉన్నా తప్పని పరిస్థితుల్లో వివాహం చేసుకోవాల్సి వచ్చింది అంజు. అలా 21 ఏళ్లకు అత్తింట్లో అడుగుపెట్టిన ఆమె.. భర్త, అత్తమామల ప్రోత్సాహంతో చదువుకోవాలనుకుంది. కానీ అది జరగలేదు. ఆమె చదువుకుంటానంటే ప్రోత్సహించడ మేమో గానీ 'ఇక చదివింది చాలు.. ఇంటి బాధ్యతలు చూసుకో!' అంటూ చీవాట్లు పెట్టేవారు. ఇంతలోనే ఆమెకు ఒక కొడుకు పుట్టాడు. రోజులు గడిచే కొద్దీ అత్తింటి వాళ్ల నుంచి వేధింపుల్నీ ఎదుర్కొంది అంజు. అన్నీ తట్టుకోలేకపోయిన ఆమె తన కొడుకుని తీసుకొని పుట్టింటికి వచ్చేసింది.

**మూడు ప్రభుత్వోద్యోగాలు!** ఇలా చేసినందుకు ఇరుగు పొరుగు వారు, బంధువుల నుంచి అంజు సూటిపోటి మాటలు ఎదుర్కొన్నారు. కానీ ఆమె తల్లిదండ్రులు మాత్రం ఆమె పరిస్థితిని అర్థం చేసుకొని ఆదరించారు. పైచదువులు చదువుతానంటే ఒప్పుకొన్నారు. ప్రోత్సహించారు. అలా డీఎస్సీ రాసిన అంజు.. తన ప్రతిభతో మూడు ప్రభుత్వ టీచింగ్ ఉద్యోగాలు సంపాదించింది. ఈ కోరనే తొలుత మధ్యప్రదేశ్ భిండ్ నిర్వహించిన 'జవహర్ నవోదయ విద్యాలయం'లో పాఠాలు బోధించిన ఆమె.. ఆపై ఐదేళ్ల పాటు ఢిల్లీ, రాజస్థాన్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువు చెప్పింది. అయితే ఈ ఉద్యోగాలతో సంతృప్తి చెందని ఆమె.. ఆ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ పరీక్షలు రాయడమే తన తదుపరి లక్ష్యం పెట్టుకుంది. అందుకు కోచింగ్ తీసుకోకుండానే సొంతంగా పరీక్షలకు సిద్ధమైంది. ఈ సమయంలోనే ఆమె భర్త అనారోగ్యంతో మరణించాడు. అయినా ఈ బాధను దిగమింగుకొని.. ఓవైపు తన కొడుకు ఆలానా పాలనా చూసుకుంటూనే.. తిరిగి పోటీ పరీక్షలకు సిద్ధమైందామె. అలా 2023లో 'రాజస్థాన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్' పరీక్షల్లో 1725 ర్యాంకు సాధించింది అంజు.





**డీఎస్పీ అన్న పదమే తెలియదు...**
ఎప్పటికైనా పోలీసాఫీసర్ కావాలన్న లక్ష్యాన్ని పెట్టుకున్న అంజు.. పబ్లిక్ సర్వీస్ పరీక్షల్లో మంచి ర్యాంకు సాధించి పోలీస్ శాఖకు ఎంపికైంది. అయితే ఇటీవలే శిక్షణ పూర్తిచేసుకున్న ఆమెకు డీఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. ఇలా తన కలల ఉద్యోగాన్ని సొంతం చేసుకోవడం చెప్పలేనంత సంతోషంగా ఉందంటూ తన జీవిత కథను క్లుప్తంగా ఇన్‌స్టాలో పంచుకుంది అంజు. తాను గృహిణిగా ఉన్నప్పుడు దిగిన ఫొటోకు, పోలీస్ యూనిఫాం ధరించిన ఫొటోను కొలేజ్ చేసి. ఇన్‌స్టాలో పోస్ట్ చేసిన ఆమె.. మొదటి ఫొటో తీసుకున్న సమయంలో నేనో సాధారణ గృహిణిని, ఉదయం నుంచి రాత్రి వరకు ఇంటి పనులకే పరిమితమైన ఓ సాదాసీదా మహిళని! నేను సాధిస్తానన్న నమ్మకం అప్పుడ నాకు ఏదో లేదు. డీఎస్పీ అన్న పదమూ అప్పటికి నేను వినలేదు. గ్రామాల్లో పేద కుటుంబంలో పుట్టిన మహిళలకు పెద్ద పెద్ద కలలు కనే హక్కు లేదంటారు చాలామంది. ఒకవేళ ధైర్యం చేసి కలలు కన్నా సూటిపోటి మాటలు, మానసిక వేధింపులు, హింస.. ఇవే మనకు సంకెళ్లు వేస్తాయి నా జీవితం లోనూ ఇలాంటి ప్రతికూల పరిస్థితులెన్నో. ఎదుర్కొన్నా. కానీ వీటిని నేను ధైర్యంగా ఎదుర్కోగలిగానంటే అందుకు మా పేరెంట్సే కారణం. వాళ్లే నన్ను ప్రోత్సహించారు.. నా కొడుకును కంటికి రెప్పలా కాచుకున్నారు. కాబట్టే నేను ఇప్పుడీ స్థాయిలో ఉన్నా. అందుకు తార్కాణమే ఈ రెండో ఫొటో. చివరగా ఒక్క మాట చెప్తా.. మన శాయశక్తులా ప్రయత్నిస్తే మనం కన్న కలలు తప్పకుండా నెరవేరుతాయి. మహిళలు కోసం కాస్త శ్రమించాల్సి రావచ్చు, కాస్త ఎక్కువ సమయం పట్టచ్చు. కానీ మనం మాత్రం తప్పకుండా లక్ష్యాన్ని చేరుకుంటాం.. అంటూ తన మాటలతోనూ స్ఫూర్తి నింపుతోందీ పోలీస్ అధికారిణి. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట్లో వైరల్‌గా మారడంతో చాలామంది సానుకూలంగా స్పందిస్తున్నారు. మేడమ్.. మీ కథ ఎంతోమందికి స్ఫూర్తి! అని ఒకరు స్పందిస్తే.. నా కథా మీ జీవితాన్ని పోలి ఉంది.. మిమ్మల్ని స్ఫూర్తిగా తీసుకొని సవాళ్లను అధిగమిస్తా.. అంటూ పోస్టులు పెడుతున్నారు. ఇక మరికొందరు స్పందిస్తూ 'తపన, పట్టుదల ఉంటే.. పెళ్లైనా, పిల్లలు పుట్టినా కెరీర్‌లో రాణించచ్చు అనడానికి ఆమె స్టోరీ నిదర్శనం.

# అందమైన నీలం నగలు

ఫ్యాషన్ ఫ్యాషన్





నవరత్నాల్లో ఒకటిగా పిలిచే నీలం రాయికి వజ్రానికంటే విలువెక్కువ. ఈ బ్లూ సాఫైర్‌ని ఇంద్రనీలం, నీలమణి అని కూడా పిలుస్తారు. శతాబ్దాలుగా వీటికి ప్రత్యేక గుర్తింపు ఉంది. వీటిని ధరించడం శక్తికి ప్రతీకగా, రాచరికపు హోదాగా భావిస్తారు. మధ్యయుగాల్లో ఈ నీలమణికి ఔషధ గుణాలున్నాయని నమ్మేవారట. వీటికి ఉన్న ప్రత్యేక లక్షణాలు వల్లేనేమో బ్రిటన్ రాణి డయానా, కేట్ మీడిల్ టన్..నిశ్చితార్థపు ఉంగరాలు,బ్రిటిష్ నక్రౌన్ జ్యుయెలరీల్లోనూ నీలం రాళ్లేన్ల ఎక్కువట. కంటిని ఆకట్టుకునే రంగు.. తరగని మెరుపుతో ఉండే ఇవి ఈ తరం అమ్మాయిలకు భలేగా నచ్చేస్తున్నాయి. అందుకే స్టడ్స్ పెండెంట్స్ వంటి వాటికే పరిమితం కాకుండా హారాలు, నెక్లెస్లు వంటివి కూడా ఎంచుకుంటున్నారు. అలాంటివే ఈ డిజైన్లన్నీ.. ఓ సారి ఇటు చూడండి. మీకూ నచ్చేస్తాయి.




















# ఆలోచించడం మానేస్తాం.

చాలమంది మహిళలు... ఇల్లు, పిల్లలు, ఆఫీసు... అంటూ బాధ్యతల వలయంలో చిక్కుకుని ఒత్తిడికి ఉంటారు. ఇలాంటప్పుడు మనల్ని మనం కోల్పోయామనే బాధ దరిచేరకూడదు. అందుకోసం తిరిగి ఆ సంతోషాన్ని తెచ్చే చిన్న చిన్న పనులను చేసి చూడండి. బాగుంటుంది. ఏదయినా నవ్వు తెప్పించే సన్నివేశం చూసినప్పుడు, లేదా స్నేహితుల నుంచి ఏదయినా జోక్ విన్నప్పుడూ, కుటుంబసభ్యులంతా సరదాగా కూర్చుని మాట్లాడుకుంటున్నారు పెద్దగా నవ్వేస్తాం. అయితే అలా నవ్వడాన్ని ఎప్పుడో ఒకసారి కాకుండా తరచుగా చేయండి. దానివల్ల ప్రతికూల ఆలోచనలు పోవడమే కాదు, మానసిక ఆనందమూ సొంతమవుతుంది. కొందరికి సంగీతం వినడం అంటే ఇష్టం. కానీ, వినడం మాత్రమే కాదు.. పాడటానికీ ప్రయత్నించండి. అలాగని పెద్దగా సాధనేం చేయక్కర్లేదు. మీకు నచ్చిన కూనిరాగాలు తీసినా మేలే. ఇక, ఆ ఉత్సాహానికి తగ్గట్లు పాదాలు కదిపితే పోలా? చక్కటి వ్యాయామమూ మీ సొంతం అవుతుంది. నలుగురి ముందు చేయలేం అనుకునేవారు... ఇంట్లో అద్దం ముందు ప్రయత్నించొచ్చు. దీనికీ డాన్స్ వచ్చి ఉండాలనేం లేదు. నచ్చినట్లు చేయండి. ఇది మీలో ఉత్సాహాన్నే కాదు... మీపై మీకు ప్రేమనూ పెంచేస్తుంది. నీళ్ల ఎంత ఒత్తిడినైనా ఇట్టే తరిమేస్తాయట. టబ్ లో నీళ్లను చిలకరించడం, అందులో చేతులతో నీళ్లను కదుపుతూ ఉండటం వం తో గడిచిన సమయమే తెలియదు. కొన్ని శబ్దాలు తెలియకుండానే ఆనందాన్ని కలిగిస్తాయి. ముఖ్యంగా పక్షుల అరుపులూ, పిల్లలు ఆడుకుంటున్నప్పుడు మాట్లాడే మాటలూ, అడుగు చప్పుడూ ఇలా తరచూ ఇలా ఏదో ఒకటి వింటు ఉండాలి. ఒత్తిడి గూరించి ఆలోచించడం మానేస్తాం.



# ఎండు దానిమ్మ ఎంతో శ్రేష్ఠం

ఈ కాలంలో మనల్ని తరచుగా ఏవో అనారోగ్యాలు వేధిస్తుంటాయి. దానికి ప్రధాన కారణం రోగనిరోధక శక్తి తగ్గడం, అలా కాకూడదంటే సివిటమిన్ ఎక్కువగా ఉండే ఆహారం తినాలి. అందులో దానిమ్మది మొదటి స్థానం. తీపికి కాస్త పులుపు జోడించినట్లుండే దానిమ్మ ఎంత రుచిగా ఉంటుందో అంత ఆరోగ్యకరం కూడా. అందుకే ఇవి దొరికే కాలంలో తాజా పండ్లను ఎటూ తింటాం, అన్‌సీజన్‌లోనూ ఎండు దానిమ్మ తినడం అలవాటు చేసుకోమంటున్నారు నిపుణులు, పిస్తా, బాదం, జీడిపప్పు, కిస్మిస్, అంజీరా తదితర డ్రై ఫ్రూట్స్‌కు మల్లే ఎండు దానిమ్మ ఆరోగ్యానికి చాలా మంచిది. దానిమ్మలో సోడియం, కాపర్, పొటాషియం, మెగ్నీషియం, పీచు, ఐరన్, సి, కె, బి6 విటమిన్లు విస్తారంగా ఉంటాయి. ఎండు దానిమ్మ గింజలు విడిగానూ తినొచ్చు. పెరుగు, సలాడ్స్‌లోనూ వేసుకోవచ్చు. మొలకెత్తిన పెసలు, శనగల్లో పల్లీలు, మిరియాలపొడితో బాటు కొంచెం డ్రై అనార్ పౌడర్ వేస్తే ఆ రుచి వేరు. ఎండుద్రాక్ష కంటే ఎండు దానిమ్మ శ్రేష్ఠం. టొమాటో, బంగాళదుంప తదితర కూరల్లో ఎండు దానిమ్మ గింజల పొడి వేయడం వల్ల పోషకాలు అందడమే కాకుండా అదనపు రుచి తోడవుతుంది. రెండు కప్పుల నీళ్లలో చారెడు ఎండు దానిమ్మ గింజలు వేసి అరకప్పు అయ్యేదాకా ఉడికించి ఉదయాన్నే తాగితే అనేక ఆరోగ్య సమస్యలు అరికట్టినట్టే. ఈ గింజలకు ఒక చిన్న బీట్రూట్ కలిపి ఉడికించి గ్రైండ్ చేసి తాగితే హిమోగ్లోబిన్ స్థాయి పెరుగుతుంది. ఎర్రరక్త కణాల వృద్ధిచెందుతాయి. రక్తపోటు రాదు, ఎండు దానిమ్మలో ఎక్కువ విటమిన్లు, తక్కువ కాలరీలు ఉండటాం కొలెస్ట్రాల్ పెరగదు. గుండె సంబంధ వ్యాధులు రావు. రక్తలేమికి ఇది దివ్యౌషధం. కీళ్ల నొప్పులు, అర్థరైటిస్ తగ్గుతాయి. జ్ఞాపకశక్తి పెరుగుతుంది, ఊబకాయం రాదు. జీర్ణప్రక్రియ మెరుగవుతుంది. వంతులు, వికారం తగ్గుతాయి. ఎండు దానిమ్మ గింజల పొడిలో చిటికెడు మిరియాల పొడి కలిపి పళ్లు, చిగుళ్లకు మర్దన చేస్తే పంటి సమస్యలు తలెత్తుతాయి. దంతాలు దృఢంగా ఉంటాయి.



# ఆమె భ్రమలకు గురి అవుతుంది..



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

**ప్రశ్న:** మా కుమార్తె లేని పోనివి ఊహించుకుని భయపడుతోంది. తనపై సహోద్యోగులు కొందరు కుట్రపన్నారని అంటోంది. తన విషయాలు తెలుసుకుని వాటికి తప్పులు జోడించి ప్రచారం చేస్తున్నారని అనుమానిస్తున్నది. వారి మాటలు విని తమ కంపెనీ జనరల్ మేనేజరు తనను మందలించారని బాధపడుతున్నది. మొదట తాను నివాసం ఉండే అపార్టుమెంట్లో తనకు వ్యతిరేకంగా ప్రచారం చేశారని, ఇప్పుడు నగరం అంతా తెలిసి పోయిందని అంటోంది. తాను ఎక్కడికి వెళ్లినా అందరూ తనను ప్రశ్నార్థకంగా, హేళనగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తోంది.

వ్యథ

నెలక్రితం ఉద్యోగం మానేసింది. లండన్ నుంచి ఇండియాకు వచ్చేస్తానని ఏడుస్తున్నది. ఆమెకు 30 ఏళ్ళు. చిన్నప్పటినుంచి ర్యాంకు స్టూడెంటు. ఇంటర్ చదివేటప్పుడు అనవసరంగా భయపడేది. మేము ధైర్యం చెప్పి, పూజలు చేసి తామెత్తులు కడితే కుదటపడింది. మంచి మార్కులతో ఇంటర్ పాసయ్యింది. పేరున్న ఇంజనీరింగ్ కాలేజీలో బి.టెక్ పాసయ్యింది. ఇండియా కంటే లండన్‌లో మంచి అవకాశాలు ఉంటాయని వెళ్ళింది. తెలిసినవారి సహాయంతో అక్కడ ఉద్యోగం సంపాదించింది. పదేళ్ళలో ఐదు కంపెనీలు మారింది. ప్రతి చోట ఏదో ఒక సాకు చెప్పి ఉద్యోగం మానేసేది. ఐదేళ్ళ నుంచి పెళ్ళి ప్రయత్నాలు చేస్తున్నాము. ప్రతి వారిని ఏదో సాకు చెప్పి వద్దనేది. ఇప్పుడు ఇక్కడికి వచ్చేస్తానంటోంది. ఈ దశలో ఏమి చేయాలో తోచడం లేదు. తగిన సలహా ఇవ్వగలరు.



**- ఒక సోదరి, నెల్లూరు**

**జవాబు :** అమ్మా మీ కుమార్తె భ్రమలకు గురవుతోంది. ఇదొక మానసిక రుగ్మత. కొందరిలో భ్రమలతోపాటు భ్రాంతులు కూడ ఉంటాయి. కొందరిలో స్కిజోఫ్రెనియా రుగ్మత వల్ల ఈ లక్షణాలు కనిపిస్తాయి. బైపోలార్ డిజార్డర్ రుగ్మతలు ఉన్నవారిలోను భ్రమలు కనిపించే అవకాశాలు ఉన్నాయి. మీ కుమార్తెకు యవ్వన దశలోనే ఈ సమస్య ఉత్పన్నం అయినట్టు భావించాలి. ఈ పరిస్థితులలో ఆమె ఒంటరిగా లండన్‌లో ఉండటం కంటే మీ వద్ద ఉండటమే శ్రేయస్కరం. ఇక్కడికి వచ్చిన తరువాత క్లినికల్ సైకాలజిస్టు వద్ద పరీక్షలు చేయించి అసలు రుగ్మతను నిర్ధారించండి. తరువాత సైకియాట్రిస్టును కలసి క్రమం తప్పకుండా చికిత్స చేయించండి. దీనికి దీర్ఘకాలం మందులు వాడాల్సి ఉంటుంది. కాగా సైకోథెరపి, కౌన్సెలింగ్, యోగ, ధ్యానం, నిద్ర, సమతుల ఆహారం సహాయకారిగా పనిచేస్తాయని గుర్తించండి. ఆమెతో అనవసర వాదనలు చేయడం మాని ఆదరించండి. సైకియాట్రిస్టు సలహామేరకు వ్యవహారించండి.

# జీవ నిర్జీవ రూపి సాయి



ఆధ్యాత్మికం

లీలలు ఉన్నాయి. వాటిలో అతి ముఖ్యమైన వాటిలో కూడా అత్యంత అద్భుత మైనది మైనతాయి విషయంలో జరిగింది. హేమాడ్‌పంత్ సచ్చరిత్రలో సాయి సామర్థ్యం అత్యంత పరాకాష్ఠకు చేరిన సంఘటన అని అంటారు. ఈ సంఘటనే లేకనోతే భగవానుడు సాయి భగవానుడు నానావిధ రూపుడై-జీవిగా, నిర్జీవ వస్తువులుగా ఈ విశ్వమంతా వ్యాపించి ఉన్నాడని అర్థంకాకపోవచ్చు. ఈ మైనతాయి శ్రీ బి.వి. నరసింహ స్వామి గారితో జూన్ 20న(1936) ముచ్చటించినది. సాయినాథుని వైభవము, కారుణ్యము, సామర్థ్యము ఈ సంఘటనలో తేటతెల్లమవుతుంది. ఈ జామ్నేరు చిత్రము ఇంకెక్కడ కనిపించని చిత్రాతి చిత్రమైన గాథ. దానికి అదేసాటి. ఎప్పుడో ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడు ఇటువంటి సంఘటనను చేసి చూపించాడు. ఒకసారి బ్రహ్మకు బాల కృష్ణుని పరీక్షిద్దామనిపించి గొల్లవాండ్రతో కృష్ణుడు గోవులను మేపుతున్నప్పు గొల్ల పిల్లలను, గోవులను కనపడకుండా దాచివేసాడు. ఈ కృష్ణుడు ఎలా మసలుతాడో తెలుసుకోవలని బ్రహ్మ అలా చేసాడు. శ్రీకృష్ణుడు ఆ పేము కర్రలు, కొమ్ముబూరలు, వస్త్రములు, హారములు, నడకలు, నవ్వులు, మాటతీరు ఎవరెవరికి ఎట్లుండెనో అట్లే ధరించాడు. ఎవరి ఇండ్లకు వారు పోయినారు. ఇలా 1, 2 దినములు కాదు, ఒక సంవత్సరము గడిచినది. ఇక బ్రహ్మ తాను దాచిన గోపబాలురు, గోవులు అట్లే ఉన్నవి. శ్రీకృష్ణుని వద్దకూడా అట్టివే ఉన్నవి. బ్రహ్మకు నాలుగు తలలు ఒకేసారి తిరిగి నంత పనయింది. శ్రీకృష్ణుని పాదముల పైపడ్డాడు. మైనతాయి విషయంలో సాయి గుర్రముగా, టాంగాగా, గుర్రపు బండి తోలువానిగా చివరకు తినే ఆహార పదార్థములుగా సాయి రూపొందినాడు. ఈ సంఘటనకు కారకురాలైన నానా కుమార్తె మనతాయి ధన్యురాలు. ఈ సంఘటనను స్వయంగా అనుభవించిన రాంగిర్ బువా (బాపూగిర్ బువా) ధన్యుడు. అటి దివ్య చర్యలు చూపు సాయికి శతకోటి వందనములు.



- యం.పి.సాయినాథ్



## ముక్కోణపు మహిళల టోర్నమెంట్‌లో
# భారత్ ఓటమి
### 0-2తో ఇరాన్ విక్టరీ

**న్యూఢిల్లీ:** ముక్కోణపు మహిళల అంతర్జాతీయ టోర్నమెంట్ ప్రారంభ మ్యాచ్‌లో ఇరాన్ భారత్‌ను అధిగమించింది. భారత మహిళల జట్టు తొలి మ్యాచ్‌లో తడబడటంతో 0-2 తేడాతో ఇరాన్ గెలుపొందింది. మొదటి అర్ధభాగంలో గోల్ లేని తర్వాత సబ్‌స్టిట్యూట్ సారా దిదార్ రెండవ అర్ధభాగంలో రెండుసార్లు గోల్ చేసి విజయాన్ని అందించింది. బ్లూ టైగ్రెస్‌లు దూకుడుగా కనిపించినా ఇబ్బంది పడ్డాయి. ఇరాన్ ప్రారంభం నుండి వేగాన్ని నిర్దేశించుకుంటూ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. నాల్గవ నిమిషంలోనే పాంథోయ్ సాధారణ క్రాస్‌ను తప్పుదారి పట్టించడంతో ఇబ్బంది సంకేతాలు వెలువడ్డాయి. ఫంజౌబమ్ నిర్మలా దేవి చివరి డిచ్ క్లియరెన్స్ కారణంగా ఇరానియన్ గోల్‌ను తృటిలో తప్పించింది. 64వ నిమిషంలో ఇరాన్ పట్టుదల ఫలించింది. జహ్రా ఘన్‌బారి నుండి వచ్చిన హెడర్ క్రాస్‌బార్‌ను తాకిన తర్వాత, సారా దిదార్ రీబౌండ్‌ను సద్వినియోగం చేసుకుని స్కోరింగ్‌ను ప్రారంభించింది. 74వ నిమిషంలో నోంగ్మైథమ్ రతన్‌బాలా దేవి చేసిన డిఫెన్సివ్ తప్పుడు అంచనా తర్వాత ఫార్వర్డ్ ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. పాంథోయ్‌ను దాటుకుని తక్కువ షాట్‌ను రైఫిల్ చేసి స్కోరును 2-0కి చేర్చింది. 89వ నిమిషంలో లిండా కోమ్ సెర్టో ఫ్రీకిక్ ద్వారా ఇరానియన్ గోల్ కీపర్ రహా యజ్దానీపై ప్రయత్నం చేసినా దాన్ని ఆమె సేవ్ చేయగలిగింది. అయినా ఫాతిమే షాబాన్ ఘోఫ్రూద్ పోస్ట్‌ను బద్దలు కొట్టడంతో ఇరాన్ 3-0తో గెలుపొందింది.



# జింబాబ్వే విజయం
### చిత్తుగా ఓడిన అఫ్ఘానిస్థాన్

**న్యూఢిల్లీ:** స్వదేశంలో ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో జింబాబ్వే ఘన విజయం సాధించింది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఇన్నింగ్స్ 73 పరుగుల తేడాతో పర్యాటక జట్టును చిత్తుగా ఓడించింది. 12 ఏళ్ల తర్వాత జింబాబ్వే గెలిచిన తొలి టెస్టు మ్యాచ్ ఇది. మూడు రోజుల్లోన ముగిసిన ఈ మ్యాచ్‌లో జింబాబ్వే అన్ని విభాగాల్లోనూ సత్తా చాటింది. బ్యాటర్లు ఒకే ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేసి సత్తా చాటారు. ఓపెనర్ బెన్ కర్రన్ కెరీర్‌లో తొలి సెంచరీతో కదం తొక్కగా, సికిందర్ రజా అర్థ సెంచరీతో రాణించాడు. నిక్ వెల్ఛ్ 49 పరుగులు చేసి అర్థ సెంచరీని చేజార్చుకున్నాడు. పేసర్ బ్రాడ్ ఈవాన్స్ తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు తీసి ఆఫ్ఘన్ పతనాన్ని శాసించాడు. ముజరబానీ 3 వికెట్లు, ఈ ఇన్నింగ్స్‌లో మరో 3 వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో రిచర్డ్ నగరవ 5 వికెట్లు తీశారు.

ఈ మ్యాచ్‌లో ఆఫ్ఘన్‌కు ఒకే ఒక సానుకూల అంశం ఉంది. పేసర్ జియా ఉర్ రెహ్మాన్ 7 వికెట్లతో విజృంభించాడు. ఆఫ్ఘన్ స్టార్ బ్యాటర్లు గుర్బాజ్ (37, 9), ఇబ్రహీం జద్రాన్ (19, 42) పెద్దగా రాణించలేకపోయారు. అయినా తొలి ఇన్నింగ్స్‌లో గుర్బాజ్, రెండో ఇన్నింగ్స్‌లో జద్రానే టాప్ స్కోరర్లు కావడం విశేషం. కెప్టెన్ హస్మతుల్లా షాహిది (7, 7) రెండు ఇన్నింగ్స్‌ల్లో నిరాశపరిచాడు. రెండో ఇన్నింగ్స్‌లో బషీర్ షా (32) ఒక మోస్తరు స్కోర్ చేశాడు. మొత్తంగా ఆఫ్ఘనిస్తాన్ అన్ని విభాగాల్లో దారుణంగా విఫలమై, ఇన్నింగ్స్ పరాజయాన్ని మూటగట్టుకుంది.

## ఫ్రెంచ్ ఓపెన్‌లో..
# లక్ష్యసేన్ ఔట్



### దూసుకువెళ్తున్న రోహన్-రుత్విక

**న్యూఢిల్లీ:** ఫ్రెంచ్ ఓపెన్ 2025లో భారత్‌కు చెందిన లక్ష్య సేన్ ముందుగానే ఔటయ్యాడు. ఇక రోహన్-రుత్విక ముందున్నారు. లక్ష్య సేన్ తొలి రౌండ్‌లో ఐర్లాండ్‌కు చెందిన నాట్ న్గుయెన్ చేతిలో ఓడిపోగా, రోహన్ కపూర్-గద్దె రుత్విక శివాని జోడీ ఉక్రెయిన్‌కు చెందిన టిటోవ్-కాంటెమిర్‌ను అధిగమించారు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య ప్రారంభంలోనే ఓడిపోగా, మిక్స్‌డ్ డబుల్స్ ద్వయం రోహన్-రుత్విక ద్వయం మొదటి రౌండ్‌లో అద్భుతమైన విజయాన్ని సాధించారు. పురుషుల సింగిల్స్‌లో, ఈ నెల ప్రారంభంలో హాంకాంగ్ ఓపెన్‌లో



రన్నరప్‌గా నిలిచిన ప్రపంచ 16వ ర్యాంకర్ లక్ష్య ఐర్లాండ్‌కు చెందిన ప్రపంచ 29వ ర్యాంకర్ నాట్ న్గుయెన్ చేతిలో 7-21, 16-21 తేడాతో ఓటమి పాలయ్యాడు. పారిస్ హాల్ డ్రిఫ్ట్ కింద భారత షట్లర్ లయ తప్పినట్లు కనిపించి షటిల్‌ను నియంత్రించడంలో ఇబ్బంది పడ్డాడు. అలాగే మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రపంచ నం. 32 జోడీ రోహన్-రుత్విక 32 నిమిషాల్లో 21-12, 21-19తో ఉక్రెయిన్‌కు చెందిన 58వ ర్యాంకర్ ఒలెక్సి టిటోవ్-యెవెనియా కాంటెమిర్‌ల జోడీపై విజయం సాధించారు. తొలి గేమ్‌లో త్వరిత ఆటతీరుతో, నిర్ణయాత్మకమైన కోర్ట్ ఆటతో భారత జట్టు ఆధిపత్యం చెలాయించింది. రెండో మ్యాచ్‌లో చివరి ఒత్తిడిని తట్టుకుని మ్యాచ్‌ను ముగించింది. ఈ విజయంతో, వారు రౌండ్ ఆఫ్ 16కి చేరుకున్నారు. అక్కడ వారు ఫ్రాన్స్‌కు చెందిన 5వ సీడ్ థామ్ గిక్వెల్ మరియు డెల్ఫిన్ డెల్రూలను ఎదుర్కొంటారు. లక్ష్య జట్టు ముందుగానే నిష్క్రమించడంతో, ఇప్పుడు అందరి దృష్టి సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి, అన్మోల్ ఖర్బ్ మరియు ఆయుష్ శెట్టి వంటి ఇతర భారతీయ ఆశావహులపైకి మళ్లింది,

# నేడు భారత్ కీలక పోరు



## ఆస్ట్రేలియాతో రెండో వన్డే
### ఇద్దరు స్టార్ ప్లేయర్స్‌పై వేటు



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాతో జరిగే రెండో వన్డే మ్యాచ్‌కు టీమిండియా సిద్ధమైంది. ఈ రెండు జట్ల మధ్య ఈ నెల23న ఆడిలైట్ వేదికగా పోరు జరగనుంది. పెర్త్‌లో జరిగిన తొలివన్డేలో వర్షంకారణంగా అంతరాయం కలిగిన మ్యాచ్‌లో భారత జట్టు ఘోర పరాజయాన్ని చవిచూసింది. దీంతో అడిలైడ్‌లో టీమిండియా గెలవడం చాలా ముఖ్యం. ఇందులో ఓటమి చెందినట్లయితే భారత్ సిరీస్‌ను కోల్పోయే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే బిసిసిఐ సెలక్టర్లు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్లేయింగ్ లెవన్‌లో పలు మార్పులు చేశారు. తొలి వన్డేలో బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు ఓపెనింగ్ జోడీ శుభ్‌మాన్‌గిల్, రోహిత్ శర్మ కూడా మార్పులకు లోనయ్యే అవకాశం ఉంది. తొలి వన్డేలో రోహిత్ లేదా గిల్ ఇద్దరూ పరుగులు చేయడంలో ఇబ్బంది పడ్డారు. ఇప్పుడు, ఒత్తిడి రోహిత్‌పై ఉంది. రోహిత్‌ను జట్టు నుంచి తప్పించి అడిలైడ్‌లో జరిగే రెండో వన్డేకు యశస్వి జైస్వాల్‌ను ఇన్నింగ్స్‌ను ప్రారంభించే అవకాశం ఉంది. యశస్వి ప్రస్తుతం తన అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. ఇటువంటి పరిస్థితిలో రోహిత్‌ను తప్పించి, జైస్వాల్, గిల్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించడం ద్వారా పెద్ద రిస్క్ తీసుకోనుంది. ఇక పెర్త్ వన్డేలో భారత్ ఓడిపోయినప్పుడు తలెత్తిన అతిపెద్ద ప్రశ్న ఏమిటంటే కుల్దీప్ యాదవ్‌ను ప్లేయింగ్ ఎలెవన్‌లో ఎందుకు చేర్చలేదు. టీమిండియా ఒక స్పెషలిస్ట్ బౌలర్‌కు బదులుగా ముగ్గురు ఆల్ రౌండర్లను ఎందుకు రంగంలోకి దించింది? కుల్దీప్‌ను ఎందుకు విశ్వసించలేదు? అనే ప్రశ్నలు తలెత్తాయి. అయితే కుల్దీప్ గురువారం జరిగే మ్యాచ్‌లో కూడా ఆడటం లేదని తెలుస్తోంది. అడిలైడ్ ఓవల్‌లో ఫాస్ట్ బౌలర్లు ఆధిపత్యం చెలాయిస్తున్నారు. దీంతో కుల్దీప్ మైదానంలోకి దిగడం కష్టమైంది. కుల్దీప్ మాత్రమే కాదు, మహమ్మద్ సిరాజ్ కూడా అడిలైడ్‌లో ప్రాక్టీస్ చేయలేదు. అందువల్ల, రెండవ వన్డేకు అతనికి విశ్రాంతి ఇచ్చే అవకాశం ఉంది. దీని వలన ప్రసిద్ధ్ కృష్ణకు అవకాశం లభిస్తుంది. ఈ విధమైన మార్పులతో ఆస్ట్రేలియాతో జరిగే రెండో టెస్టులో భారత్ సిరీస్‌ను నిలుపుకోవచ్చని సెలక్టర్ల కమిటీ భావిస్తోంది.



ఆట

# టెస్ట్ ర్యాంకింగ్స్‌లో నం.1 బుమ్రా
### 17వ స్థానంలోకి సిరాజ్

**న్యూఢిల్లీ:** ఐసిసి పురుషుల టెస్ట్ బౌలర్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. టెస్ట్ ర్యాంకింగ్స్‌లో బుమ్రా అగ్రస్థానంలో ఉన్న ఆధిక్యాన్ని పాకిస్తాన్‌కు చెందిన నోమన్ అలీ కేవలం 29 పాయింట్లకు తగ్గించాడు. దక్షిణాఫ్రికాపై పాకిస్తాన్ 93 రన్స్ తేడాతో విజయం సాధించిన మ్యాచ్‌లో నోమన్ 10 వికెట్లు తీయడంతో అతను 4 స్థానాలు ఎగబాకి మొత్తం 853 రేటింగ్ పాయింట్లతో 2వ స్థానానికి చేరుకున్నాడు. ఈ మేరకు బుధవారం పురుషుల ర్యాంకింగ్స్ విడుదలయ్యాయి. అలాగే భారత జట్టుకు చెందిన మరో ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్ వన్డే ర్యాంకింగ్స్‌లో బలమైన పునరాగమనం చేశాడు. ఇటీవల ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌లో అద్భుతమైన ప్రదర్శన చేయడంతో ఏడాది తర్వాత తొలిసారిగా ర్యాంకింగ్స్‌లో 17వ స్థానంలో తిరిగి అడుగుపెట్టాడు. దక్షిణాఫ్రికా, పాకిస్తాన్ టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు తీసిన తర్వాత అతని సహచరుడు షాహీన్ అఫ్రిది కూడా 3 మెట్లు ఎగబాకి 19వ స్థానానికి చేరుకున్నాడు. పాకిస్తాన్ బ్యాట్స్‌మెన్లలో, మహ్మద్ రిజ్వాన్ 4 స్థానాలు ఎగబాకి 16కు, బాబర్ ఆజం 2 స్థానాలు ఎగబాకి 22కు, సల్మాన్ ఆఘా 8 స్థానాలు ఎగబాకి 30వ స్థానానికి చేరుకున్నారు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఆదిల్ రషీద్ మూడు స్థానాలు ఎగబాకి మూడవ స్థానాన్ని దక్కించుకున్నాడు. వన్డే బౌలర్లలో పేసర్లు జోష్ హాజిల్‌వుడ్, మిచెల్ స్టార్క్ కూడా మంచి ఫలితాలను సాధించారు. వరుసగా 10వ, 21వ స్థానాలకు ఎగబాకారు. వెస్టిండీస్‌పై స్థిరమైన ప్రదర్శన తర్వాత బంగ్లాదేశ్ స్పిన్నర్ మెహిదీ హాసన్ మీరాజ్ ఆరు స్థానాలు ఎగబాకి 18వ స్థానానికి చేరుకున్నారు.

## వాణిజ్యం

# ఐటి రంగానికి కొత్త ఊపు



### పెరుగుతున్న నియామకాలు!
### తొలి ఆరునెలల్లోనే 27 శాతం వృద్ధి

**న్యూఢిల్లీ, అక్టోబరు 22:** భారత ఐటీ రంగానికి క్రమేపీ కొత్త ఊపు వచ్చింది. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న ఫ్రెషర్లకు ఇది నిజంగా మంచి పరిణామమే. ప్రాజెక్టులు పుంజుకోవడంతో కంపెనీలు మళ్లీ నియామకాల బాట పట్టాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి ఆరు నెలల్లో నియామకాలు ఏకంగా 27 శాతం పెరిగాయని మానవ వనరుల సేవల సంస్థ 'అడెకో ఇండియా' తన నివేదికలో వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి అర్ధభాగంతో పోలిస్తే ఈసారి నియామకాలు గణనీయంగా పెరిగాయి.

ముఖ్యంగా ఫ్రెషర్ల నియామకాలపై కంపెనీలు దృష్టి సారించడం సానుకూల పరిణామం. ఫ్రెషర్ల నియామకాలు గత ఏడాదితో పోలిస్తే 25 శాతం పెరిగాయి. అయితే, కంపెనీలు తమ నియామక వ్యూహాన్ని మార్చుకున్నాయి. కేవలం పేరున్న ఇంజనీరింగ్, టెక్నికల్ కళాశాలలకే ప్రాధాన్యం ఇస్తున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి అధునాతన నైపుణ్యాలు ఉన్నవారికే అవకాశాలు కల్పిస్తున్నాయి.

గతంలో మాదిరిగా ఆఫర్ లెటర్ ఇచ్చి శిక్షణ ఇవ్వడం కాకుండా, అవసరమైన నైపుణ్యాలపై కాలేజీల్లోనే శిక్షణ ఇచ్చి ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నాయని అడెకో ఇండియా డైరెక్టర్ సంకేత్ చెంగప్ప వివరించారు. నియామకాలతో పాటు ఉద్యోగుల జీతాల్లోనూ పెరుగుదల కనిపిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో ఐటీ ఉద్యోగుల జీతాలు సగటున 5 శాతం పెరిగాయి.

మరోవైపు, ఐటీ, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి ప్రత్యేక విభాగాల్లో నిపుణుల కొరత తీవ్రంగా ఉంది.

ఈ రంగాల్లో 45 నుంచి 50 శాతం వరకు నైపుణ్యం ఉన్నవారి కొరత ఉన్నట్లు పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. గతంలో బెంగళూరు, హైదరాబాద్, పుణె వంటి పెద్ద నగరాలకే పరిమితమైన ఐటీ కంపెనీలు ఇప్పుడు విశాఖపట్నం, ఇండోర్, కోయంబత్తూర్ వంటి ద్వితీయ శ్రేణి నగరాలపైనా దృష్టి సారిస్తున్నాయి.

ఈ నగరాల్లో నియామకాలు 7 శాతం పెరిగాయి. అయినప్పటికీ, ఇప్పటికీ ప్రధాన నియామకాలు పెద్ద నగరాల్లోనే జరుగుతున్నాయి. సుమారు 50 ఐటీ కంపెనీల ఆర్థిక ఫలితాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించినట్లు అడెకో ఇండియా తెలిపింది.

## చోక్సీని భారత్‌కు అప్పగించేందుకు
# ఎలాంటి అడ్డంకుల్లేవ్!
### స్పష్టంచేసిన బెల్జియం కోర్టు

**బ్రస్సెల్స్, అక్టోబరు 22:** పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంలో పారిపోయిన వ్యాపారవేత్త, ఆర్థిక నేరగాడు మెహుల్ చోక్సీని భారత్‌ను తీసుకువచ్చేందుకు మార్గం సుగమమైంది. చోక్సీని భారత్‌కు అప్పగించే విషయంలో బెల్జియం కోర్టు బుధవారం కీలక వ్యాఖ్యలు చేసింది. భారత్, బెల్జియన్ చట్టాల ప్రకారం చోక్సీని భారత్‌కు అప్పగించడంలో ఎలాంటి అడ్డంకులు లేవని స్పష్టం చేసింది. బెల్జియంలోని ఆంట్వెర్ప్‌లోని ఒక కోర్టు తన తీర్పులో చోక్సీ నేరాలు భారత శిక్షాస్మృతిలోని సెక్షన్లు 120బి, 201, 409, 420, 477ఎ కింద చట్టం ప్రకారం శిక్షార్హమైనవని తెలిపింది. చోక్సీపై మోసం, దుర్వినియోగం, ఫోర్జరీ అభియోగాలు బెల్జియన్ చట్టం ప్రకారం కూడా శిక్షార్హమైనవని కోర్టు స్పష్టం చేసింది. ఛోక్సీ బెల్జియం పౌరుడు కాదని గుర్తుచేసింది. నేరాలు 2016 డిసెంబర్ 31 ఒకటి జనవరి 2019 మధ్య భారత్‌లో జరిగాయని, బెల్జియన్ చట్టం ప్రకారం ప్రాసిక్యూషన్ కాలపరిమితికి లోబడి ఉండదని తీర్పు స్పష్టం చేసింది.



అయితే, భారత్ ఆదేశాలకు తనను ఆంటిగ్వా నుంచి కిడ్నాప్ చేశారంటూ చోక్సీ చేసిన వాదలను కోర్టు తోసిపుచ్చింది. ఆరోపణలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవంటూ కొట్టిపడేసింది. చోక్సీ అప్పగింత అనంతరం అతడిని ఉంచే జైలుకు సంబంధించి భారత ప్రభుత్వం అందించిన వివరాలను ఈ సందర్భంగా కోర్టు ప్రస్తావించింది. అంట్వర్ప్‌లోని కోర్టు చోక్సీని భారత్‌కు అప్పగించేందుకు ఆమోదం తెలిపింది. భారత్‌కు చోక్సీని అప్పగిస్తే ఆయనను ముంబయిలోని ఆర్థర్ రోడ్ జైలులోని బ్యారక్ నెంబర్ 12లో ఉంచుతామని అధికారులు కోర్టుకు హామీ ఇచ్చారు. బ్యారక్ దాదాపు 46 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంటుందని రెండు సెల్‌లు, ప్రైవేట్ టాయిలెట్ సౌకర్యాలు ఉన్నాయని, వైద్య సహాయం ఉంటుందని అధికారులు తెలిపారు. అయితే, తాను అనారోగ్యంతో ఇబ్బందిపడుతున్నానని.. సరైన చికిత్స అందదని చోక్సీ చేసిన వాదనలు కోర్టు తోసిపుచ్చింది.



# రూపాయి క్షీణత కట్టడికి ఆర్బీఐ డాలర్ విక్రయాలు!

**ముంబయి, అక్టోబరు 22:** అంతర్జాతీయ పరిణామాలు, అమెరికా కఠిన నిర్ణయాల నేపథ్యంలో తీవ్ర ఒత్తిడికి గురవుతున్న భారత రూపాయికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అండగా నిలిచింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ మరింత పడిపోకుండా నిరోధించేందుకు భారీ ఎత్తున చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆగస్టు నెలలో ఏకంగా 7.69 బిలియన్ అమెరికన్ డాలర్లను (సుమారు రూ. 67 వేల కోట్లు) మార్కెట్లో విక్రయించినట్లు ఆర్బీఐ తన తాజా బులెటిన్‌లో వెల్లడించింది. ఇటీవల డాలర్‌తో రూపాయి మారకం విలువ రికార్డు స్థాయిలో 88కి పడిపోయిన సంగతి తెలిసిందే. ఆగస్టు నెలలో రూపాయి విలువ 1.6 శాతం వరకు క్షీణించడంతో కేంద్ర బ్యాంక్ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. మార్కెట్లో డాలర్లకు డిమాండ్ పెరిగినప్పుడు రూపాయి బలహీనపడుతుంది. అటువంటి సమయంలో ఆర్బీఐ తన విదేశీ మారక నిల్వల నుంచి డాలర్లను అమ్ముతుంది. దీనివల్ల మార్కెట్లో డాలర్ల సరఫరా పెరిగి, రూపాయి విలువ స్థిరపడుతుంది. జులై నెలతో పోలిస్తే ఆగస్టులో ఆర్బీఐ విక్రయించిన డాలర్లు ఏకంగా మూడు రెట్లు అధికం కావడం గమనార్హం. మార్కెట్లో తీవ్రమైన అనిశ్చితి ఉన్నప్పుడు మాత్రమే తాము జోక్యం చేసుకుంటామని ఆర్బీఐ స్పష్టం చేసింది. ఒకవైపు డాలర్లను విక్రయిస్తూనే మరోవైపు ఆర్బీఐ వ్యూహాత్మకంగా బంగారం నిల్వలను పెంచుకుంటోంది. రెండు నెలల విరామం తర్వాత సెప్టెంబర్‌లో కొత్తగా 200 కిలోల పసిడిని కొనుగోలు చేసింది. దీంతో ఆర్బీఐ వద్ద ఉన్న మొత్తం బంగారం నిల్వలు 880.18 టన్నులకు చేరాయి. దీని విలువ సుమారు రూ. 8.36 లక్షల కోట్లుగా ఉంది. ఏ దేశ కేంద్ర బ్యాంకు వద్దనైనా బంగారం నిల్వలు ఎక్కువగా ఉంటే, ఆ దేశ ఆర్థిక వ్యవస్థ, కరెన్సీపై అంతర్జాతీయంగా నమ్మకం పెరుగుతుంది. సంక్షోభ సమయాల్లో బంగారం సురక్షితమైన ఆస్తిగా పనిచేస్తుంది. విదేశీ మారక నిల్వల్లో డాలర్ల వంటి కరెన్సీలు ఉన్నప్పటికీ, బంగారం నిల్వలు ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వాన్ని ఇస్తాయి. అధిక బంగారం నిల్వలు దేశ రేటింగ్ మెరుగుపడటానికి కూడా దోహదపడతాయి. తద్వారా తక్కువ వడ్డీకే అంతర్జాతీయ రుణాలు పొందే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆర్బీఐ చేపడుతున్న ఈ ద్వంద్వ వ్యూహం రూపాయిని బలోపేతం చేయడానికేనని విశ్లేషకులు భావిస్తున్నారు.




# సత్యనాదెళ్లకు రూ.800 కోట్ల ప్యాకేజి

**రెడ్మండ్(యుఎస్ఎ), అక్టోబరు 22:** టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల వేతనం రికార్డుస్థాయిలో పెరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆయన ఏకంగా 96.5 మిలియన్ డాలర్ల (సుమారు రూ.800 కోట్లకుపైగా) వేతన ప్యాకేజీని అందుకున్నారు. గత దశాబ్ద కాలంలో ఆయన సీఈఓగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇదే అత్యధిక వేతనం కావడం విశేషం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో కంపెనీ సాధించిన అసాధారణ విజయాలకు గుర్తింపుగానే ఆయన జీతాన్ని భారీగా పెంచినట్లు తెలుస్తోంది. మైక్రోసాఫ్ట్ రెగ్యులేటరీ ఫైలింగ్ ప్రకారం, నాదెళ్ల వేతనంలో అధిక భాగం షేర్ల రూపంలోనే ఉంది. ఆయన ప్రాథమిక వేతనం 2.5 మిలియన్ డాలర్లు కాగా, మిగిలిన 90 శాతం కంపెనీ షేర్ల రూపంలో అందుకోనున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ఆయన 79.1 మిలియన్ డాలర్ల వేతనం అందుకున్నారు. ప్రస్తుతం టెక్నాలజీ ప్రపంచంలో ఏఐ ఒక పెను మార్పునకు కారణమవుతోందని, ఈ కీలక సమయంలో సత్య నాదెళ్ల, ఆయన నాయకత్వ బృందం మైక్రోసాఫ్ట్‌ను ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిపారని కంపెనీ బోర్డు వాటాదారులకు తెలియజేసింది. సత్య నాదెళ్ల నాయకత్వంలో మైక్రోసాఫ్ట్ షేరు విలువ ఈ ఏడాదిలోనే దాదాపు 23 శాతం పెరిగింది. ముఖ్యంగా అమెజాన్ వెబ్ సర్వీసెస్ వంటి పోటీదారులను అధిగమిస్తూ కంపెనీకి చెందిన అజూర్ క్లౌడ్ కంప్యూటింగ్ వ్యాపారం నిలకడగా వృద్ధి చెందుతోంది.

ఒకప్పుడు చిన్న స్టార్టప్‌గా ఉన్న ఓపెన్‌ఏఐలో ముందుచూపుతో పెట్టుబడులు పెట్టడం నాదెళ్లకు బాగా కలిసొచ్చింది. చాట్‌జీపీటీ సంచలనం సృష్టించడంతో మైక్రోసాఫ్ట్ ఆ సంస్థలో తన పెట్టుబడులను 10 బిలియన్ డాలర్లకు పైగా పెంచింది. సత్య నాదెళ్ల వ్యూహాత్మక నిర్ణయాల వల్లే మైక్రోసాఫ్ట్ క్లౌడ్, ఏఐ రంగాల్లో అగ్రస్థానానికి చేరింది. లింక్డ్ఇన్, గిట్‌హబ్, యాక్టివిజన్ బ్లిజార్డ్ వంటి కీలక సంస్థలను కొనుగోలు చేసి సాఫ్ట్‌వేర్, గేమింగ్, ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ రంగాల్లోనూ కంపెనీని విస్తరించారు.

# పండగ సీజన్‌లో రికార్డు గరిష్టానికి యుపిఐ పేమెంట్స్





**ముంబయి, అక్టోబరు 22:** పండగ సీజన్‌లో డిజిటల్ చెల్లింపులు సరికొత్త గరిష్టాలకు చేరుకున్నాయి. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలు మునుపెన్నడూ లేనంతగా పెరిగి ఆల్‌టైమ్ రికార్డులను సృష్టిస్తున్నాయి. దీపావళి కొనుగోళ్ల జోరుతో యూపీఐ చెల్లింపుల వ్యవస్థ సరికొత్త మైలురాళ్లను అధిగమించింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం, అక్టోబర్ నెలలో యూపీఐ ద్వారా జరుగుతున్న సగటు రోజువారీ లావాదేవీల విలువ ఏకంగా రూ. 94,000 కోట్లకు చేరింది. సెప్టెంబర్ నెలతో పోలిస్తే ఇది 13 శాతం అధికం కావడం గమనార్హం. గత కొన్నేళ్లుగా నెలవారీగా చూస్తే ఇదే అత్యధిక వృద్ధి అని నిపుణులు చెబుతున్నారు. ఈ నెల ఇంకా వారం రోజులు మిగిలి ఉండగానే, యూపీఐ తన జీవితకాలంలోనే అత్యుత్తమ నెలవారీ ప్రదర్శనను నమోదు చేసే దిశగా దూసుకెళ్తోంది. దీనికి దీపావళి పండగతో పాటు ఇటీవల జీఎస్టీ రేట్లలో వచ్చిన మార్పులు కూడా కారణంగా నిలుస్తున్నాయి. ఈ నెల 20న దీపావళి సందర్భంగా చెల్లింపులు భారీగా పెరిగాయి. పండగకు ముందు రోజు యూపీఐలో ఒక్కరోజే 74 కోట్ల లావాదేవీలు జరిగి ఆల్‌టైమ్ రికార్డు సృష్టించాయి. ఈ నెలలో ఇప్పటివరకు సగటున రోజుకు 69.5 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. సెప్టెంబర్‌లోని 65.4 కోట్ల రికార్డును ఇది అధిగమించింది. సాధారణంగా నెల ఆరంభంలో జీతాలు, ఈఎంఐ చెల్లింపుల కారణంగా లావాదేవీలు ఎక్కువగా ఉండి, నెల మధ్యకు వచ్చేసరికి తగ్గుముఖం పడతాయి. కానీ, ఈసారి పండగ ప్రభావంతో ఆ ధోరణి మారింది. ఈ నెల 20 నాటికే, రోజువారీ లావాదేవీల విలువ ఆరుసార్లు లక్ష కోట్ల రూపాయల మార్కును దాటింది. సెప్టెంబర్‌లో ఈ ఘనత కేవలం మూడుసార్లే నమోదైంది. ఈ దూకుడు చూస్తుంటే, ఈ నెలలో మొత్తం లావాదేవీల విలువ తొలిసారిగా రూ. 28 లక్షల కోట్లు దాటుతుందని, గత రికార్డయిన రూ. 25 లక్షల కోట్ల మార్కును అధిగమిస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.